www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 221 | గురువారం | 31 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



నుమాయిష్‌లో ఎగిసిన

మంటలు

480 స్టాల్స్ దగ్ధం

ఆంధ్రాబ్యాంక్ స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్

సకాలంలో స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం

తప్పిన ప్రాణ నష్టం

కోట్లాది రూపాయల ఆస్తి నష్టం

3

మోడీలా

రాహుల్ గ్రాఫ్ పెరగలా









ఫెడరల్ ఫ్రంటే కీలకం:

చౌపల్ ఆన్ ట్విట్టర్‌లో ఎంపి కవిత

మన తెలంగాణ/హైదరాబాద్

దేశరాజకీయాల్లో ప్రధాని మోడీ గ్రాఫ్ క్షీణిస్తోందని, రాహుల్‌గాంధీ గ్రాఫ్ పెరగడంలేదని పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలక భూమిక పోషిస్తాయని, అన్నిరాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు సత్తా చాటాలన్నారు. విదేశాంగ విధానం, కశ్మీర్ సమస్య, చైనా వివాదం, రక్షణ వ్యవహారాలు తదిత రాలపై దృష్టి పెట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని అప్రాధాన్యం చేస్తూ రాష్ట్రాలపై పెత్తనం చేస్తోందని, రాష్ట్ర

ప్రియాంక కాంగ్రెస్ ఫుల్‌టైమ్ అతిథి



ప్రభుత్వాల అంశాల్లో జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఇప్పటివరకూ ఎలాంటి నిధులనూ విడుదల చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నీతి అయోగ్ సిఫార్సుల మేరకు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు రూ. 24 వేల కోట్ల కేటాయించడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. 'చౌపల్ ఆన్ ట్విట్టర్' ద్వారా బుధవారం నిర్వహించిన ప్రత్యక్ష కార్యక్రమంలో ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు ఎంపి కవిత పై విధంగా బదులిచ్చారు. కేంద్ర రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కవిత కేవలం ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం రామమందిరం అంశాన్ని తెరపైకి తెస్తోందని, దేవుడి నెత్తిమీదే టోపీ పెట్టిందన్నారు. మందిర్, మసీదు రాజకీయాలకు అతీతంగా ప్రజలు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. దేశ అభివృద్ధి, భవిష్యత్తు కోసం పనిచేసే పార్టీలను, వ్యక్తులను

అన్న కెటిఆర్‌కు వందకు వంద మార్కులు



తరువాయి 6లో

12

రేపే కేంద్ర మధ్యంతర బడ్జెట్



ప్రతిపాదించనున్న పీయూష్ గోయల్

అరణ్యవాసం ముగిసిన

సీతారామ

ప్రాజెక్టుకు తుది అటవీ అనుమతులు

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి తుది అటవీ అనుమతులు మంజూరయ్యాయి. ఈ మేరకు చెన్నైలోని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి డాక్టర్ కె. నాగేశ్ కుమార్ నుంచి రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శికి గురువారం లేఖ అందింది. దీంతో 1531 హెక్టార్ల అటవీ భూమిని ప్రాజెక్టు అవసరాల నిమిత్తం వినియోగించుకునేందుకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. మొదటి దశ అటవీ అనుమతులు లభించిన సరిగ్గా ఏడాదికి రెండో దశ (తుది దశ) అనుమతులు రావడం గమనార్హం. సీతారామ ప్రాజెక్టుకు తుది అటవీ అనుమతులు రావడంతో మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, ఖమ్మం డివిజన్లలోని అటవీ భూములను వినియోగించుకోడానికి మార్గం సుగమమైంది. ఈ భూముల్లో ప్రాజెక్టుకు అవసరమైన కెనాళ్లు, టన్నెళ్లు, విద్యుత్ లైన్ల నిర్మాణపు పనులు చేసుకోడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చట్టపరంగా సౌకర్యం ఏర్పడింది. కొత్త



తరువాయి 6లో

రాష్ట్రంలో బహుళ

జిఎస్‌టిలు

వ్యాపారం ఎన్ని చోట్ల ఉంటే అన్ని జిఎస్‌టి నంబర్లు



చట్టానికి రాష్ట్ర ప్రభుత్వ సవరణ చేస్తూ ఆర్డినెన్స్

1నుంచి అమలు, కొత్తగా 8 అంశాలు

చిన్న వ్యాపారుల కాంపోజిషన్ లెవీ కోటి నుంచి కోటిన్నరకు

మోటారు వాహనాల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు నిబంధనలు

అప్పీళ్లకు గడువు రెండు వారాలకు పెంపు

రిటర్న్‌లు, ఐటిసి క్లైమ్‌లకు సరళీకృత విధానం

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నిచోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే అన్నిచోట్లా జిఎస్‌టి (వస్తు సేవల పన్ను) రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకు ఒక వ్యాపారికి ఒకే రాష్ట్ర పరిధిలో పలుచోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే ఒకే జిఎస్‌టి రిజిస్ట్రేషన్ నెంబర్‌తో వ్యాపారాలావాదేవీలను నిర్వహించుకోవాలనే నిబంధన ఉండేది. అయితే ఢిల్లీలో ఇటీవల జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రాలు వాటివాటి అవసరాన్ని బట్టి రాష్ట్ర జిఎస్‌టి చట్టంలో మార్పులు చేర్పులు చేసుకోడానికి వీలు కల్పిస్తూ నిర్ణయం జరిగింది. ఆ ప్రకారం ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర జిఎస్‌టి చట్టానికి సవరణలు చేసే ఉద్దేశంతో ఆర్డినెన్సును రూపొందించింది. ఇందులో ఎనిమిది అంశాలను ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ మేరకు రాష్ట్ర వస్తు సేవల పన్ను ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ బుధవారం జారీ చేశారు. ఈ విషయాన్ని న్యాయ శాఖ కార్యదర్శి

తరువాయి 6లో

గజగజ మరి మూడు రోజులు

3

ఆదిలాబాద్‌లో 7° | హైదరాబాద్‌లో 9°

చేనేతల శ్రేయోభిలాషి, మాజీ మంత్రి

కెవి కేశవులు కన్నుమూత

సిఎం కెసిఆర్ సంతాపం

మన తెలంగాణ /హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ చేనేత మంత్రి కెవి కేశవులు(97) స్థానిక అమీర్‌పేటలోని తన నివాసంలో గురువారం సాయంత్రం మృతి చెందారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కేశవులు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేశారని, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడని కొనియాడారు. జలగం వెంగళరావు హయాంలో చేనేత మంత్రిగా పనిచేసిన కేశవులు చేనేతకారులకు ప్రయోజనం చేకూరే విధంగా వారు నేసిన వస్త్రాలకు మార్కెటింగ్

తరువాయి 6లో



కుంచెపోటు



వ్యవసాయ, అనుబంధ రంగాలు ఒకే గొడుగు కిందకు


ఓలా, ఊబర్ తరహాలో సాగుకు అద్దె యంత్రాలు : సిఎస్

3

నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి 21 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

2

రూ.34 వేలు దాటిన బంగారం ధర



9

పంచాయతీపి గులాబీకే

చివరి విడతకు తెర

మూడు విడతల్లో 7743 సర్పంచ్‌లు టిఆర్ఎస్ కైవసం

మూడో దశలో 2501 పంచాయతీల్లో గెలుపు

2న సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం

3

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ఘట్టం బుధవారంతో ముగిసింది. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి సత్తా చాటింది. రెండు విడతల్లో సింహభాగం పంచాయతీలను కైవసం చేసుకున్న గులాబీ పార్టీ మూడో విడతలోనూ అదేజోరును ప్రదర్శించింది. మొత్తంగా ఏకగ్రీవాలతో పాటు అన్ని విడతలు కలిపి (రాత్రి 11 గంటల వరకు) 7743 సర్పంచ్‌లను టిఆర్ఎస్ తన ఖాతాలో వేసుకుంది. ఇక మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4,116 గ్రామ పంచాయతీలకు గాను 3505 పంచాయతీలకు బుధవారం ఎన్నికలు జరిగాయి. 10 పంచాయతీలకు నామినేషన్లు రాకపోవడంతో అక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. అలాగే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మంగపేట మండలంలో 24 పంచాయతీలకు, 180 వార్డులకు ఎన్నికలు వాయిదా వేశారు. మిగిలిన వాటిలో ఏకగ్రీవాలతో కలిపి టిఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు 2501 గ్రామ పంచాయతీలు కైవసం చేసుకున్నారు. 952 పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. టిడిపి 13 పంచాయతీల్లో, 59 పంచాయతీల్లో బిజెపి, 19 పంచాయతీల్లో

తరువాయి 6లో



నిజామాబాద్ జిల్లా పోతన్‌గల్ గ్రామంలో ఓటేసిన కవిత

భాషాపండితులకు త్వరలో తీపి కబురు

మండలి చీఫ్‌విప్ పాతూరి

మనతెలంగాణ/హైదరాబాద్: భాషాపండితులకు త్వరలోనే తీపి కబురు అందనున్నది. వారికి స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగా పదోన్నతి కల్పించే హామీ నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఓఎస్‌డి దేశపతి శ్రీనివాస్‌తో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయకుమార్‌తో బుధవారం నాడు ఈ అంశంపై లోతుగా చర్చించామని టిఆర్‌ఎస్ ఎల్‌పిలో ఆయన మీడియాకు చెప్పారు. తమ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి నివేదిస్తానని విజయ్ కుమార్ హామీ ఇచ్చారని పాతూరి తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పని చేసే వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ టీచర్ల తరహాలోనే భాషా పండితులకు పదోన్నతి కల్పించే విషయంలో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకనుగుణంగా చర్యలు ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే భాషాపండితులు తీపి కబురు వింటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

ఎంపి బరిలోకి దిగుతా : అద్దంకి

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని టిపిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. ఈవిఎంలో జరిగిన అవకతవకల వల్లే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. వాటి పనితీరుపై ఇంకా అనుమానాలు ఉన్నాయన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దయాకర్ మాట్లాడుతూ, ఈవిఎంలలో జరిగిన ట్యాపరింగ్‌పైన విచారణకు ఆదేశించాలని కోరుతూ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశామన్నారు. వివి ప్యాట్ల లెక్కింపుపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు.

రూ.లక్ష కోట్లతో రుణవిధాన పత్రం

- 70 శాతం కేటాయింపులు వ్యవసాయ, అనుబంధ రంగాలకే
- పంట రుణాలకు గతేడాది కంటే రూ.3441 కోట్లు అధికం
- 2019-20 ఫోకస్ పేపర్ విడుదల చేసిన సిఎస్



మన తెలంగాణ/హైదరాబాద్: రూ. ఒక లక్ష 1378 కోట్లతో రాష్ట్ర రుణ ప్రణాళిక ఉండాలని నాబార్డు నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకులకు దిశానిర్దేశం చేస్తూ బుధవారం 'రాష్ట్ర రుణ విధాన పత్రం 2019–20'ను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె జోషి విడుదల చేసిన ఈ రుణ విధాన పత్రంలో మొత్తం రుణాల్లో 70 శాతం వ్యవసాయ, పంట రుణాలకే కేటాయించాలని సూచించింది. 2018–19 విధాన పత్రంలో రాష్ట్ర రుణ పరిమితి రూ. 83,388 కోట్లు కాగా, ఈసారి అదనంగా రూ. 17,990 కోట్లు అంచనాలు చూపడం గమనార్హం. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నందున ఆ మేరకు కేటాయింపులు భారీగా పెంచాలన్నది నాబార్డు ఉద్దేశంగా కనిపిస్తుంది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాలకు రుణ కేటాయింపులు ఎలా ఉండాలన్న దానిపై నాబార్డు అన్ని జిల్లాల నుంచి వివిధ శాఖల ద్వారా క్షేత్రస్థాయి వివరాలను సేకరించింది. వాటిని క్రోడీకరించి ఈ రుణ విధాన పత్రాన్ని విడుదల చేసింది. దీని ఆధారంగా రాష్ట్ర రుణ ప్రణాళికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బిసి) త్వరలో విడుదల చేయనుంది.

పంట రుణాలకు రూ. 49,785 కోట్లు

ఇక మొత్తం రుణ ప్రణాళికలో దాదాపు 70 శాతం కేవలం వ్యవసాయ, అనుబంధ రంగాలకే కేటాయింపులు ఉండాలని నాబార్డు ప్రస్తావించింది. దీని ప్రకారం రూ. 70,965 కోట్లు వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ సహా అనుబంధ రంగాలన్నింటికీ రుణాలు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని తెలియజేసింది. అందులో రూ. 46,344 కోట్లు పంట రుణాలకు కేటాయించాలని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఫోకస్ పేపర్‌తో పోలిస్తే అదనంగా రూ. 3,441 కోట్లు కేటాయించాలని పేర్కొంది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ. 2,833 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. వ్యవసాయ మార్కెటింగ్‌లో మౌలిక సదుపాయాలు, గోదాములకు రూ. 1401 కోట్లు కేటాయించాలని సూచించింది. గృహ రుణాలకు రూ. 5,834 కోట్లు, విద్యా రుణాలకు రూ. 2009 కోట్లు అంచనా వేసింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ఏయే రంగాలకు చెందిన లబ్ధిదారులకు ఎంతెంత రుణాలు ఇవ్వాల్సిన అవసరముందో నాబార్డు క్షేత్రస్థాయి సర్వేల ద్వారా అంచనా వేసింది.

సోయాబీన్, పప్పుధాన్యాల సాగు పెంచాలి

రాష్ట్రంలో పంటల మార్పిడి జరగాల్సిన అవసరాన్ని నాబార్డు గుర్తించింది. సోయాబీన్, పప్పుధాన్యాల సాగును పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సన్న చిన్నకారు రైతులే లక్ష్యంగా రుణ ప్రణాళిక ఉండాలని నాబార్డు సూచించింది. తెలంగాణలో వారి సంఖ్యే అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగానే రుణ ప్రణాళికను ఖరారు చేయాలని బ్యాంకులకు సూచించింది. అందుకే 2018–19 కంటే 2019–20 పంట రుణాలను 17 శాతం పెంచినట్లు వివరించింది. సాగు ఖర్చు పెరుగుతుండటం, కూలీల కొరత కారణంగా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై దృష్టిసారించడంతో అందుకు రుణాల కోసం రూ. 1145 కోట్లు కేటాయించింది.

రుణ విధాన పత్రం అంచనాలు ఇలా (రూ. కోట్లలో)

పంట రుణాలు	49,785
నీటి వనరుల నిర్వహణ	911.95
యాంత్రీకరణ	2833.47
ఉద్యాన, పట్టుపరిశ్రమ	1259.94
అటవీ, నిరుపయోగభూమి అభివృద్ధి	99.57
పశుసంవర్ధక శాఖ, డెయిరీ, పౌల్ట్రీ,మత్స్య	3825.75
ఇతర వ్యవసాయ రుణాలు	2741.24
వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన	2318.37
ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు	1145.98
వ్యవసాయ సహాయక కార్యాకలపాలు	6043.31
మైక్రో, చిన్నతరహా ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఇ)	21,065
విద్య రుణాలు	2009.41
గృహ రుణాలు	5834.94
పునరుత్పాదక ఎనర్జీ	317.38
సోషల్ ఇన్‌ఫ్రాస్టక్చర్	1008.92
ఇతరములు	176.80
మొత్తం	**1,01,378.60**

నాలుగున్నరేళ్లలో 21 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



ఫిక్కీ సదస్సులో జయేష్ రంజన్ వెల్లడి

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాలుగున్నర ఏళ్లలో 21 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ వెల్లడించారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా ఐపాస్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీని ద్వారా 8500 కంపెనీలకు కేవలం 15 రోజుల్లో అనుమతులు ఇచ్చామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఐ పాస్ కు విపరీతమైన ఆదరణ లభించిందని, అనుమతుల్లో ఆలస్యం జరిగితే అది ఏ వ్యక్తి వలన జరిగిందో వారి వేతనంలో కోత విధించడం ద్వారా పగడ్బందీగా నిర్వహించగలిగామని వివరించారు. దీనివల్ల అనేక బహుళజాతి కంపెనీలు తెలంగాణ రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపించాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకిన్ తెలంగాణలో భాగంగా ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్, జౌళి పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని రూపకల్పన చేసిందని తెలిపారు.
ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 375 ఎకరాలలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ప్రత్యేకంగా ప్లాస్టిక్, పాలిమర్ ఇండస్ట్రీల కోసం వంద ఎకరాలను కేటాయించినట్టు ఆయన వివరించారు. లాజిస్టిక్ పార్కు కోసం 100 ఎకరాల స్థలం కేటాయించామని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్బీఐ మాజీ గవర్నర్, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ ఐవి రెడ్డి, ఫిక్కి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీత రెడ్డి, సెక్రటరీ జనరల్ దిలీప్ చినాయ్, తెలంగాణ కోచైర్‌పర్సన్ మురళీధరన్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రణయ్... మళ్లీ పుట్టాడు

- హత్యకు గురైన ప్రణయ్ ప్రతిరూపంగా మగ బిడ్డకు జన్మనిచ్చిన అమృత
- హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం



మన తెలంగాణ / మిర్యాలగూడ క్రైమ్ : తన ప్రేమకు మరణం లేదు... ప్రణయ్ రూపంలో మళ్ళీ తిరిగి వస్తాడని పరువు హత్యకు గురైన ప్రణయ్ భార్య అమృత అన్న మాటలు నిజమయ్యాయి. బుధవారం హైద్రాబాద్‌లోని ఫెర్నాండెజ్ హస్పిటల్‌లో అమృత పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్యకు గురైన సంగతి తెలిసిందే. ప్రేమ పెళ్లి చేసుకున్న పెరుమాళ్ల ప్రణయ్, అమృతలు మిర్యాలగూడలోని జ్యోతి హస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో హస్పిటల్ భయట ప్రణయ్ దారుణ హత్యకు గురిఅయిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. అప్పటికే ఆరు నెలల గర్భిణీగా ఉన్న ప్రణయ్ భార్య అమృత ఆ సమయాన పడిన మనోవేదన వర్ణానాతీతం. తన కళ్ల ఎదుటే తన భర్తను చంపిన దృశ్యాన్ని చూసిన అమృత తట్టుకోలేక పోయింది. తనలాగా మరో ప్రేమ జంటకు జరగకూడదని ఆ రోజు నుండి న్యాయపోరాటం చేస్తూ తన కడుపులో ప్రాణం పోసుకుంటున్న తన ప్రేమకు ప్రతిరూపాన్ని కష్టాన్ని దిగమింగుకుని 9నెలలు మోసింది. ఈ క్రమంలో ఎన్నో సమస్యలు, బెదిరింపులు, అంతకుమించి జరిగిన సంఘటనలను తట్టుకున్న అమృత ఎట్టకేలకు తన ప్రేమను బతికించుకుంది.

తిరుమలాపూర్‌లో రీపోలింగ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : వికారాబాద్ జిల్లాలోని పదూర్ మండలం, తిరుమలాపూర్‌లో రీపోలింగ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. తిరుమలాపూర్‌లోని వార్డు నెంబర్ 7 పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది కమిలిబాయి అనే ఓటరుని సూచించిన గుర్తింపు కార్డు వేరు గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు వేసింది.
తరువాత కమిలి బాయి పేరుతో ఉన్న నిజమైన ఓటరు వచ్చింది. అప్పటికే ఆమె పేరు మీద కమిలి బాయి ఓటు వేసి వెళ్లింది. దీంతో పోలింగ్ ఏజెంట్లు కమిలి బాయిని ఓటరును ఎలా అనుమతించారన్న దానిపై అనుమానం వ్యక్తం చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం వార్డు నెంబర్ 07తో పాటు సర్పంచ్ ఎన్నికకు రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. రీపోలింగ్‌ను శుక్రవారం వార్డు నెంబర్ 07 కు, సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఆదేశాలిచ్చారు.

18న హోం కార్యదర్శి భేటీ

రెండు రాష్ట్రాల సిఎస్‌లకు లేఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి అధ్యక్షతన వచ్చే నెల 1వ తేదీన జరగాల్సిన సమావేశం వాయిదా పడడంతో 18న నిర్వహించేలా ఆ శాఖ డిప్యూటీ కార్యదర్శి ఎస్‌కె ఝా రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు గురువారం లేఖ రాశారు. సమావేశం ఎజెండా, స్థలం గతంలో పేర్కొన్నట్లుగానే ఉంటాయని, ఈ సమావేశానికి తప్పకుండా రెండు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకావాల్సిందిగా స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన, సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ ఇంజనీరింగ్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, విద్యుత్ డిస్కంలకు ఉన్న బకాయిలు, ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్స్ విభాగం, పదవ షెడ్యూలులోని సంస్థలవిభజన, తొమ్మిదవ షెడ్యూలులోని సంస్థల ఆస్తుల అప్పుల విభజన.. ఇలా మొత్తం ఎనిమిది ప్రధాన అంశాలతో కూడిన ఎజెండాను ఫిబ్రవరి 1వ తేదీ సమావేశం కోసం తయారు చేసింది వచ్చే నెల 18న జరిగే సమావేశానికి కూడా యధాతథంగా ఉంటుందని, ఢిల్లీలోని నార్త్‌బ్లాక్ (హోం మంత్రిత్వశాఖ కార్యాలయం)లో సమావేశం ఉంటుందని, ప్రత్యేక కార్యదర్శి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని ఎస్‌కె ఝా ఆ లేఖలో రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు స్పష్టం చేశారు.



హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో బిసి కమిషన్ భేటీ

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్‌తో బిసి కమిషన్ చైర్మన్ బి.ఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు,డాక్టర్ ఆంజనేయులు గౌడ్‌లు బుధవారం భేటీ అయ్యారు. ఈక్రమంలో బిసి నేతలు తెలంగాణ కమిషన్ ఇంగ్లీషు, తెలుగు భాషలతో ప్రచురించిన బిసి కమిషన్ల నివేదికలను చీఫ్ జస్టిస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులు తెలంగాణ బిసి రిజర్వేషన్ల పెంపుదలకు సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి గతంలో సమర్పించిన తొలి నివేదికలోని పలు అంశాలను చీఫ్ జస్టిస్ దృష్టికి తెచ్చినట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. రాష్ట్రంలో అమలులో ఉన్న రిజర్వేషన్ తీరు తెన్నులను, దేశంలో బిసి రిజర్వేషన్లకు ప్రామాణికంగా నిలిచిన పలు కమిషన్ల సిఫార్సులపై చర్చించారు. తెలంగాణ బిసి కమిషన్ ప్రచురించిన 'బిసి నోట్‌బుక్' ఇంగ్లీష్ తొలిప్రతితో పాటుగా, ఎస్.కె మురళీధర్‌రావు, జస్టిస్ ఒ. చిన్నపురెడ్డి నివేదికలను తెలుగు తొలిప్రతులను, పలు గ్రంధాలను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ చేస్తున్న కృషిని చీఫ్ జస్టిస్ ప్రత్యేకంగా అభినందించారు. ముమ్ముందు మరింత క్రియాశీలంగా కొనసాగించాలని తెలిపినAట్లు బి.ఎస్ రాములు వివరించారు.

2వ తేదీన సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం

గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఫిబ్రవరి రెండవ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 12,751 పంచాయతీలకుగానూ రాష్ట్ర ఎన్నికల సంఘం 12,705 పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలను నిర్వహించింది. 18 పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన కొనసాగడం, మూడింటికి వివిధ కారాణాలతో, మరో 25 పంచాయతీలకు కోర్టు ఉత్తర్వులతో ఎన్నిక వాయిదా పడింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం మొత్తం 12,705 పంచాయతీలకు బుధవారంతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసింది. కాగా గెలిచిన సర్పంచ్‌లతో పాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు రెండవ తేదీన వారివారి పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ కార్యదర్శి లేదా స్పెషల్ అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నకిలీ గుర్తింపులతో ఒ.పి రావత్ ఓటు

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : సిఇఒ రజత్ కుమార్

మన తెలంగాణ/హైదరాబాద్ : నకిలీ గుర్తింపు కార్డులు పెట్టి కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఒ.పి రావత్ ఓటు నమోదు చేశారని, దీని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ తెలిపారు. ఇవిఎంలు, వివిప్యాట్‌లతో ఎన్నికల నిర్వహణపై రేడియో జాకీలకు బేగంపేటలోని హరితప్లాజాలో బుధవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రజత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ సొసైటీలో రేడియోకు చాలా ప్రాముఖ్యత ఉందని, అందులో భాగంగానే రేడియో జాకీలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగరని వర్క్‌షాప్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటింగ్ జరుగుతుందని, అర్బన్‌లో పెంచేందుకు చర్యలు తీసుకుంAటున్నామన్నారు. ఓటరు తొలగించడం అంతా సులువు కాదని, నిబంధనల ప్రకారమే తొలగిస్తామన్నారు. ఓటరు గుర్తింపు కార్డు ఉండగానే ఓటు హక్కు ఉన్నట్లు కాదని, ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 1950 హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని, దీని ద్వారా అన్ని తెలుసుకోవచ్చునన్నారు.

నిలిచిపోనున్న విద్యుత్ సరఫరా

మన తెలంగాణ/హైదరాబాద్ : తాల్చేరు (ఒడిషా) నుంచి కోలార్ (దక్షిణాది) వరకు 500 కెవి హెచ్‌విడిసి లైన్‌లో విద్యుత్ సరఫరాను జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు నిర్వహణ నిమిత్తం నిలిపివేస్తున్నట్లు పవర్‌గ్రిడ్ కార్పోరేషన్ ప్రకటించింది. 2000 మెగావాట్ల విద్యుత్‌ను ఎన్టీపిసి తాల్చేరు నుంచి దక్షిణాది రాష్ట్రాలకు సరఫరా చేయడంలో ఈ కారిడార్ కీలకం. అయితే నిర్వహణ నిమిత్తం కారిడార్‌ను ఆపేయడంతో దక్షిణాది రాష్ట్రాలకు 2000 మెగావాట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో న్యూ (నార్త్, ఈస్ట్, వెస్ట్) గ్రిడ్ నుంచి దక్షిణాది గ్రిడ్‌కు సరఫరాపై కూడా గ్రిడ్ రక్షణ దృష్ట్యా నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్‌ఎల్‌డిసి) పలు ఆంక్షలు విధించింది. దీంతో తెలంగాణలోనూ ఫిబ్రవరి 6వ తేదీ వరకు విద్యుత్ కొరత ఎదురయ్యే అవకాశం ఉండడంతో ప్రజలు సహకరించాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్ ఆపరేషన్) బి.నర్సింగరావు ఒక ప్రకటనలో కోరారు. వీలైనంత మేర కోతలు లేకుండా సరఫరా చేస్తామని చెప్పారు.

మరో రెండు రోజులు చలిగాలులు

నాలుగు డిగ్రీలు తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు సగటున నాలుగు డిగ్రీల మేర తగ్గిపోవడంతో చలి వాతావరణ చోటుచేసుకుంది. రానున్న రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్‌లోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం, రాష్ట్ర ప్లానింగ్ సొసైటీలు పేర్కొన్నాయి. గాలిలో తేమ తగ్గడంతో పొడి వాతావరణం ఏర్పడుతోందని, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీస్తున్న చలి గాలుల వలన రాష్ట్రంలోని సాధారణ వాతావరణంలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని పేర్కొన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గరిష్టంగా మూడు డిగ్రీల మేరకు తక్కువగా నమోదవుతున్నాయని, గడచిన వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతూ ఉందని, మరో రెండు మూడు రోజుల పాటూ ఇలాగే ఉంటుందని పేర్కొన్నాయి. ఇక రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్టంగా ఏడు డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదుకాగా రామగుండంలో తొమ్మిది డిగ్రీలు నమోదైందని తెలిపారు. హన్మకొండలో సాధారణ రాష్ట్ర ఉష్ణోగ్రత 18 డిగ్రీలు నమోదుకావాల్సి ఉన్నప్పటికీ తొమ్మిది డిగ్రీలు తగ్గి కేవలం తొమ్మిది డిగ్రీల మేర నమోదైనట్లు వివరించారు. హైదరాబాద్‌లో జనవరి నెల చివర్లో సాధారణంగా 16 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదుకావాల్సి ఉన్నప్పటికీ ఏడు డిగ్రీలు తగ్గి తొమ్మిది డిగ్రీలు మాత్రమే నమోదైందని వివరించారు. రామగుండం, నిజామాబాద్, ఖమ్మం, హకీంపేట, భద్రాచలం తదితర ప్రాంతాల్లోనూ సగటున ఆరు డిగ్రీల మేర రాత్రి ఉష్ణోగ్రత తగ్గినందున చలి తీవ్రత ఉన్నట్లు ఆమె వివరించారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, నిజామాబాద్, జగిత్యాల తదితర జిల్లాల్లో రానున్న రెండు మూడు రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుందని, దక్షిణ తెలంగాణలో దాని ప్రభావం ఒక మేరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

నుమాయిష్‌లో ఎగిసిన మంటలు

- భారీ అగ్నిప్రమాదంతో 480 స్టాళ్లు దగ్ధం
- ఆంధ్రా బ్యాంక్ స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- ఇద్దరికి తీవ్రగాయాలు



మనతెలంగాణ/సిటీబ్యూరో : నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న నుమాయిష్‌లో బుధవారం రాత్రి 8.20గంటలకు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గాంధీ సెంటినరీ సమీపంలో ఏర్పాటు చేసిన ఆంధ్రా బ్యాంక్ స్టాల్‌లో విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పక్కనే ఉన్న స్టాళ్ళకు అంటుకుంది. పక్కన ఉన్న స్టాళ్ళన్నీ దుస్తులకు సంబంధించినవి కావడంతో నిమిషాల వ్యవధిలోనే దాదాపు 400కు పైగా స్టాళ్ళకు మంటలు అంటుకున్నాయి. సుమారు 80 సంవత్సరాలుగా జరుగుతున్న నుమాయిష్‌లో ఇంతటి భారీ స్థాయిలో అగ్నిప్రమాదం జరగడం ఇదే తొలిసారి. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. తొక్కిసలాటకు కూడా ఆస్కారం లేని విధంగా అక్కడి పోలీసులు, వాలంటీర్లు జాగ్రత్తలు తీసుకున్నారు. సుమారు పదిమందికి ఆక్సిజన్ అందక శ్వాసతో ఇబ్బంది పడ్డారు. తొలుత వీరిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని మాత్రం కేర్ ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదం కారణంగా కోట్లాది రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ప్రమాదం వార్త తెలుసుకున్న వెంటనే జిహెచ్‌ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దాన కిషోర్, పలువురు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఎగ్జిబిషన్ కమిటీ ఛైర్మన్ అయిన మాజీ మంత్రి ఈటల రాజేందర్, హోం మంత్రి మహమూద్ ఆలీ చేరుకున్నారు. ప్రమాదం సంఘటనపై విచారణ జరిపించి మానవ తప్పిదం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిహెచ్‌ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారని, మొత్తం 18 అగ్నిమాపక యంత్రాలు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయని పేర్కొన్నారు. గురువారం సుమారు 30 వేల మంది ఎగ్జిబిషన్‌కు వచ్చినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఆస్తినష్టంపై అంచనా వేసి నివేదికను సమర్పించాల్సిందిగా ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శిని హోం మంత్రి మహమూద్ ఆలీ ఆదేశించారు. సందర్శకులు వెళ్ళిపోయేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు మెట్రో రైల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు. అగ్ని ప్రమాదం కారణంగా నాంపల్లిలోని పలు రోడ్లపై ట్రాఫిక్ జాం ఏర్పడింది. వెంటనే పోలీసులు స్పందించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ఆంధ్రాబ్యాంక్ స్టాల్‌లో చెలరేగిన మంటలు పక్కనే డెనిమ్ కంపెనీ స్టాల్‌కు వ్యాపించడంతో భారీ నష్టం జరిగింది. విషయం తెలిసిన వెంటనే నగర మేయర్ రామ్మోహన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ దాన కిషోర్ అక్కడికి చేరుకుని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలను రప్పించారు. మంటలు విస్తృతం కావడంతో అగ్నిమాపక యంత్రాలకు అవసరమైన నీటిని సమకూర్చడానికి అదనపు వాటర్ ట్యాంకులను జలమండలి అధికారులు పంపారు. జిహెచ్‌ఎంసి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీములు, 18 ఫైరింజన్లు మంటలను ఆర్పేందుకు రాత్రి పదకొండున్నర గంటల వరకూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. పొగ వల్ల అస్వస్థతకు గురైన ఇద్దరు వ్యక్తులను కేర్ ఆస్పత్రికి తరలించారు. బుక్‌స్టాల్స్‌లోని గ్యాస్ ఫర్నీచర్, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, డెకరేట్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. నగర అదనపు పోలీసు కమిషనర్లు డిఎస్ చౌహాన్, షికా గోయల్, ట్రాఫిక్ డిసిపి బాబురావు, అడిషనల్ డిసిపి టాస్క్‌ఫోర్స్ చైతన్య కుమార్ సంఘటన స్థలంలో ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు : సిపి

అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. సందర్శకులు ఒక్కసారిగా బయటికి వచ్చేందుకు ప్రయత్నించడంతో స్వల్ప తొక్కిసలాట జరిగిందని అన్నారు. పోలీసులను సంఘటన స్థలానికి పంపించి పరిస్థితి అదుపుతప్పకుండా సిపి అంజనీకుమార్ పర్యవేక్షించారు. వదంతులను నమ్మవద్దని కోరారు. భారీ ఆస్తి నష్టం జరిగిందని సిపి తెలిపారు. జిహెచ్‌ఎంసి, జలమండలి, అగ్నిమాపక శాఖ, పోలీసు విభాగం, విపత్తు నిర్వహణా శాఖ తదితర అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలిగామని మేయర్ పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత కూడా మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్ అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆస్తి నష్టం భారీగానే జరిగిందని, వందలాది స్టాళ్ళు బుగ్గిపాలు కావడంతో వ్యాపారులు ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం తగిన తీరులో ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.







70 ఏళ్ల రైతు కన్నీటికి కాంగ్రెస్, బిజెపిలే కారణం

- అన్నదాతలపై మొసలి కన్నీరు
- దమ్ముంటే ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయండి : గుత్తా సుఖేందర్ రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్, బిజెపిలకు దమ్ముంటే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఛైర్మన్, నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతు సమస్యలను, వ్యవసాయాన్ని ప్రధానంగా ముందుకు తీసుకువస్తున్నారని, 70 ఏళ్ల రైతు కన్నీటికి ఆ రెండు పార్టీలే కారణమని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రైతులు కష్టాల నుంచి గట్టెక్కుతున్నారని, అందుకు సిఎం కె. చంద్రశేఖర్‌రావు తీసుకుంటున్న చర్యలే కారణమన్నారు. అన్ని విషయాలలో తెలంగాణ దేశానికే దిక్సూచిలా మారిందన్నారు. హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుత్తా మాట్లాడారు. దక్షిణ భారత కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ సదస్సు సందర్భంగా కాంగ్రెస్ నేతలు చేసిన



వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నామని, దీనిపై శాసనసభలో తీర్మానం చేశామని తెలిపారు. ప్రధానమంత్రి మోడితో సిఎం కెసిఆర్ అనేకసార్లు సమావేశమై చర్చించడంతో పాటు, లేఖలు ఇచ్చారన్నారు.

రూ.8129 కోట్లతో ఎంఎస్‌పికి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు

నాలుగున్నరేళ్లలో దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అదే విధంగా దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా లీటరు పాలకు రూ.4 చొప్పున రాయితీలు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. గత వానాకాలం సీజన్‌లో రూ.8,129 కోట్ల విలువైన వరి, మొక్కజొన్న, మినుములు, పెసర్లు,సోయాబీన్,కందులు కొనుగోలు చేసినట్లు సుఖేందర్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 6,809 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా, బీమా కింద 6,424 మంది రైతుల కుటుంబాలకు రూ.323 కోట్లు పరిహారం అందించామన్నారు. యాసంగిలో ఇప్పటి వరకు 43.84 లక్షల మంది రైతులకు రూ.4,724 కోట్లు రైతుబంధు అందించినట్లు తెలిపారు.

ఒకే గొడుగు కిందకు వ్యవసాయం, అనుబంధ రంగాలు

ఓలా, ఊబర్ తరహాలో సాగుకు అద్దె యంత్రాలు : సిఎస్. ఎస్.కె జోషి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు పౌరసరఫరాల శాఖను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే ఆలోచనలో సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఉన్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి తెలిపారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూపొందించిన 2019–20 తెలంగాణ రాష్ట్ర రుణ విధాన పత్రంను బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే రంగానికి చెందిన శాఖలు వేరు వేరుగా కాకుండా ఒకే విభాగం కిందకు వచ్చే విధంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం అంత సులువు కాదని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటేనే అది సాధ్యపడుతుందన్నారు. ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉపకరిస్తున్నాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో కూడా భారీ మార్పులు రావాల్సి ఉందని ఎస్.కె. జోషి అభిప్రాయపడ్డారు. చిన్న కమతాలు ఉన్నవారందరూ కూడా యంత్రాలు కొనుగోలు చేయడం కాకుండా ఓలా, ఉబర్ తరహాలో అద్దెకు యంత్రాలు లభించేలా మార్పులు రావాలన్నారు. నిర్వహణ వ్యయం తగ్గిస్తే రైతుకు చాలా వరకు ఉపశమనం కలుగుతుందని, రైతుబంధు పథకంతో రాష్ట్ర వ్యవసాయ రంగంలో చాలా మార్పు వచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో జరిగే డిసిసి భేటీల్లో సీరియస్‌నెస్ ఉండటం లేదన్నారు. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ అనుబంధ రంగాలపై నాబార్డు దృష్టి సారించాలన్నారు. పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తున్నప్పటికీ, అవి వాటి ఉద్దేశాన్ని నెరవేర్చడం లేదని వ్యాఖ్యానించారు. వరి, గోధుమలే పంటలు కాదని పప్పు, చిరు ధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించేలా ప్రోత్సాహించాలన్నారు. సేంద్రియ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కల్పించి, రుణాలు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి అన్నారు. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

తెలంగాణలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ భేష్

- ఎన్‌సిడిఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ ఆర్.కె. అగర్వాల్

మన తెలంగాణ / హైదరాబాద్ : వినియోగదారుల హక్కుల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల విభాగం (రిడ్రెసల్ సెల్) కృషి సంతృప్తికరంగా ఉందని జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్ ప్రశంసించారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో చూపుతున్న చొరవ ఫలితాలను ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఈ నెల 28 నుంచి హైదరాబాద్‌లో విచారణ జరుపుతున్న జస్టిస్ అగర్వాల్, కమిషన్ సభ్యురాలు ఎం శిరీష బుధవారం పౌరసరఫరాల భవన్‌లోని తెలంగాణ వినియోగదారుల సలహా కేంద్రం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి పనితీరును అధ్యయనం చేశారు. 'ఈపాస్' విధానం అమలుతో పాటు ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు తీసుకునే విధానాన్ని పరిశీలించి ఎంత మంది దాన్ని వినియోగించుకుంటున్నారో, వారి సంతృప్తి ఏ స్థాయిలో ఉందో రాష్ట్ర అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటి స్వభావం, పరిష్కారానికి సలహా కేంద్రం తీసుకుంటున్న చర్యలు, రోజుకు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, ఏ రకమైన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి వంటి అంశాలను కేంద్ర బృందానికి రాష్ట్ర కమిషనర్ అకున్ సబర్వాల్ వివరించారు. వినియోగదారుల సలహా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న నాగలక్ష్మి, కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులతో కూడా కేంద్ర బృందం సంభాషించి సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించింది. గతేడాదిలో తెలంగాణ వినియోగదారుల సలహా కేంద్రానికి వివిధ



అంశాలకు సంబంధించి 'హెల్ప్‌లైన్' నెంబర్‌కు 18 వేల కాల్‌లు వచ్చాయని, వాటిని పరిశీలించి 444 ఫిర్యాదులను నమోదు చేసి 396 కేసులను పరిష్కరించినట్లు రాష్ట్ర అధికారులు వివరించారు. వినియోగదారులకు ఉచితంగా కేసులను పరిష్కరించడమే కాకుండా కొంతమంది బాధితులకు 50 వేల నుంచి మూడు లక్షల రూపాయల వరకు నష్టపరిహారం ఇప్పించిన ఉదాహరణలను కూడా వివరించారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ (180042500333)తో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.

రాష్ట్ర కాంగ్రెస్ నేతలపై రాహుల్ ఆగ్రహం?

- తెలంగాణ ఇన్‌ఛార్జి కుంతియా పనితీరుపై అసంతృప్తి
- ప్రియాంకకు త్వరలో రాష్ట్ర ఇన్‌ఛార్జి బాధ్యతలు?

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో శరవేగంగా మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని పార్టీ నేతల పనితీరుపై ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేస్తే తప్ప ఆశించిన ఫలితాలు రావన్న భావనతో ఆయన ఉన్నట్లుగా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ ఉన్నప్పటికీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ పరిణామాలతో కంగుతిన్న రాహుల్‌గాంధీ తెలంగాణపై మరోసారి దృష్టి సారించారు. రాష్ట్రంలో నాయకుల పనితీరు...క్షేత్రస్థాయిలో పార్టీకున్న బలం, బలహీనతలను నియోజకవర్గాల వారీగా ఇప్పటికే నివేదికలను తెప్పించుకున్నట్లుగా సమాచారం. ఈ నివేదికల ఆధారంగానే పార్టీలోని ముఖ్యమైన స్థానాల్లో పెద్దఎత్తున మార్పులు, చేర్పులు చేయాలని భావిస్తున్నారు. అలాగే ఇప్పటి వరకు పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న ఆర్.సి. కుంతియాను కూడా బాధ్యతల నుంచి తప్పించి, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు తెలంగాణను కూడా ప్రియాంక గాంధీకి అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాలలో కాంగ్రెస్ గెలుపు కోసం రాహుల్‌గాంధీ కొద్ది రోజులుగా తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా ఇటీవలే నియమితులైన ప్రియాంకగాంధీకి అదనంగా తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్నట్లుగా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. రాష్ట్రంలో పార్టీని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు గతంలో మెదక్ జిల్లా నుంచి ఇందిరాగాంధీ పోటీ చేసిన విధంగా ప్రియాంకను సైతం తిరిగి అక్కడి నుంచే బరిలోకి దించాలని రాహుల్‌గాంధీ వ్యూహలకు పదునుపెడుతున్నట్లు పార్టీ వర్గాలు చెప్పాయి. ప్రియాంకను తెలంగాణ నుంచి పోటీ చేయించడం వల్ల టిఆర్‌ఎస్ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు మరింత దోహదపడుతుందని విశ్వసిస్తున్నారు. పోలికల్లో ప్రియాంకగాంధీ అచ్చుగుద్దినట్లుగా ఇందిరాగాంధీ రూపురేఖలతో ఉండడం పార్టీకి బాగా కొలిసొస్తుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. కాగా ప్రియాంకను తెలంగాణ నుంచి బరిలోకి దించాలని టిపిసిసి పెద్దలు సైతం ఇప్పటికే రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్ళినట్లుగా తెలుస్తోంది. దీనికి ఆమె కూడా సుముఖంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రియాంకగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేసే అవకాశాలు అధికంగానే ఉన్నాయని రాజకీయ వర్గాల్లోనూ వినిపిస్తోంది. తెలంగాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం పుష్కలంగా ఉన్నప్పటికీ పార్టీ నేతల్లో తగు సమన్వయం లేని కారణంగానే ఓటమిని చవిచూడాల్సి వచ్చిందని రాహుల్ భావిస్తున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే తెలంగాణలో కూడా అధిక స్థానాలను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా వాటిల్లో కనీసం ఏడు నుంచి పది లోక్‌సభ నియోజకవర్గాలను గెలుచుకుని తీరాలన్న కసితో రాహుల్‌గాంధీ ఉన్నారు.


దక్షిణాదిలో ఆడ'జన్మ'

సంపాదకీయం

తేడాలు చెరిగిపోవడం మంచికోసమైతే సంతోషమే. కాని ఆ మార్పు చెడు దిశగా జరిగితే మాత్రం ఆందోళన చెందవలసిందే. స్త్రీ పురుష నిష్పత్తిలో ఇంతకాలం మెరుగ్గా ఉంటూ వచ్చిన దక్షిణ భారత రాష్ట్రాలు ఇప్పుడు వెనుకంజలోపడి హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాల సరసన చేరడం ముమ్మాటికీ తిరోగమనమే. ఇది ఎంతమాత్రం మంచి మార్పు కాదు. పౌర జననాల నమోదు వ్యవస్థ నుంచి భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం సేకరించిన గణాంకాల ప్రకారం 2016లో స్త్రీ పురుష నిష్పత్తిలో అధమమైనవిగా తేలిన వాటిలో ఆంధ్ర ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, బీహార్, తమిళనాడు రాష్ట్రాలుండడం గమనించవలసిన అంశం. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలూ ఈ విషయంలో వెనుకబడిపోవడం బాధాకరం. ఒక్క కేరళ తప్ప మిగతా దక్షిణాది రాష్ట్రాలన్నీ లింగ పరమైన జనన రేషియో పతనంలో 2016లో ఉత్తరాదితో పోటీ పడ్డాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రగతి నిరోధక పథంలో దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదికి సాటి అనిపించుకోడం బహుశా ఈ ఒక్క విషయంలోనే అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. విచిత్రమేమిటంటే స్త్రీ జననాల విషయంలో రాజస్థాన్‌తో సమానంగా ఆంధ్రప్రదేశ్ అత్యధమ (806) స్థానాన్ని పంచుకోడం. 2007 సంవత్సరంలో ప్రతి వెయ్యి పురుష జననాలకు 974 స్త్రీ కాన్పులు రికార్డయిన ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లలో ఇంత దిగజారుడు చోటు చేసుకున్నదంటే అక్కడి సమాజం పురుష ఆధిక్య, ఆధిపత్య భావ జాలాన్ని మరింతగా సంతరించుకున్నదని అనుకోవాలా? 2016లో స్త్రీ పురుష నిష్పత్తిలో అఖిల భారత సగటు కంటే తక్కువగా ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, బీహార్, తమిళనాడు, ఒడిశాలు రికార్డయ్యాయి. కర్ణాటకలో గతంలో 1000కి 1004 బాలిక జననాలు రికార్డు కాగా 2016లో అది 896కి పడిపోయింది. 2013లో 954 గా నమోదయిన తెలంగాణలో మూడేళ్లలో మహిళల పుట్టుకల లెక్క 881 కి తగ్గిపోయింది. జననాల నమోదు ఖచ్చితంగా జరుగుతుందని పేరున్న దక్షిణాది రాష్ట్రాల్లో ఆ ప్రక్రియ గతి తప్పినందువల్లనే 2016లో ఈ నిష్పత్తి ఈ విధంగా పతనమైందని భావించడానికి అవకాశం లేదు. ఎందుకంటే మరో దక్షిణాది రాష్ట్రమైన కేరళలో బాలికల జననాల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. అక్కడ 2016లో ఇది వెయ్యికి 954 గా నమోదయింది. అంతకు ముందు ఈ విషయంలో బాగా అధోగతిలో ఉన్న పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలలో పరిస్థితి 2007 – 16 మధ్య మెరుగు పడడం మరో విశేషం. మహిళలపై అత్యాచారాలకు కూడా దేశ రాజధానే అనిపించుకున్న ఢిల్లీలో ఈ రేటు 848 నుంచి 902 కి ఎగబాకడం అస్సాంలో 834 నుంచి 888 కి పెరగడం మరో మంచి పరిణామం.

దక్షిణాది రాష్ట్రాలు అనేక విషయాల్లో ఉత్తరాది కంటే ముందడుగులో ఉన్నాయన్నది వాస్తవం. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ లక్ష్య సాధనలో, అక్షరాస్యతలో అవి సాధించిన ప్రగతి అసాధారణమైనది. ఈ కారణం చూపి నిధుల కేటాయింపులో కేంద్రం తమకు చివరి విస్తరి వేయడం పట్ల అవి పలుమార్లు నిరసన వ్యక్తం చేశాయి. అక్షరాస్యతలో జాతీయ సగటు రేటు 75 % కాగా కేరళ (93.9%), ఆంధ్రప్రదేశ్ (91.1%) అంతకంటే బాగా పై స్థాయిలో ఉన్నాయి. భారతదేశంలోని విద్యార్థుల సంఖ్య, శ్రామిక జనాభాలో దక్షిణాది రాష్ట్రాలదే పై చేయికావడం వల్ల విదేశాల నుంచి విత్తం ఈ ప్రాంతానికే ఎక్కువగా వస్తున్నది. ఉత్తరాదితో పోల్చుకుంటే మెరుగైన సంపద పంపిణీ, పట్టణ – గ్రామ అల్ప వ్యత్యాసం దక్షిణాదిలోనే దర్శనమిస్తాయి. అలాగే స్త్రీ ఉన్నత విద్యలోనూ, ఉద్యోగాల్లో కూడా దక్షిణాదిదే అగ్రస్థానం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుల్లో, కొలువుల్లో కూడా ఈ రాష్ట్రాలదే ముందడుగు. అటువంటి దక్షిణాదిలో పురుషులతో పోల్చుకుంటే స్త్రీ జననాల రేటు గతంలో గల అగ్రస్థానం నుంచి అధోగతికి చేరుకోడం దేశ ప్రగతికి హానికరమైన వ్యతిరేక పరివర్తనగా భావించకతప్పదు. వాస్తవానికి బాలికల పుట్టుక రేటు తగ్గడం పురుషులకే నష్టదాయకం. వివాహానికి వధువులు దొరకక ఇబ్బందిపడే దుస్థితి వారికి ఎదురవుతుంది. దేశంలో ఛాందస, తిరోగమన ధోరణులు పెరిగిపోయి నందువల్లనో, లింగ నిర్ధారణ సాంకేతికత అందుబాటు వల్లనో మగ బిడ్డ కోసం ఆరాటం అధికమై స్త్రీ శిశువులను గర్భంలోనే అంతం చేసే వైఖరి పెచ్చరిల్లుతున్నదా? ఒకవైపు బేటీ పడావో, బేటీ బచావో వంటి పథకాలను ప్రవేశపెట్టి మహిళల ప్రగతికి ప్రభుత్వాలు దోహదం చేస్తున్నాయి. కల్యాణ లక్ష్మి వంటి ప్రోత్సాహకాలతో తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఆడపిల్లలకు మెరుగైన మనుగడను కల్పిస్తున్నది. అయినా దక్షిణాదిలో స్త్రీ శిశు జననాలకు ఈ దుర్గతి ఎందుకు పట్టిందో సామాజిక శాస్త్రవేత్తలు ప్రత్యేక అధ్యయనం చేపట్టి తెలుసుకోవలసి ఉన్నది. ఇంటింటా ఆడ శిశువుల కేరింతలు పెరిగేలా బహుముఖ కృషి జరగాలి.

ఆఖరి సోషలిస్టు శిఖరం




ఆర్వీ రామారావ్
9676999856

స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి, స్వరాజ్య సిద్ధి తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేసిన వారికి స్పష్టమైన తేడా కనిపిస్తుంది. జాతీయోద్యమంలో భాగమైన వారికి నీతి, నిజాయితీ మెండుగా ఉండేవి. స్వాతంత్ర్యానంతర తరం నాయకుల్లో చాలా మంది అధికారంలో కొనసాగడం, సంపత్తి కూడబెట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఉన్న వారేనన్న అపవాదు ఉంది. ఈ ధోరణికి మినహాయింపు ఉన్న నాయకులు చాలా తక్కువ. అలాంటి అరుదైన వ్యక్తి ప్రసిద్ధ సోషలిస్టు నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్. 2019 జనవరి 29వ తేదీన ఫెర్నాండెజ్ తుది శ్వాస విడవడంతో సోషలిస్టుల్లో ప్రముఖులైన వారిలో ఆఖరి శిఖరం సైతం కూలిపోయింది. లోక నాయక్ జయప్రకాశ్ నారాయణ్, డా. రాం మనోహర్ లోహియా వంటి దిగ్గంతల స్ఫూర్తితో సోషలిస్టులుగా ఉన్నవారి సంఖ్య కనుమరుగవుతోంది. ఒకప్పుడు ఆ సిద్ధాంతానికి కట్టుబడి ఆ ఇంగువగుడ్డ వాసన మిగిలినవారు అక్కడక్కడా కనిపిస్తున్నా వారూ సోషలిస్టులుగా మెలగడం లేదు. సోషలిస్టు పార్టీ తెరమరుగై చాలా కాలమే అయింది. ఫెర్నాండెజే దీనికి కారకుడు కావడం ఓ విషాదం.

పేదరికం, అన్యాయం, దోపిడీలేని సమాజంకోసం పరితపించిన ఫెర్నాండెజ్ తన రాజకీయ జీవిత చరమాంకంలో ఆ సిద్ధాంతాన్ని మతతత్వ వాదులతో మిలాఖతై విడనాడడం మరింత పెద్ద విషాదం. సోషలిస్టు పార్టీని జనతా పార్టీలో విలీనం చేయడంవల్ల ఫెర్నాండెజ్ నమ్మిన రాజకీయ సిద్ధాంతం అదృశ్యమైతే, తీవ్ర అనారోగ్యం బారిన పడడంవల్ల దాదాపు దశాబ్దం పై నుంచి భౌతికంగా కూడా జీవచ్ఛవంలా మిగిలిపోయారు. అల్జీమర్స్ వ్యాధి ఆయనను అశక్తుడిని చేసింది. తొలి దశలో ఫెర్నాండెజ్ ఒక అగ్ని శిఖ. ఆయనది నిత్య జ్వాజ్వల్యమానమైన వ్యక్తిత్వం. కాంగ్రెసేతర రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. కానీ కేంద్రంలో మొట్ట మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటుకు జనతా పార్టీ ప్రయోగంతో తాను నాయకత్వం వహిస్తున్న సోషలిస్టు పార్టీని జనతా పార్టీలో విలీనం చేయడంద్వారా సోషలిస్టు పార్టీ అస్తిత్వమే లేకుండా చేసింది కూడా ఆయనే.

కర్నాటకలోని మంగళూరుకు చెందిన ఫెర్నాండెజ్ తన రాష్ట్రానికే పరిమితమైన వారు కాదు. 1950 నుంచి 1970ల చివరిదాకా ఆయన ప్రధాన కార్యక్షేత్రం బొంబాయి. ఆ తర్వాత బీహార్. జనతా పార్టీ ప్రభుత్వంలో మంత్రి అయినప్పటి నుంచి ఆయన జాతీయ రాజకీయ రాజకీయాలలో విశిష్టమైన పాత్ర పోషించారు. కర్నాటకలో జన్మించి జాతీయ రాజకీయాల్లో ముద్ర వేసిన కొద్ది మంది నాయకుల్లో ఫెర్నాండెజ్ అగ్రగణ్యులు. అయిష్టంగానే జనతా పార్టీ మంత్రివర్గంలో చేరారు. అక్కడా తనదైన ముద్ర వేశారు. ఫెర్నాండెజ్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందినవారు కాదు. విద్యాధికుడూ కారు. ఎస్.ఎస్.ఎల్.సి. తర్వాత చదువు కొన సాగించలేదు. కాని ఆయన తన మాతృ భాష కొంకణితో పాటు ఎంగ్లీషు, హిందీ, తుళు, మరాఠీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మలయాళం, లాటిన్ ఇలా తొమ్మిది భాషలు క్షుణ్నంగా తెలిసిన వారు. జైలులో ఉండగా మరాఠీ ఉర్దూ భాషలు నేర్చుకున్నారు. మెట్రిక్యులేషన్ పూర్తి అయిన తర్వాత మత గురువు కావడంకోసం ప్రయత్నించిన సందర్భంలో లాటిన్ అభ్యసించారు. హిందీ, ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా మాట్లాడి జనాన్ని మంత్రముగ్ధుల్ని చేయగలిగిన వక్త. ఆయన తల్లిదండ్రులు ఆయనను క్రైస్తవ మత గురువును చేయాలనుకున్నారు. చర్చిలో ప్రవచనాలకు, ఆచరణకు మధ్య అపారమైన అంతరాన్ని సహించలేకపోయారు. 19వ ఏటి నుంచే జీవన పోరాటం ప్రారంభించారు. హోటల్ కార్మికుడిగా పని చేశారు. అక్కడే హోటల్ కార్మికులను, రవాణా కార్మికులను సంఘటితం చేయడంతో ప్రముఖ కార్మిక నాయకుడయ్యారు. చర్చిలో శిక్షణ వదిలేసి 1949లో బొంబాయి చేరిన తర్వాత దుర్భర జీవితం గడిపారు. వీధుల్లోనో పార్కుల్లోనో పడుకునే వారు. ఒక వార్తా పత్రికలో అక్షర దోషాలు సరిదిద్దే ఉద్యోగం సంపాదించే దాకా అదే పరిస్థితి. ఆ క్రమంలోనే కార్మిక నాయకుడు, సోషలిస్టు నాయకుడు డా. రాం మనోహర్ లోహియాతో పరిచయమై కార్మిక నాయకుడిగా మారిపోయారు. సోషలిస్టు కార్మికోద్యమంలో భాగస్వామి అయ్యారు. 1950లలో ఫెర్నాండెజ్ బొంబాయి కార్మికోద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. పోలీసుల దాష్టీకానికి బలయ్యారు.



1967లో సంయుక్త సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా బొంబాయి దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటికే రాజకీయ నాయకుడిగా పేరుపడ్డ కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె. పాటిల్ (సాదా శివ కానోజీ పాటిల్) ను ఓడించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఫెర్నాండెజ్ విజయంతో పాటిల్ రాజకీయ జీవితం అంతమైంది. 1960లలో బొంబాయిలో జరిగిన కార్మికుల సమ్మెలన్నింటిలో ఆయనదే కీలక పాత్ర. 1970ల తర్వాత ప్రైవేటు రంగ పరిశ్రమల్లో ఆయన కార్మిక నాయకుడిగా అంతగా ప్రభావం చూపలేకపోయారు. అయితే 1974లో అఖిల భారత రైల్వే కార్మికుల సమాఖ్య అధ్యక్షుడిగా ఆయన పిలుపు మేరకు జరిగిన రైల్వే కార్మికుల సమ్మె చరిత్రాత్మకమైంది. 1947 నుంచి 1974 వరకు రైల్వే కార్మికుల కోసం మూడు వేతన సంఘాలు ఏర్పడినా కార్మికుల జీవితాలు ఏ మాత్రం మెరుగుపడనందున దేశవ్యాప్తంగా కార్మికులు రైల్వే సమ్మెకు మద్దతు పలికారు. రవాణా కార్మికులు, టాక్సీ డ్రైవర్లు కూడా ఈ సమ్మెకు మద్దతు పలికారు. ఈ సమ్మెను అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఉక్కు పాదంతో అణచి వేసింది. కార్మికోద్యమంలో పని చేస్తున్న 30,000 మందితో పాటు వేలాది కార్మికులను నిర్బంధించింది. 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడానికి ఉన్న అనేక కారణాల్లో రైల్వే కార్మికుల సమ్మె కూడా ఒకటి. అంతకు ముందు జరిగిన సమ్మెలన్నీ పరిశ్రమలకు వ్యతిరేకంగా జరిగితే ఈ సమ్మె ప్రభుత్వాన్నే సవాలు చేసింది. 1975 జూన్ 25 అర్థ రాత్రి ఎమర్జెన్సీ విధించడానికి ముందే ఏదో వైపరీత్యం జరగబోతోందని ఊహించిన ఫెర్నాండెజ్ జాలరి వేషంలో అజ్ఞాత వాసంలోకి వెళ్లిపోయారు. ఫెర్నాండెజ్ జాడ కనిపెట్టలేని పోలీసులు ఆయన సోదరుడు లారెన్స్ ఫెర్నాండెజ్ ను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు.

బరోడా డైనమైట్ కేసు

1975 జులైలో అంటే ఎమర్జెన్సీ విధించిన నెల రోజులకు ఫెర్నాండెజ్ బరోడాలో ప్రత్యక్షమయ్యారు. అక్కడ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తున్న పత్రికా రచయితల్లో కీర్తి భట్ వంటి వారితో పరిచయం అయింది. ఇందిరా గాంధీని గద్దె దించడానికి ఏం చేయాలో ఫెర్నాండెజ్ ఈ మిత్ర బృందంతో చర్చించారు. ఫెర్నాండెజ్ కు మిత్రుడైన పారిశ్రామికవేత్త వీరేన్ జె. షా గనులను పేల్చడానికి వాడే డైనమైట్లను సేకరించడానికి తోడ్పడ్డారు. వీటిని ఉపయోగించి ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లను, ఇందిరా గాంధీ ప్రసంగించే బహిరంగ సభల వేదికల దగ్గర పేలుళ్లకు పాల్పడాలని అనుకున్నారు. అయితే ఈ పేలుళ్ల ద్వారా జన నష్టం కలిగించడం వారి లక్ష్యం కాదు. అందుకే అర్థ రాత్రి వేళ, బహిరంగ సభ ప్రారంభం కావడానికి ముందు పేలుళ్లు చేయాలనుకున్నారు. వారణాసిలో ఇందిరా గాంధీ ప్రసంగించనున్న బహిరంగ సభ వేదిక దగ్గర డైనమైట్లు పేల్చాలనుకున్నారు. ఇదే బరోడా డైనమైట్ కేసుగా ప్రసిద్ధమైంది. పుణే సమీపంలోని పింప్రి నుంచి బొంబాయికి ఆయుధాలు తీసుకెళ్లే రైళ్లను దోపిడీ చేయాలని కూడా ఫెర్నాండెజ్ భావించారు. ఆ ఆయుధాలను ప్రభుత్వ కార్యాలయాలను పేల్చేయడానికి వాడాలనుకున్నారు. హాం రేడియో సహాయంతో ఇతర దేశాల సహాయం తీసుకోవడానికీ ప్రయత్నించారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించడంలో భాగంగా డైనమైట్లను పోగు చేయడానికి దొంగ చాటుగా ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణపై 1976 జూన్ 10న ఫెర్నాండెజ్ కలకత్తాలో దొరికిపోయారు. దీన్నే బరోడా డైనమైట్ కేసు అంటారు. ఫెర్నాండెజ్ ను అరెస్టు చేసినందుకు జర్మనీ, నార్వే, ఆస్ట్రియావంటి దేశాల నాయకులు ఫెర్నాండెజ్ కు హాని చేయకూడదని ఇందిరా గాంధీకి సందేశాలు పంపారు. బరోడా నుంచి ఫెర్నాండెజ్ ను ఢిల్లీలోని తిహార్ జైలుకు మార్చారు. విచిత్రం ఏమిటంటే బరోడా డైనమైట్ కేసుల నిందితుల మీద ఎన్నడూ చార్జి షీట్ కూడా దాఖలు చేయలేదు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన వారిలో ఫెర్నాండెజ్ ప్రముఖుడిగా నిలిచారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏ మార్గమైనా సవ్యమైందేనని ఫెర్నాండెజ్ సమర్థించుకునేవారు. 1977లో ఎమర్జెన్సీ తొలగించిన తర్వాత 1977 మార్చి 21 న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఫెర్నాండెజ్ జైలు నుంచి బిహార్ లోని ముజఫ్ఫర్ పూర్ నియోజక అభ్యర్థిగా పోటీ చేసి 30,000 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఎన్నికల ప్రచారం చేయకపోయినా ఎమర్జెన్సీ దాష్టీకాలను నిరసించిన ప్రజలు ఫెర్నాండెజ్ ను గెలిపించారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వంలో ఫెర్నాండెజ్ పరిశ్రమల శాఖ మంత్రి అయ్యారు. కేంద్ర మంత్రిగా కూడా ఆయన తన కార్మికోద్యమ స్ఫూర్తిని వదులుకోకుండా కోకా కోలా, ఐ.బి.ఎం. కంపెనీలు విదేశీ మారక ద్రవ్య నిబంధనలు (ఫెరా) పాటించాలని చెప్పడంతో కోకో కోలా, ఐ.బి.ఎం. బహుళ జాతి గుత్త సంస్థలు మన దేశంలో అవతారం చాలించాల్సి వచ్చింది. అయితే కోకో కోలా మరో రూపంలో అందుబాటులో ఉంది. ఫెర్నాండెజ్ మాత్రం బహుళజాతి గుత్త కంపెనీలను నిలవరించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు.

ఇదా! 'ఖర్మ' చారీ!!



పి.వెంకటేశం
9985725591

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైనేజీలను, సెప్టిక్ ట్యాంకులను, మ్యాన్ హోల్స్‌ను మనుషులతో పరిశుభ్రం చేయడం కూడని పని. మ్యాన్‌హోల్స్ లోపలికి ఎలాంటి రక్షణ పరికరాలు లేక చొచ్చుకునిపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోవడం మరీ ఘోరం. ఈ కర్మచారీ వ్యవస్థను ప్రభుత్వం నిషేధించినా నగరాల్లో ఎక్కడో ఒకచోట ఈ విధానం కొనసాగి పారిశుద్ధ్య కార్మికుల బతుకులను కూల్చివేస్తోంది.

న్యూఢిల్లీ ఉత్తర భాగం వజీరాబాద్ ఏరియాలో 37 ఏళ్ల పారిశుద్ధ్య కార్మికుడు క్రిషన్ జనవరి 20న డ్రైనేజీలో ప్రవేశించి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కాంట్రాక్టర్ రోజుకు 400 రూపాయలు ఇస్తానని ఆశ చూపించడంతో క్రిషన్ అతని సహకార్మికులు డ్రైనేజీని 'శుభ్రం చేయడానికి ఒప్పుకున్నారు. క్రిషన్ ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. ఈ దుర్ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీ ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని మందలిస్తూ జనవరి 21న నోటీసు జారీ చేసింది. పారిశుద్ధ్య కార్మికుల భద్రత కోసం చట్ట నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం ఫలితంగా విలువైన జీవితాలు కోల్పోవడమవుతుందని కమిషన్ హెచ్చరించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మృతుని కుటుంబానికి రూ. 10 లక్షలు నష్ట పరిహారం ఇస్తామని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ప్రకటించినా పోయిన ప్రాణం రప్పించగలరా? ఇటువంటి దుర్ఘటనలు తిరిగి జరగకుండా చూడగలరా?



ఈ కర్మచారీ వ్యవస్థలో మనుషులు పని చేయరాదని 2013లో ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు 2013–14లో కర్మచారీ వ్యవస్థ నిషేధం, ఆ కార్మికుల పునరావాస కల్పన తదితర ముఖ్యమయిన అంశాలతో చట్టాన్ని అమలులోకి తెచ్చింది. అంతకు ముందు 1993లో కర్మచారీల నియామకం, పొడిపాయి ఖానాల నిషేధ చట్టం అమలులో ఉంది. అయినా ఆచరణలో విఫలం కావడంతో 2013– 14లో మళ్లీ కొన్ని సవరణలతో మరింత పటిష్టంగా చట్టాన్ని అమలులోకి తెచ్చారు. ఈ చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తే గరిష్ఠంగా రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 లక్షల అపరాధ రుసుం చెల్లించక తప్పదు. ఇంత స్పష్టంగా, పటిష్టంగా నిబంధనలు ఉన్నా ఎక్కడా ఎవరూ పాటించడం లేదు. అందుకే దుర్ఘటనలు యథాప్రకారం జరుగుతూనే ఉన్నాయి. ఈ చట్ట నిబంధనలు సక్రమంగా అమలు జరిగేలా చూడవలసిన బాధ్యత సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖదే. చట్ట నిబంధనల ప్రకారం కర్మచారీ వ్యవస్థను నిరోధించడానికి రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షక కమిటీలను, జిల్లా స్థాయిలో విజిలెన్స్ కమిటీలను నియమించి ఎప్పటికప్పుడు సమీక్షించవలసి ఉంటుంది. ఢిల్లీలో ఈ దుర్ఘటన మొదటిది కాదు. గత సెప్టెంబర్‌లో మోతీనగర్‌లో సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేస్తుండగా అయిదుగురు చనిపోవడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంటుంది.

2017లో తమిళనాడులో సెప్టిక్ ట్యాంకులను పరిశుభ్రం చేస్తుండగా 30 మంది దుర్మరణం పాలవడం చర్చనీయాంశం అయింది. మద్రాస్ హైకోర్టు ఈ సమస్యపై కేంద్రాన్ని, రాష్ట్రాన్ని గట్టిగా నిలదీసింది. అలాగే అదే ఏడాది మార్చి 13న బెంగళూరులో ముగ్గురు కార్మికులు మ్యాన్‌హోల్ లోకి చొరబడి ప్రాణాలు కోల్పోయారు. 2016లో హైదరాబాద్ రామ్‌కోఠి సమీపాన బొగ్గులకుంట వద్ద మ్యాన్‌హోల్‌లో ఊపిరాడక ఇద్దరు మృతి చెందారు. ఇదే విధంగా నాలుగేళ్ల క్రితం సికింద్రాబాద్ సమీపాన డ్రైనేజీని పరిశుభ్రం చేస్తుండగా ఒక కార్మికుడు కొట్టుకుపోయాడు. 2013 మేలో జిహెచ్ఎంసి కాంట్రాక్టు కార్మికుడు, మరో వ్యక్తి మాదాపూర్ హైటెక్ వద్ద 15 అడుగుల లోతులో డ్రైనేజీలో పడి చనిపోయాడు.

పారిశుద్ధ్య వృత్తిలో 2 కోట్ల మంది

దేశ వ్యాప్తంగా పారిశుద్ధ్య వృత్తిలో అంటే కర్మచారీ వ్యవస్థలో దాదాపు రెండు కోట్ల మంది బతుకుతున్నారు. వీరిలో చాలా మంది మహిళలే. వీరికి కర్మచారీ వ్యవస్థను నిషేధించే చట్టం అమలులో ఉందని తెలియకపోవడం గమనార్హం. అయినా వీరికి ఈ వృత్తి నుంచి విముక్తి కలిగించి వేరే పునరావాసం ఎందుకు కల్పించలేకపోతున్నారో అర్థం కావడం లేదు.

చట్టంలో కొన్ని ఇబ్బందికర క్లాజులు

2013 చట్టంలో కొన్ని క్లాజులు ఇబ్బందికరంగా ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు మ్యాన్ హోల్‌లోకి ప్రవేశించవచ్చని చట్టంలో వివరణ ఇచ్చారు. కానీ 44 రకాల రక్షణ పరికరాలతోనే మ్యాన్‌హోల్ లోకి కార్మికులు ప్రవేశించవలసి ఉంటుంది. చట్టంలోని రెండవ అధ్యాయంలో నిబంధన 3లో ఏ ఒక్క కార్మికుడు డ్రైనేజీని కాని మ్యాన్‌హోల్‌ను కాని పరిశుభ్రం చేయడానికి వీలు లేదు. నిబంధనల ప్రకారం రక్షణ సాధనాలు ఉంటేనే ఆ పని చేయాలి. నిబంధన (క్లాజు) 'ఇ' ప్రకారం మనుషులచే ఈ పనులు చేయవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడితే స్థానిక అధికారిక ''సిఇఒ'' వద్ద లిఖితపూర్వక వివరణ సమర్పించి అనుమతిని పొందక తప్పదు. అయితే సుప్రీంకోర్టు మాత్రం అత్యవసర పరిస్థితుల్లో నయినా సరే మనుషులను మ్యాన్ హోల్స్‌లోకి దింపరాదని ఆదేశించింది.

మునిసిపల్ కార్పొరేషన్లు ప్రమాదకరమైన ఈ పనులన్నిటినీ కాంట్రాక్టు వర్కర్లకు అప్పగించడం పరిపాటిగా వస్తోంది. కాని భద్రత విషయం పట్టించుకోవడం లేదు. ముఖానికి మాస్క్‌లు, చేతులకు గ్లౌవ్స్, హెడ్‌లైట్, గమ్‌బోట్లు వంటివి ముందుగా అందజేసిన తరువాతనే కార్మికులచే పని చేయించాలి. అయితే ఇవన్నీ అందించే దాఖలాలు కనపడడం లేదని పారిశుద్ధ్య కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ రోజుల్లో మనుషులచే ఈ పనులు చేయించవలసిన అవసరం లేదు. అన్నిటికీ యంత్రాలు వచ్చేశాయి. ఒక్కొక్కసారి యంత్రాల వల్ల పూడికతీత పూర్తిగా తొలగించడం సాధ్యం కాకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో మనుషులచే పనులు చేయించవలసి వస్తుందని మునిసిపల్ అధికారులు కొందరు పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఈ మురికి పని వల్ల కార్మికులు చర్మ వ్యాధులకు గురవుతున్నారు. కొన్ని నగరాల్లో రోజూ 10 నుంచి 15 మంది ఇఎస్ఐ ఆస్పత్రికి వైద్య చికిత్స పొందవలసి వస్తోంది. చాలా మంది శ్వాసకోశ వ్యాధి కోసం మందులు తీసుకుంటున్నారు.

ప్రాణాంతకమైన మిథేన్


మ్యాన్‌హోల్స్‌లో ప్రాణాంతకమైన మిథేన్ వాయువుతో కార్మికులు ఊపిరాడక చనిపోయే దుర్ఘటనలు చాలా ఉన్నాయి. మ్యాన్‌హోల్ మూత తెరవగానే వాయువులు పైకి పెల్లుబుకు తుంటాయి. కొంతసేపు తరువాత అక్కడ పరిస్థితిని బట్టి వీరు పక్కన ఉన్న ఇళ్ల నుంచి బకెట్లతో నీళ్లు తెచ్చి పోస్తే వాయువుల ఘాటు తగ్గుతుందని కొందరు కార్మికులు తమ అనుభవం వివరించారు.


యంత్రాలు అందుబాటులో ఉన్నాయా?

ఈ పారిశుద్ధ్య పనుల కోసం, పూడికతీత కోసం కావలసిన యంత్రాలు అందుబాటులో ఉన్నాయా? అన్నది ప్రశ్నార్థకమే. ఉదాహరణకు హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. సుమారు వెయ్యి మంది నూయిజ్ లైన్‌మెన్లు వీటిని రోజూ శుభ్రం చేస్తుంటారు. ఎక్కడ నుంచయినా ఫిర్యాదులు వస్తే అక్కడకు వెళ్లి మ్యాన్‌హోల్స్‌లో పూడికను తొలగిస్తుంటారు. ఒక్కోసారి ఆరేడు మ్యాన్‌హోల్స్‌ను ఒకేసారి శుభ్రం చేయవలసి వస్తుంది. అయితే యంత్రాల సంఖ్య మాత్రం ఇందుకు తగినట్టు లేదు. రెండేళ్ల క్రితం వరకు కేవలం 58 ఎయిర్ టెక్ యంత్రాలు మాత్రమే ఉపయోగంలో ఉండేవి. ఢిల్లీలో డ్రయిన్లను యంత్రాలచే శుభ్రం చేయించడం కచ్చితంగా అమలులోకి వస్తే మనుషులచే పని చేయించడం చాలా వరకు తగ్గిపోతుందని ఢిల్లీ సాంఘిక సంక్షేమ మంత్రి రాజేంద్రపాల్ గౌతమ్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో మురుగును తొలగించే 200 యంత్రాలను మార్చి నాటికి ఢిల్లీ జలబోర్డు సమకూర్చుకునే పనిలో ఉందని ఆయన చెప్పారు. ఇప్పుడు ఈ కార్మికులకు వేరే ఉపాధి కల్పించడానికి కావలసిన శిక్షణ ఇవ్వడానికి కేజ్రీవాల్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.


బాసరలో జైనబసదులు, శివాలయాలు

బాసర ప్రస్తుతం నిర్మల్ జిల్లా (ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా)లో వుంది. బాసర నిజానికి ఒక ఊరు కాదు. ఐదు గ్రామాల సముదాయం. 1. బాసర, 2. రేణుకాపురం, 3. మహదాపురం, 4. రత్నాపురం, 5. మయిలాపురం. ప్రస్తుతం బాసర, మయిలాపురం మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలిన ఊర్లు రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయి. బాసరలో జ్ఞానసరస్వతిని వ్యాసుడు ప్రతిష్టించినట్లు చెప్పబడుతున్నది. కాని, ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలించిన కరికాళచోళ రాజైన రెండవ బిజ్జలదేవుడే ఇక్కడ ఆలయాలను నిర్మించినాడని చరిత్రకారులు అభిప్రాయం. తాను జైనుడు. అతని బావ వీరశైవప్రవక్త బసవేశ్వరుడు. వారి కాలంలో వీరశైవ ప్రాబల్యంవల్ల జరిగిన జైనం, శైవాల సంఘర్షణలకు దర్పణంగా వుంది బాసర. బాసర జ్ఞానసరస్వతి దేవాలయానికి వెనుకగా చిన్నగుట్ట మీద పాపహరేశ్వరాలయంగా పిలువబడే పురాతన శివాలయముంది. ఈ దేవాలయావరణలోని స్తంభశిలలు, శాసనస్తంభాలు, శిల్పాలు అన్నీ వేటికవి ప్రత్యేకమైనవి. రాష్ట్రకూటుల కాలం నుంచి వేములవాడ చాళుక్యుల వరకు వివిధ సందర్భాలలో ప్రతిష్టించబడిన దేవాలయాలు, కూల్చబడిన, మార్చబడిన జైనబసదులు, వీరశిలలు, సతిశిలలు, శాసనాలు, శిథిలాలు ఒకేచోట అగుపిస్తున్నాయి.









శిథిలాలయం: రాష్ట్రకూటుల నుంచి (అంతకుముందు కూడా) కాకతీయుల దాక లలాటబింబంగా చెక్కబడిన గజలక్ష్మి ఇక్కడి శిథిలదేవాలయపు ద్వారం మీద వుంది. జైనులైన రాష్ట్రకూటులు తాము నిర్మించిన గుడులమీద, శాసనాలమీద తామరపూలరేకులను చెక్కించడం ఒక ప్రత్యేకశైలిగా మనం గుర్తించవచ్చు. అదే శైలి ఈ దేవాలయం ఉత్తరాశిమీద కనిపిస్తుంది. సాధారణంగా జైన బసదుల ముందర వుండే శంఖలతాతోరణం, ఏనుగులున్న చంద్రశిల ఇక్కడ కనిపిస్తున్నది. ఏక, త్రి దేవతాధిష్ఠాన పీఠాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. రెండుచేతులున్న జైన గణపతి బయట కనిపిస్తున్నాడు. జైన నిశీథులు కూడా ఇక్కడ కనిపించాయి. జైన గురు పరంపరను తెలిపే జైన స్తంభమొకటి వుంది. రాష్ట్రకూటులకాలం నాటి రెండు గణపతి విగ్రహాలు అక్కడున్నాయి.

శైవం: రాష్ట్రకూటుల పిదప చాళుక్యులు రాజ్యపాలనకు వచ్చే సంధి కాలంలో వీరశైవం విస్తరించింది. వీరశైవులు జైనులనెందరినో పట్టి పరిమార్చినట్టు శాసనాలు, గ్రంథాలు చెపుతున్నాయి. జైనబసదులెన్నో కూల్చబడ్డాయి లేదా శైవాలయాలుగా మార్చబడ్డాయి. ఇక్కడ కూడా అట్లాంటి సాక్ష్యాలు మనకు లభిస్తున్నాయి. ఎక్కడెక్కడో బయటపడివున్న విగ్రహాలను ఈ పాపహరేశ్వరుని ప్రాంగణంలోనికి చేర్చి నట్టున్నారు. శైవానికి సంబంధించిన భైరవుడు, చాముండి దేవతలు, రెండు సమలింగాలు(బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలతో), నాగశిల్పాలు, పాతగర్భాలయానికి పెంచి కట్టిన రంగ, ముఖ మంటపాలు అగుపిస్తున్నాయి. దూరంగా దీపస్తంభమొకటున్నది.

వీరశిలలు: స్తంభం అడుగున ఒక కోడెదూడ, పైన చేతులు జోడించి కూర్చున్న భక్తురాలు, వీటిపైన శివలింగం, శివార్చన చేస్తున్న శైవగురువు కనిపిస్తున్న మూడు అంతస్తుల శిల్పాలున్న ఒక వీరశిలాస్తంభం కనిపిస్తున్నది. మరొక స్తంభం కూడా శాసనం, మూడు అంతస్తుల శిల్పాలున్నదే. ఈ స్తంభం మీద అడుగున ఇద్దరు ఖడ్గధారులు కుక్కతోపాటు కనిపిస్తున్నారు. 3వ మనిషి ఏదో ఆయుధంతో కనిపిస్తున్నాడు. వీరికి పక్కన కర్రకు తలకిందులుగా వేలాడదీయబడిన మరొక మనిషి వున్నాడు. శాసనంలో ఏమున్నదో తెలిస్తే ఈ శిల్పానికి అర్థం చెప్పవచ్చు. కాని, గద్వాలకు సమీపంలోని పూడూరులో జైనులను వధిస్తున్న శిల్పాలున్నాయి. శాసనాలున్నాయి. ఇక్కడ శిల్పాలకు వాటికి పోలికలు కనిపిస్తున్నాయి. ఇందులో వధింపబడుతున్నది జైనుడే కావచ్చు. రెండో అంతస్తులో ఒక భక్తుడు ఇద్దరు పరిచారకులు(అప్సరసలు)న్నారు. పై అంతస్తులో లింగం ముందర అర్చన చేస్తున్నట్టున్న భక్తుడు, లింగం వెనక లగుడధారి(లకులీశుడు?) కనిపిస్తున్నాడు. గుడిమంటపంలోని ఒక స్తంభంపై శివభక్తుడొకరిని చెక్కారు.

శాసనాలు: అక్కడి స్తంభాల మీద చెక్కిన శాసనాలలో 9వ శతాబ్దపు తెలుగు లిపిలో 1. శ్రీవైశ్య కులతిలక .. పయ సెట్టి, 2. స్వస్తిశ్రీ రేచయ్య కొట్టద్రమ్మ నూరు, 3. స్వస్తిశ్రీ బిజ్జకప్పియ్య కొట్టద్రమ్మ నూరు, (4. లిపి స్పష్టంగా కనిపించడం లేదు) అని వుంది. బినోలలో బాహుబలి అని అనుకుంటున్న శిల్పం బాహుబలిది కాదు, జైన తీర్థంకరుడు శాంతి నాథునిది. శిల్పపాదపీఠం మీద ఒక 'వైశ్యకులతిలకుడు' చేయించిన శాంతినాథుని శిల్పమని రాసున్నది. ఇక్కడ కూడా ఒక శాసనంలో వైశ్యకులతిలక అనే మాట వుంది. గోదావరి అవతల బినోల, ఇవతల బాసరలలోని ఈ శాసనలిపులు ఒకే కాలానికి చెందినవి.

సతిశిలలు: అన్నింటి కన్నా ప్రత్యేకమైనవి ఇక్కడ కనిపిస్తున్న రెండు సతిశిలలు. తెలంగాణలో అరుదుగా కనిపించేవి సతి శిలలు. భర్తలు వీరమరణం పొందినపుడు సతీసహగమనం చేసిన స్త్రీలకు, ఆత్మాహుతి చేసుకున్న స్త్రీలకు సతిశిలలను నిలుపుతుంటారు. ఈ సతిశిలలను నిలిపే ఆచారం మనకు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాతులలో ఎక్కువగా కనిపిస్తుంది.

మహిషాసురమర్దిని: ఇక్కడ కనిపించిన అన్ని శిల్పాల కన్న మిన్నయైన శిల్పం రాతిగుండుకు చెక్కిన మహిషాసురమర్దిని విగ్రహం. చతుర్భుజియైన ఈ దేవతకు వెనక కుడిచేతిలో గంట, ఎడమచేతిలో శంఖు వున్నాయి. ముందరి రెండు చేతులలో కుడిచేతిలోని శూలంతో మహిషాసురుని వధిస్తున్నట్టుంది. ఎడమచేయి దున్నపోతురూపంలో వున్న మహిషాసురుని తోక పట్టి పైకిలాగినట్టుంది. ఎడమకాలితో మహిషం తలను తొక్కిపట్టినట్లున్నది. ఇటువంటి శిల్పం చాలా అరుదైనటువంటిది. తాంత్రిక పూజలు చేసే వారు ఆరాధించే రూపమిది. సాధారణమైన మహిషాసురమర్దిని శిల్పానికి ఈ విగ్రహం భిన్నంగా వుంది. బాసరకు వ్యాసపురి అని పేరుందని, వ్యాసుడిక్కడ తపస్సు చేసుకుంటు నివసించినందువల్ల ఆ పేరు వచ్చిందని జనాభిప్రాయం. అయితే జైన బసదులిక్కడ ఎక్కువగా వుండటంవల్ల బసది అనే పిలుపు 'బాసర' కావడానికి కూడా అవకాశముంది. ఈ శిల్పాలన్నింటిని తనక్షేత్రపర్యటనలో చూసింది, ఫోటోలుతీసింది మిత్రులు బాసరవాసి టీచర్ రామ్మోహన్, టీచర్ మాదారపు రామయ్య, భూపాలపల్లి గారలు. వారికి అభినందనలు.

* శ్రీరామోజు హరగోపాల్
(తెలంగాణ జాగృతి చరిత్రబృందం)

సకుటుంబం

వండి వడ్డిస్తున్నారు!

భారతీయ మహిళకు ' భోజ్యేషుమాత' అన్న బిరుదు ఒకటుంది. ఆమె చేతి శాకపాకాలు ఇంటిల్లిపాదినీ ఆరోగ్యంతో ఉంచుతాయని, వండి వడ్డించే విషయంలో ఆమె తన సంతానాన్ని భర్తను కూడా ఒకే దృష్టితో చూస్తూ, కడుపు నింపుతుందనీ ఈ పదానికి ఒక అర్థం చెప్పకొందాం. నిజానికి భారతీయ వనిత రక్తంలోనే ఈ అమ్మదనం ఉంది. ఆదరించడంలోనూ ఆమెది తిరుగులేని వ్యక్తిత్వం ప్రపంచం మొత్తంగా ఉన్న వండి వడ్డించే పరిశ్రమలు కూడా ఆమె తిరుగులేకుండా రాణించేందుకు ఇదే కారణం అయి ఉండచ్చు. ఎంతో మంది మహిళలు భారతీయ భోజన పరిశ్రమ రంగంలో ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉన్నారు.


దీప్నాఆనంద్


పాట్రీషియా నారాయణ్


రవీందర్ భోగల్


అస్మాఖాన్


ఏంజెలా మాలిక్

ఫిక్కీ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్‌గా అవార్డు సాధించిన పాట్రీషియా నారాయణ్ జీవితం మెరీనా బీచ్‌లో స్ట్రీట్‌ఫుడ్ అమ్మకంతో ప్రారంభమై సందీపా బైన్ రెస్టారెంట్స్ స్థాపించటం వరకు సాగింది. ఆంధ్రా, తెలంగాణాకు సంబంధించి ఎంతో మంది మహిళలు ఫుడ్ బిజినెస్‌తో సక్సెస్ ఫుల్‌గా రాణిస్తున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా భోజన పరిశ్రమ రంగంలో భారతీయ మహిళలున్నారు. పారిస్ నుండి ' గుజరాత్ జార్' పేరుతో భారతీయులకు మాత్రమే ప్రత్యేకమైన, ఎన్నో సహజమైన దినుసులతో, చక్కని జామ్‌లు తయారు చేసి ప్రసిద్ధికెక్కారు. ఆమెకు చెందిన ప్రత్యేక అమ్మకాల్లో బనానారమ్ జామ్, ఆరెంజ్ విస్న మార్మలేడ్, స్పైసీ, ఆనియన్ రెలీష్ వంటి అద్భుత ప్రయోగాలు ఆమెను వ్యాపారవేత్తను చేశాయి.



లండన్‌కు చెందిన దీప్నా ఆనంద్ భారతీయ భోజన పరిశ్రమ రంగంలో మొదటి స్థానంలో ఉన్నారు. ఆమె తాత గారు 1950 కెన్యాలో ఒక రెస్టారెంట్‌ను స్థాపించి దాన్ని విజయవంతంగా నడిపారు. తర్వాత ఆమె తండ్రి ఈ రంగంలోకి దిగి డిప్ ఇన్ బ్రిలియంట్ పేరుతో లండన్‌లో రెస్టారెంట్‌ను ప్రారంభించి, సంప్రదాయ పంజాబీ థాలీని పరిచయం చేశారు. తండ్రి దగ్గర నుంచి ఆ వ్యాపారం అందిపుచ్చుకొంది దీప్నా ఆనంద్. డిప్ ఇన్ కిచెన్ ఆన్ బి 4 యు అన్ టి.వి.షో తో ఆమె లండన్‌లో చాలా పాపులర్ అయింది.

రవీందర్ భోగల్ ఒక ఫ్యాషన్ జర్నలిస్ట్. చెఫ్ కుకరా రైటర్‌గా లండన్‌లో ఆమెకు పాపులారిటీ ఉంది. జంటిల్‌మెన్స్ క్లబ్ కెరీర్ పేరుతో రెస్టారెంట్స్ నిర్వహిస్తున్నారామె. కెన్యా, నార్త్ ఇండియన్ వంటకాలు ఇక్కడ ప్రత్యేకం.

ఇక అస్మాఖాన్ లండన్‌లో పేరున్న లాయర్. డార్జిలింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో ఆమె రెస్టారెంట్‌లో, రాయల్ డిషెస్, కలకత్తా స్ట్రీట్‌ఫుడ్, బెంగాల్ క్లాసికల్ రిఫెక్స్ వంటి నోరూరుంచే రుచులు కస్టమర్స్‌ని కట్టి పడేస్తాయి. ఆమె రెస్టారెంట్‌లో కేవలం స్త్రీలే పనిచేస్తారు. వంటలన్నీ హైదరాబాద్ రుచులను మరిపిస్తాయి. గొప్ప రుచులతో ఉంటాయి.

ఇండియన్ లాబ్ హోటల్ గ్రూప్‌లో శిక్షణ తీసుకొనే శిల్పారండేకర్ యు.కె లోని పబ్స్‌లో భారతీయ వంటకాలు రుచి చూపించారు. ప్యూర్ ఇండియన్ కుకింగ్ రెస్టారెంట్‌ను ప్రారంభించి, ఘాటైన ఇండియన్ మసాలా దినుసులతో, జీడిపప్పు, పుదీనా మొదలైన సువాసనలతో ఘుమఘుమలాడే భారతీయ భోజనాన్నే వండిస్తారు.


ఏంజెలా మాలక్ పంజాబీ అమ్మాయి ఆమె స్వయంగా కుకరా స్కూల్ నడుపుతారు. లండన్ ఫుడ్ బోర్డ్ సభ్యురాలిగా భారతీయ రుచులపై స్థానికులకు ఆసక్తి కలిగిస్తూ, భోజన పరిశ్రమకు పెద్ద ప్రచారం తీసుకొచ్చారు. షూటర్ అండ్ షూటర్ అన్న కేటరింగ్ కంపెనీ డైరెక్టర్ కూడా. మధ్యాహ్న భోజనానికి పంజాబీ వంటకాలు ప్రత్యేకంగా అందిస్తుందీ కంపెనీ. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆమె ప్రధానమైన వక్తగా కూడా ఉన్నారు. వీళ్ల కంటే ముందే లండన్‌లో చట్నా మేరా పేరుతో మోడ్రన్ ఇండియన్ రెస్టారెంట్‌ని నమిత, కామెలియా అనే అక్కా చెల్లెళ్ళు ప్రారంభించారు. కుటుంబ సంప్రదాయ రుచులు ఈ రెస్టారెంట్‌లో ప్రత్యేకం.

అసలు భారతీయ సంప్రదాయ భోజనం ఎన్నో రుచులతో, ఆరోగ్యవంతమైన ఎన్నో మూలికలు, దినుసులు, సువాసన ద్రవ్యాల మిశ్రమం. వెల్లుల్లి, ఇంగువలతో పాటు అనేక మసాలాలు ఈ భోజనానికి ప్రత్యేక రుచిని ఇస్తాయి. ఆకారంలోనే ఆకలిని పెంచే ఔషధాలు, జీర్ణక్రియను వేగవంతం చేసే దినుసులున్నాయి. అతి మామూలు శాకాహార భోజనం కూడా మాంసాహారంతో ధీటుగా శక్తిని బలాన్ని ఇస్తుంది. అందుకే ఖండాంతరాల్లో ఈ రుచులు ప్రసిద్ధికెక్కాయి. ఈ భోజన వ్యాపారానికి కాసులు కురుస్తున్నాయి.

చేబ్రోలు అరుణ

ఐస్‌క్యూబ్స్‌తో తాజా చర్మం

చర్మం ఆరోగ్యంగా, అందంగా కనిపించేందుకు బ్యూటీ పార్లర్‌కి వెళ్లడం లేదా రకరకాల ఫేస్‌ప్యాక్‌లు వేసుకోవడం మామూలే. ఇవన్నీ కాకుండా ముఖసౌందర్యం తాజాదనం పొందేలా ఐస్ క్యూబ్స్‌తో ఎన్నో లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందామా...



* మొటిమలు, యాక్నె ముఖం పై ఉంటే చాలా మంటగా, నొప్పిగా అనిపిస్తుంది. దీన్నుంచి తక్షణ ఉపశమనం పొందాలంటే మాత్రం శుభ్రంగా ఉన్న పొడి వస్త్రంలో ఐసు ముక్కల్ని ఉంచి.. ఆ ప్రాంతంలో అద్దాలి. ఇలా ఓ పదినిమిషాలు చేయడం వల్ల హాయిగా అనిపిస్తుంది. మొటిమలూ, యాక్నె చాలా త్వరగా తగ్గిపోతాయి.
* చాలామంది తరచూ ఐబ్రోస్ చేయించుకుంటున్నా ఆప్రాంతంలో నొప్పి ఉంటుంది. అలాంటి వారు ఐబ్రోస్ చేయించుకునే ముందు కనుబొమల వద్ద ఐసుముక్కలో రుద్ది చూడండి. నొప్పి అనిపించదు. చర్మం కందిపోదు.
* కొందరు ఎక్కువ సమయం నిద్రపోయినా, లేదంటే రకరకాల కారణాల వల్ల కళ్లు ఉబ్బిపోతాయి. అలాంటి వారు ఐసుముక్కల్ని జిప్‌లాక్ బ్యాగుల్లో ఉంచి కళ్ల మీద పెట్టుకోవాలి. కళ్లకు హాయిగా అనిపిస్తుంది. అలర్జీలూ దూరమవుతాయి.
* సున్నిత చర్మం ఉన్నవారికి ఎండకు చర్మం కందిపోయినట్టు అయితే ఆ ప్రాంతంలో పొడి బట్టలో ఐసు ముక్కల్ని ఉంచి అద్దితే సమస్య దూరమవుతుంది. అలాగే మిగతా ప్రాంతంలోనూ ఇలా చేయడంవల్ల రక్తప్రసరణ సక్రమంగా అంది చర్మం నిగారింపునూ సంతరించుకుంటుంది.
* కళ్ళచుట్టూ నల్లని వలయాలుంటే ఐస్ క్యూబ్స్ తో సత్వర ఫలితాన్ని పొందవచ్చు. ముందుగా రెండుచెంచాల పుదీనా పేస్టు, నాలుగుచెంచాల పాలను బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ట్రేల్లో పోసి డీప్ ఫ్రీజర్‌లో పెట్టాలి. ఐస్ క్యూబ్స్ తయారైన తర్వాత దానిని తీసి ప్రతిరోజూ కళ్ళచుట్టూ మెల్లగా రాసుకోవాలి. ఇలా కనీసం ఓ వారం చేస్తే నల్లని వలయాలు తొలగిపోతాయి.
* తాజా నీటిలో రోజ్ వాటర్ కలిపి ఐస్ క్యూబ్ లను తయారు చేసుకోవాలి. ఈ రోజ్ వాటర్ ఐస్ క్యూబ్ లకు పొడిచేసిన కర్పూరాన్ని కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే మొటిమలు ఇట్టే పోతాయి.
* చర్మం బిగుతుగా, సాగడంలాంటి సమస్యలు కొంతమందిని ఇబ్బంది పెడతాయి. ఇలాంటివారు ఐసుక్యూబ్స్‌ని ముఖంపై రుద్దుకుని చూడండి. ఇలా తరచూ చేస్తోంటే చర్మం కూడా బిగుతుగా మారుతుంది.
* వయసు పెరిగేకొద్దీ ముఖంలో ముడతలు మొదలవుతాయి. అవి పెరగకుండా ఉండాలంటే ఖరీదైన క్రీంలే కొనాలని లేదు. అప్పుడప్పుడు ఐసు ముక్కల్ని ముడతలున్న చోట మర్దన చేసుకుంటే చాలు. అవి అదుపులో ఉండటమే కాదు చర్మం కూడా మృదువుగా మారుతుంది.

సూచనలు: ఐసుముక్కల్ని నేరుగా చర్మంపై రుద్దుకోకూడదు. రుమాలులో వేసుకుని మూటలా చుట్టి మాత్రమే ఉపయోగించాలి. అలాగే ముందుగా నుదురూ, కళ్ల అడుగునా, చెంపలూ, మెడ.. ఇలా ఓ పద్ధతి ప్రకారం మర్దన చేసుకుంటూ రావాలి. ముఖాన్ని ముందు శుభ్రం చేసుకున్నాకే ఐసుముక్కలతో మర్దన చేసుకోవాలి. దీన్ని రాత్రిళ్లు ఉపయోగిస్తే మర్నాటికి చర్మం తాజాగా కనిపిస్తుంది. చూశారుగా ఐస్‌క్యూబ్స్‌తో ఎంత ఉప్యోగం ఉందో మ్రి మీరూ కూడా ట్రై చేయండి.

చిట్కాలు

*** లవంగం, యాలుకలు పొడి , అల్లం, పుదీనా, తేనె వంటివి నిమ్మరసంతో కలిపి తీసుకుంటే వాంతి వచ్చే వికార భావన పోతుంది.**

*** కొబ్బరినూనె కాళ్ళను, పాదాలను మృదువుగా ఉంచటానికి సహజ సిద్ధమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. కొబ్బరినూనె పాదాలకు, కాళ్లకు రాసి 5 నిమిషాలు మసాజ్ చేస్తే చర్మ గ్రంధులు లోపలకు వెళ్లి మరీ దాని ప్రభావాన్ని చూపుతుంది.**



ఉలవలు.. పలు లాభాలు!

ఉలవలు ఇప్పుడు చాలా మంది వీటిని తినడమే మానేశారని చెప్పవచ్చు. ఎక్కడో ఒకరు తప్ప వీటిని పెద్దగా ఎవరూ తినడం లేదు. కానీ మన పూర్వీకులు వీటిని ఎక్కువగా తినేవారు. ఉలవచారు, గంజి, గుగ్గిళ్ల లాగా వీటిని తీసుకునేవారు. అందువల్లే వారు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నారు. అయితే నిత్యం ఉలవలను ఏదో ఒక రూపంలో తీసుకుంటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

* ఉలవలను నిత్యం గంజి, గుగ్గిళ్ల రూపంలో తీసుకోవడం వల్ల అధిక బరువు తగ్గుతారు. మధుమేహం కూడా నియంత్రణలోకి వస్తుంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పరిశోధనలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి.
* ఉలవలను తీసుకోవడం వల్ల స్త్రీలకు రుతు సమస్యలు పోతాయి. కండరాలు గట్టిగా మారుతాయి. నరాల బలహీనత ఉండదు. దేహపుష్టి కలుగుతుంది.
* జీర్ణ సమస్యలు, మూత్రాశయ సమస్యలు ఉండవు. అల్సర్లు ఉంటే తగ్గుతాయి. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం తగ్గుతాయి.
* లివర్‌లోని విష, వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. లివర్ శుభ్రమవుతుంది.
* ఉలవల్లో పుష్కలంగా ఉండే కాల్షియం ఎముకలకు, దంతాలకు బలాన్నిస్తుంది. వాటిని పటిష్టం చేస్తుంది.

సమయానికి తింటున్నారా..

భోజనంలో రోజూ ఏం తింటున్నామనేది ఎంత ముఖ్యమో, ఏ సమయానికి తింటున్నామనేది కూడా అంతే ముఖ్యం. రోజూ కచ్చితమైన వేళల్లో భోజనం చేసేవారి జీర్ణాశయంలో వాటిని జీర్ణించుకోవడానికి అవసరమైన ఎంజైములన్నీ సవ్యంగా పుట్టుకొస్తాయి. ఏ కారణంగానైనా ఆ వేళల్ని దాటేస్తే ఆ సమయానికి ఆ ఎంజైములను పుట్టవు. ఆ సమయానికి ఆహారమేదో పడకపోతే జీర్ణాశయంలోని మ్యూకస్ మెంబ్రేన్‌ను అవి దెబ్బతీస్తాయి. అదొక్కటే కాదు. కొన్ని హానికారకమైన రసాయనాలు ఉత్పన్నమై ముందు జీర్ణవ్యవస్థను ఆ తర్వాత హార్మోన్ వ్యవస్థనూ దెబ్బ తీస్తాయి. ఒక్క హార్మోన్ వ్యవస్థ దెబ్బ తింటే శరీరం సర్వరోగాలకూ నిలయమవుతుంది. అందుకే సమయానికి భోజనం చేయడం జీవితకాలాన్ని పెంచుకోవడానికి మన ముందున్న ఖర్చులేని సహజ మార్గం.





పిల్లల ఆరోగ్యం కోసం...

ఈ కాలంలో పిల్లలకు జలుబు, దగ్గులతో పాటు వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వీటినుంచి పిల్లల్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు..

చలికాలంలో పిల్లలకి కాచి చల్లార్చిన నీటినే తాగించాలి. ఎల్లప్పుడూ తాజా ఆహారం తినిపించాలి. ఎట్టి పరిస్థితుల్లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారాన్ని తినిపించొద్దు. చిన్నపిల్లలు తిరిగే ఇంట్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి. ఇంట్లోనే కాదు పరిసరాల్లోనూ చెత్త నిల్వ ఉంటే శుభ్రం చేసుకోవాలి. చెత్తను పట్టించుకోకపోతే ఈగలు, దోమల వ్యాప్తి జరుగుతుంది. దాంతో పిల్లలకి ఇబ్బందే. దోమల బారిన పడకుండా ఉండాలంటే దోమతెరల్ని వాడటమే సరైన ఎంపిక. అంతేకానీ ప్రత్యామ్నాయ పద్ధతులు చూద్దామనుకుంటే మూల్యం చెల్లించాల్సిందే. దోమతెరలు వాడుతున్నప్పటికీ.. పిల్లలు నిద్రపోయే ముందు వారికి శరీరాన్ని కప్పి ఉంచే, నిండుగా ఉండే బట్టలను వేయాలి. పిల్లలకి ఈ సీజన్‌లో సెమీ ఉలన్ ఫ్యాబ్రిక్స్ వాడాలి.

పిల్లలకు స్నానం చేయించే నీటిలో యాంటీసెప్టిక్ డ్రాప్స్ వేయాలి.

ఈ కాలంలో పిల్లలకు దగ్గు, జలుబు కామన్. అందుకే పిల్లల డాక్టరు పర్యవేక్షణలో ముందే మెడిసిన్‌ను తీసుకుని ఇంట్లో ఉంచుకోవటం మంచిది. సమస్య వచ్చిన వెంటనే ఆ మందును వాడుకోవచ్చు.

12.60 లక్షల ఎకరాల్లో వరినాట్లు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో 12.60 లక్షల ఎకరాల్లో రైతులు వరినాట్లువేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ బుధవారం తాజా నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం రబీ సీజన్లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 22.90 లక్షల (69%) ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో ఆహార పంటల సాధారణ సాగు విస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 18.58 లక్షల (72%) ఎకరాల్లో సాగయ్యాయి. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి రబీ సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 12.60 లక్షల (72%) ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.52 లక్షల (61%) ఎకరాల్లో సాగైంది. ఇక నూనె గింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.54 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.64 లక్షల (75%) ఎకరాల్లో సాగైంది. మొన్నటి వరకు వరినాట్లపై అనుమానంగా ఉన్న వ్యవసాయ శాఖ పుంజుకున్న సాగుతో కాస్త ఊపిరి పీల్చుకుంది. సాగునీటి సౌకర్యం లేనిచోట వరికి బదులు ప్రత్యామ్నాయ వర్షాధార పంటలు వేయాలని మరోమారు రైతులకు విన్నవించింది.రబీ సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, రంగారెడ్డి, జనగాం, జయశంకర్ , వరంగల్ రూరల్, జిల్లాల్లో తక్కువగా సాగు నమోదైంది. ఇక ఇటీవల కురిసిన వర్షాలతో తీవ్ర వర్షాభావం ఉన్న 18 జిల్లాల సంఖ్య 16కు తగ్గింది.

మూడో విడత పోలింగ్‌లో ఘర్షణలు

ముక్కిడిగుండం గ్రామంలో కాంగ్రెస్, టిఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ

ఇప్పలపల్లిలో ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లతో ఉద్రిక్తత

సర్పంచ్ అభ్యర్థి భర్త ఆత్మహత్యాయత్నం



మనతెలంగాణ/ న్యూస్‌నెట్‌వర్క్ : మూడోవిడత పోలింగ్ సందర్భంగా పలు జిల్లాల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడో విడత ఎన్నికల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఇరువురు సర్పంచ్ అభ్యర్థులైన మణెమ్మ , ఆశ్విని లకు సమానంగా ఓట్లు రావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల అభ్యర్థులు కౌంటింగ్‌ను అడ్డుకొన్నారు. ఒక వర్గం వారు ఆర్డీవో సమక్షంలో ఓట్లు లెక్కించాలని పట్టుబట్టగా , మరో అభ్యర్థి వర్గీయులు రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కౌంటింగ్‌ను, ఎన్నికల ఫలితాల ప్రకటనకు అడ్డుకున్నారు. ఇద్దరికి సమానంగా ఓట్లు రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి వారి ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా మూడు పర్యాయాలు ఓట్లను లెక్కించగా ఆశ్వినికంటే మణెమ్మకు రెండు ఓట్లు తక్కువగా వచ్చాయని ఓ వర్గంవారు చెబుతున్నారు. కాగా బ్యాలెట్ పత్రంపై అటు ఇటుగా ఓటువేసిన వాటిని పక్కకు పెట్టి అధికారుల పరిశీలన అనంతరం అవి ఎవరికి చెందుతాయో నిర్ణయించి ఇద్దరికి సమానంగా ఓట్లు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాటలు చోటుచేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

కాగా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ముక్కిడిగుండం గ్రామంలో ఘర్షణ చోటు చేసుకుంది. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలిచిన దశరథం అనే అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించడానికి అధికారులు సమయాత్తంకాగా టిఆర్ఎస్ వర్గీయులు అడ్డుకొని ఘర్షణకు దిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉండగా పోలీసులు రంగప్రవేశంచేసి ఇరు వర్గాలను చెదరగొట్టి దశరథం గెలుపొందినట్లు ప్రకటించారు. ఈ ఘటనలో పలువురు పోలింగ్ సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్దకొత్తపల్లి మండలంలోని పాతయాపట్లతోపాటు పలు గ్రామాల్లో సైతం స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నాయి. పాతయాపట్లలో ఉపసర్పంచ్ ఎన్నిక కోసం వార్డు సభ్యుడిని తనవెంట తీసుకుపోవడంతో ఈ ఘర్షణ చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామసర్పంచ్‌గా ధారావత్ కమల పోటీచేసింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా కమల తన సమీప అభ్యర్థి కంటే వెనుక పడడాన్ని జీర్ణించుకోలేని కమల భర్త, మాజీ సర్పంచ్ ధారావత్ దేవ ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో హుటాహుటీని ఆయనను చికిత్స నిమిత్త ఆస్పత్రికి తరలించారు.

కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం పెద్ద దేవిసింగ్ తండాలో జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన సుందర్‌సింగ్‌కు యాభైఒక్క ఓట్ల మెజారిటీ వచ్చింది. అక్కడే ఉన్న ప్రత్యర్థి వర్గం స్వతంత్ర అభ్యర్థి సుందర్ సిగ్‌పై రాళ్ల వర్షం కురిపించడంతో పాటు పోలింగ్ కేంద్రంలోని సామాగ్రిని ధ్వసం చేయడంతో పోలింగ్ ఏజెట్లు, అధికారులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. గాయపడిన బామన్‌లగ్గిరాం, బామన్ బైతాసింగ్, బామన్ సుభాష్, బామన్ ఇంద్రజిత్‌లకు ఘాయాలు కాగా బాన్సువాడ ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డిఎస్‌పి పరిస్థితిని చక్కదిద్దారు.ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటువేయడానికి వస్తున్న ఓటర్లను ఓటడిగే ప్రక్రియలో పోటీ ఏర్పడి వార్డు సభ్యులు ఒకరిపై ఒకరు చెప్పులతో దాడి చేసుకున్నారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు కలుగజేసుకుని శాంతింపజేశారు.

ఓటు వేసిన ఎంపి కవిత

మనతెలంగాణ/ నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీపేటమండలంలోని పోతంగల్ గ్రామంలో ఎంపి కవిత బుధవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టంతో గ్రామాలు అభివృద్ధి దిశలో పయనిస్తాయని అన్నారు. ఈ చట్టం వల్ల గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాకారమవుతోందని, ఇకపై కొత్త సర్పంచ్‌లు సక్రమంగా పాలన సాగించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టిఆర్ఎస్ మద్దతుదారులు ఎక్కువ స్థానాలలో విజయం సాధించినట్లు ఎంపి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రాంకిషన్ రావు, మోహన్‌రెడ్డి, నూడా చైర్మన్, టిఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, నర్సింగ్‌రావు, గంగాధర్‌గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక వల్ల దేశానికి ఒరిగేదేం లేదు: కవిత

ప్రియాంక గాంధీ రాజకీయాల్లోకి రావడం వల్ల దేశానికి ఒరిగేది ఏమిలేదని, కాంగ్రెస్, బిజెపిలు రెండూ దొందూ దొందేనని నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం పోతంగల్ గ్రామంలోని ఆమె నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 60 యేళ్లుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల అభివృద్ధి అంటూ మోసగించిందని, బిజెపి కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపిలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో 16 ఎంపీ సీట్లు టిఆర్ఎస్, ఒక్క సీటు ఎంఐఎం గెలవడం ఖాయమని ఆమె పేర్కొన్నారు.

జాతిపితకు కాంగ్రెస్ నివాళి

మన తెలంగాణ/హైదరాబాద్ :మహాత్మాగాంధీ 71వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి టిపిసిసి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సిఎల్పి నాయకుడు భట్టి విక్రమార్క, పార్టీ నగర అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్, టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్లురవి, ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌తో పాటు ప్రేమలాల్, సిజే శ్రీనివాస్, కైలాష్, నగేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫెడరల్ ఫ్రంటే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రఫేల్ యుద్ధ విమానాల కొనుగోళ్ళలో జరిగిన కుంభకోణాన్ని, అవినీతిని ప్రస్తావిస్తూ బిజెపిని టార్గెట్ చేస్తూ ఉంటే బోఫోర్స్ అవినీతిని మళ్ళీ తవ్వితీసి కాంగ్రెస్‌ను కార్నర్ చేయాలని బిజెపి యత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్, బిజెపిలు ఒకదానిపై మరొకటి కుంభకోణాల ఆరోపణలు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మొదటి మంత్రివర్గ సమావేశంలోనే తెలంగాణకు చెందిన 7 మండలాలను ఆం ధ్రలో కలిపి తెలంగాణ వ్యతిరేక చర్యలకు పాల్పడిందని, ఇప్పటివరకు తెలంగాణకు ప్రధాని మోడి ఎలా ంటి సహాయమూ చేయలేదని కవిత ఆరోపించారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. కాశ్మీర్, చైనా లాంటి ప్రధాన సమస్యలను విస్మరించి రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని అన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో మెజారిటీ ఉన్నప్పటికీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై దృష్టి పెట్టలేదని, ఎన్నో బిల్లులపై చూపిన శ్రద్ధ దీనిపై ఎందుకు లేదని ఆమె ప్రశ్నించారు. మహిళలు రాజకీయాల్లోకి రావడం మోడికి ఇష్టం లేదని, అందువల్లనే దానిపైన ధ్యాస లేదన్నారు.

అభివృద్దే మళ్లీ కెసిఆర్‌ను గెలిపించింది.

కెసిఆర్ మళ్లీ విజయం సాధించి టిఆర్ఎస్‌ను గెలిపించడానికి తెలంగాణలో అమలైన అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలేనని కవిత చెప్పారు. ప్రజలంతా కెసిఆర్ పక్షాన ఉండి అభివృద్ధిని అకాంక్షించారన్నారు.. టిఆర్ఎస్ పార్టీని ఓడించాలని కాంగ్రెస్,బిజెపి నాయకులు, కేంద్ర మంత్రులు, వివిధరాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తెలంగాణలో అడ్డా వేసినా ప్రజలు అంగీకరించలేదని చెప్పారు. దేశానికి దిక్సూచిగా తెలంగాణలో సంక్షేమకార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ దేశంలోనే అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రి కెసిఆర్ పక్షాన ఉండి అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. విద్య,వైద్యం, సాగునీరు, తాగునీకు, సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రాభివృద్ధికోసం నిరంతరం శ్రమించడాన్ని ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. తెలంగాణ సాధన ఉద్యమనాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటంతోనే తెలంగాణ అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు.

ప్రజల ఏజెండానే ఫెడరల్ ఫ్రంట్

దేశరాజకీయాల్లో గుణాత్మకమార్పులకోసం సిఎం కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ కోసం జాతీయ స్థాయిలో చేస్తున్న



మంచోడు మా అన్న

ట్విట్టర్ లైవ్‌లో ఆసక్తికరమైన ప్రశ్నలను ప్రేక్షకులు ఎంపి.కవితకు సంధించారు. అన్న కేటిఆర్‌కు ఎన్నిమార్కులు వేస్తారని ప్రశ్నించగా కవిత స్పందించారు.అన్నగా 10కి10 మార్కులు, తండ్రిగా 10కి 100 మార్కులు, కొడుకుగా 10కి10 మార్కులు, ఫ్రెండ్‌గా 10కి10 మార్కులు, భర్తగా 10కి 50 మార్కులు అన్నకెటిఆర్‌కు చెల్లి కవిత ఇచ్చారు. పిల్లలను చాలాబాగా చూసుకుంటారనీ కుటుంబంలో అందరితో కలిసి ఇంటారని చెప్పారు.అయితే ప్రతి ఎన్నికల్లో మెజారిటీని పెంచుకుంటూ వెళ్లుతున్న కెటిఆర్‌కు రాజకీయాల్లో ప్రజలే మార్కులు వేయాలని కోరారు.

కృషి ఫలించబోతుందని కవిత చెప్పారు. త్వరలో జరగబోయో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపికి బలహీన మైన మెజారిటీ వస్తుందనీ ప్రాంతీయ పార్టీల ప్రాభల్యం పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో పూర్తి స్థాయి పార్లమెంట్ స్థానాలు సంపాధించి కేంద్రంలో కీలకంగా తెలంగాణ ఎదగనుందన్నారు. అయితే ఫెడరల్ ఫ్రంట్ ఏజెండా పీపుల్స్ ఏజెండాని ఆమె స్పష్టం చేశారు. దేశరక్షణ గురించి మాట్లాడుతూ కేంద్ర నిధులు విదేశీ ఆయుధాల కొనుగోలుకే మోడి వినియోగిస్తున్నారే కానీ దేశంలో సైనిక పరిశోధనలకు వినియోగించడంలేదని తీవ్రంగా ఆరోపించారు. దేశరక్షణలో సైనికులు చేస్తున్న త్యాగాలను ప్రజలెన్నటికీ మర్చి పోరని చెప్పారు.

నిజమాబాద్ అభివృద్ధికి ప్రాధాన్యత



రాజకీయాల్లో క్రీయాశీలకపాత్ర నిర్వహిస్తున్నా నిజమాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తున్నట్లు కవిత చెప్పారు. నిజమాబాద్ మాస్టర్ ప్లాన్ 1970లో రూపొందించినా అమలుకు నోచుకోలేదన్నారు. ఈనేపథ్యంలో నిజామాబాద్ అర్బన్‌డెవెలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి 2050 నాటివరకు తాగు, సాగునీరు,రోడ్ల నిర్మాణాలు, మౌలికసదుపాయాలు సమకూర్చేందుకు చేసిన కృషి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. ఐటిహబ్ రెండవ దశ పనులు కొనసాగుతున్నాయన్నారు. గతపార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో పసుబోర్డు ఏర్పాటు మిగిలిందన్నారు. కేంద్రం సహకరించకపోవడంతో పసుబోర్డు ఏర్పాటు కాలేదనీ, ప్రస్తుతం పసుబోర్డుతో పాటు ఇల్లులేనివారందరికీ ఇల్లు, పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పన,రాష్ట్రం గర్వించేవిధంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అయితే పార్లమెంట్ అభివృద్ధినిధులను రూ.25కోట్లకు పెంచాలని కవిత కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే గృహిణిలకు ఉపాధి కల్పించేందు ఆహార ఉత్పత్తుల పరిశ్రమలను నిజమాబాద్‌కు తీసుకు రానున్నట్లు ప్రకటించారు.

ప్రియాంకగాంధీ ఫుల్ టైమ్ అతిథి

కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ అతిథిగాపాల్గొనేవారు అయితే ప్రస్తుతం ఆపార్టీలో ఫుల్‌టైం అతిథిగా బాధ్యతలను తీసుకున్నారని ఎంపి కవిత విమర్శించారు. రాజకీయాల్లో వాగ్దానాలు కాదు అమలును ప్రజలు ఆమోదిస్తారని చెప్పారు. ఇందిరాగాంధీ కాలం నుంచి కాంగ్రెస్ గరీభీ హఠావో నినాదం చేస్తుందేకానీ అమలుచేయడంలేదని విమర్శించారు. దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పాలనలోనే పేదలు అధికమయ్యారనే విషయం కూడా ప్రియాంక గాంధీకి తెలియదాని ప్రశ్నించారు. పేదరిక నిర్మూలనపై హామీలు ఇస్తున్న ప్రియాంకగాంధీకి ఆనాటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలపై అవగాహన ఉందాని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రియాంక గాంధీ ప్రభావం ఉండదన్నారు. కాంగ్రెస్ దేశంలో పల్చబడిందనీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సత్తా ఆపార్టీకి లేదన్నారు.

దేశంలోని రాజకీయా-పార్టీల్లో కుటుంబపాలన ఉంది.

దేశంలోని రాజకీయాపార్టీలన్నింటిలో కుటుంబసభ్యులు ప్రజాప్రతినిధులుగా, పాలకులుగా ఉన్నారని పార్లమెంట్ సభ్యురాలు కవిత చెప్పారు. కాంగ్రెస్‌లో కుటుంబపాలనలేదాని ప్రశ్నించారు. నెహ్రూ నుంచి ఇప్పటివరకు జరుగుతుంది ఏమిటన్నారు.ఇక పార్టీయే పరివార్ అంటూ గొప్పలు చెప్పుకునే బిజెపి పార్టీలో సుమారు 100 మంది కుటుంబసభ్యులు ప్రజాప్రతినిధులుగా ఉన్నారని చెప్పారు. టిఆర్ఎస్‌లోను కెసిఆర్ కుటుంబసభ్యులు ప్రజాప్రతినిధులుగా ఉన్నారన్నారు. అయితే కాంగ్రెస్,బిజెపిల మాదిరిగా కుటుంబాలనుంచే ప్రజాప్రతినిధులుగా రాలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రజల ఆశీస్సులతో కెసిఆర్ కుటుంబసభ్యులు అధికారంలో ఉన్నారని వివరించారు.

నాకు రిటైర్ మెంట్ లేదు

అనుకున్నది జరగనప్పుడు రిటైర్‌మెంట్ ప్రకటించడం సరైన విధానంకాదని కవిత చెప్పారు. ''మొదట నర్సు కావాలనుకున్నాను. ఆ తర్వాత ఇంజనీర్ కావాలనుకుని విదేశాల్లో చదివాను. అయినా ఇంజనీర్ గా స్థిరపడలేక పోయాను. ఆ తర్వాత మహిళా వ్యాపారవేత్త కావాలనుకున్నాను. అందులోనూ స్థిరపడలేకపోయాను. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధించాలనుకున్నాను. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యురాలుగా నిజమాబాద్ జిల్లాకు సేవ చేసే అవకాశం లభించింది. భవిష్యత్‌లో మరే బాధ్యతలు నిర్వహిస్తానో తెలియని నాకు రిటైర్‌మెంట్ పై ఆలోచన లేదు'' అని ఆమె స్పష్టం చేశారు. తన అభిమాన రాజకీయవేత్త మార్గరెట్ థాచర్ అని వెల్లడించిన కవిత ఆమెనే తాను స్ఫూర్తిగా తీసుకుంటున్నానన్నారు. 'సెపియన్స్' పుస్తకం అంటే తనకు ఇష్టమని ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

అరణ్యవాసం ముగిసిన సీతారామ

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలో సీతారామకు వరుసగా అనుమతులు వస్తున్నాయి. జనవరి 7వ తేదీన పర్యావరణ అనుమతి లభించగా, 30వ తేదీన అటవీ తుది అనుమతి లభించడం విశేషం. ఇక స్థానిక కలెక్టర్లు, డిఎఫ్ఓ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకొని అటవీ భూములు స్వాధీనం చేసుకోవడమే మిగిలింది. అటవీ శాఖ మొద టి దశ అనుమతుల సమయంలో కేంద్ర ప్రభు త్వం సూచించిన నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభు త్వం రూ.270 కోట్ల పరిహారాన్ని చెల్లించింది. అడవులు పెంచడానికి ప్రత్యామ్నాయ భూములు కూడా చూపింది. ఇక అడవి పెంచే పనిని కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖల బాధ్యత.

అనుమతులపై సిఎం ప్రత్యేక దృష్టి

అటవీ, పర్యావరణ అనుమతులపై ముఖ్యమం త్రి కెసిఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. దీనిపై ఇప్పటికే పలు మార్లు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు, కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌తో ప్రత్యేక చర్చించారు. ఈ చర్చల ఫలితంగానే అనుమతుల ప్రక్రియలో వేగం పెరిగింది. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను వివరించడంతో పాటు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులు సత్వరం మంజూరు కావాల్సిన అవసరాన్ని హర్షవర్ధన్‌కు సిఎం వివరించారు. సిఎం కెసిఆర్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానితో భేటీ అయినప్పుడు కూడా ఇలాంటి అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు కావడం విశేషం.

దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది

సాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక, త్రాగునీటి అవసరాలను ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు 2.72 లక్షల హెక్టార్ల (6.74 లక్షల ఎకరాలు)కు గోదావరి నది నుంచి సాగునీరు అందుతుంది. ఇందులో 1.33 లక్షల హెక్టార్లు (3.29 లక్షల ఎకరాలు) కొత్త ఆయకట్టే కావడం విశేషం. మరో 1.39 లక్షల హెక్టార్ల (3.45 లక్షల ఎకరాలు) మేర భూమి స్థిరీకరణలోకి వస్తుంది. మొత్తంగా సీతారామ ప్రాజెక్టు కారణంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని సాగు, తాగు నీటి అవసరాలు తీరతాయి. కొత్త ఆయకట్టును సృష్టించడమే కాకుండా పలు సంప్రదాయ చెరువులకు నీటిని సరఫరా, గ్రామాల్లో ఇప్పటికే సాగులో ఉన్న కొన్ని పథకాల నిర్వహణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. సుమారు రూ. 13,384 కోట్లు అంచనాతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు 8,476 హెక్టార్ల (సుమారు 21 వేల ఎకరాల) భూమి అవసరం. ఇందులో 1531 హెక్టార్ల (3781 ఎకరాల) అటవీ భూమి కాగా, మిగిలిన భూమిని ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ శాఖల నుంచి సమకూర్చుకోవాలి. దాదాపు 157 గ్రామాల్లోని 9696 కుటుంబాలు ముంపు ప్రభావానికి గురవుతాయి. మూడేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా విధించుకోగా, కీలక అనుమతులు లభించడంతో నిర్మాణం గాడిలో పడనుంది. గోదావరి నది నుంచి దుమ్ముగూడెం ఆనకట్ట బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకునే ఈ ప్రాజెక్టు ద్వారా మూడు టిఎంసిల మేర నీటిని త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది. నాలుగు పంపు హౌజ్‌లు, తొమ్మిది కి.మీ. మేర పైప్‌లైన్ (పంపింగ్ మెయిన్ అవసరాల కోసం) కొన్ని చోట్ల టన్నెల్‌ల నిర్మాణం జరుగుతుంది. ఈ అనుమతులు మంజూరు కావడంతో పాములపాడు దగ్గర లిఫ్టు పంపులను ఏర్పాటు చేసుకోడానికి, తీసుకోడానికి మండలంలోని రోళ్ళపాడు దగ్గర రిజర్వాయర్‌ను నిర్మించుకోడానికి వీలు కలిగింది. ఈ ప్రాజెక్టుతో కూసుమంచి, ఇల్లెందు, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో సాగునీటితో పాటు త్రాగునీటి అవసరాలు తీరుతాయి.

కెవి కేశవులు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యాన్ని పెంపొందించేందుకు రెడీమేడ్ దుస్తుల దిశగా అవగాహన కల్పించారు. చెన్నారెడ్డి సిఎంగా ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న కేశవులు కొండా లక్ష్మణ్ బాపూ జీ, ప్రస్తుత ఎంపి కేశవరావులతో పాటు అనేక మందితో సన్నిహితంగా ఉండేవారు. తెలంగాణ సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తక్కువ విద్యాభ్యాసం కలిగినవారు సైతం స్వంత కాళ్ళపై నిలబడి జీవించే విధంగా ఆలోచించి భూదాన్ పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటికీ ఆ ఇన్‌స్టిట్యూట్ ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తోంది. కేవలం కులవృత్తులపైనే కాకుండా మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా లేత్ మిషన్లు, కంప్యూటర్ బిల్లింగ్ తదితరాల్లోనూ శిక్షణ కల్పించేలా ఆ ఇనిస్టిట్యూట్‌ను తీర్చిదిద్దారు.

కేశవులు మృతి తీరని లోటు : బిసి కమిషన్ చైర్మన్ రాములు

చేనేత మంత్రిగా ఉన్న సమయంలో వినూత్నంగా ఆలోచించి చేనేతకారులను ఎంతగానో ప్రోత్సహించిన కేశవులు మృతి బాధాకరమని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు పేర్కొన్నారు. చేనేతకారులకు మాత్రమే బదుగు బలహీన వర్గాల ప్రజానీకం సంక్షేమానికి కేశవులు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఒకవైపు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కేశవులు మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సాయం చేయడానికి ఆలోచించారని, వినూత్న ఆలోచనలతో మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించి చేనేతకారులకు ఆదర్శనీయుడిగా నిలిచారని, ఇప్పటికీ ఎంతో మంది యువతకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు స్వామి రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్ ద్వారా అందుతుండడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు.

జిఎస్‌టిలు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డినెన్స్ ఉత్తర్వులో వెల్లడించారు. ఈ తెలంగాణ వస్తు సేవల పన్ను(సవరణ) ఆర్డినెన్స్ –2019 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. అసెంబ్లీ ప్రోరోగ్ కావడంతో ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. ఇటీవల జిఎస్‌టి కౌన్సిల్ చేసిన మార్పులకు అనుగుణంగా సెక్షన్‌కు సవరణ చేస్తూ ఈ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చారు. తద్వారా పన్ను ఆదాయం పెంచుకోవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో మొత్తం ఎనిమిది సవరణలు ఉన్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారుల రిజిస్ట్రేషన్ కోసం అమలు చేసే కాంపోజిషన్ స్కీమ్ కింద ఉన్న వార్షిక టర్నోవర్ పరిమితిని రూ. ఒక కోటి నుంచి రూ. కోటిన్నరకు పెంచింది. స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) యూనిట్ లేదా డెవలపర్‌కు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నెంబర్‌ను కేటాయించే వెసులుబాటు కల్పించింది. మోటర్ వాహనాలకు సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపు విషయంలో నిబంధనలు విధించింది. వివిధ సందర్భాల్లో పన్ను చెల్లింపుదారులు చేసుకునే అప్పీళ్లకు కనీస డిపాజిట్, వస్తువుల స్వాధీనానికి సంబంధించి ఉన్న గడువును 7 రోజుల నుంచి 14 రోజులకు పెంచడంతో పాటు వస్తు సరఫరా వంటి అంశాల్లో మార్పులు చేశారు. రిటర్న్ దాఖలు, ఐటిసి క్లయిమ్స్ విషయంలో వ్యాపారులకు సరళీకృత విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

పంచాయతీపి గులాబీకే

(మొదటిపేజీ తరువాయి)

వేశాయి. మరో 489 గ్రామ పంచాయతీల్లో స్వతంత్రులు విజేతలుగా నిలిచారు.

యాదాద్రి భువనగిరిలో 94.99 శాతం పోలింగ్

గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల్లో 88.03 శాతం పోలింగ్ నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 94.99 శాతం ఓటింగ్ నమోదైంది. ఖమ్మం జిల్లాలో 94.56 శాతం, సూర్యాపేటలో 92.60 శాతం, నల్లగొండలో 91.73 శాతం, సిద్దిపేట 90.73 శాతం, సంగారెడ్డి జిల్లాలో 90.15 శాతం, మెదక్‌లో 90.28 శాతం, మహబూబాబాద్ 91.54 శాతం, జనగామలో 89.42 శాతం, గద్వాల 89.81 శాతం, కరీంనగర్‌లో 89.66 శాతం, నిర్మల్ 89.05 శాతం, వరంగల్ రూరల్ 89.78 శాతం ఓటింగ్ నమోదైంది. జగిత్యాల జిల్లాలో అత్యల్పంగా 77.70 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగ్గా... మొత్తం 39,82,043 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. వీరిలో 20,14,003 మంది మహిళలు, 19,68,022 మంది పురుషులున్నారు. ఓటర్లుగా ఉన్న వారి సంఖ్య 45,23,669గా ఉంది.

మూడు విడతల్లోనూ టిఆర్ఎస్‌దే జోరు

ఈ నెల ఒకటవ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏకగ్రీవాలతో కలిపి తొలి విడతలో 2629 పంచాయతీలు, రెండో విడతలో 2601, మూడో విడతలో 2434 పంచాయతీలలో టిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులే గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన కాంగ్రెస్, పంచాయతీ ఎన్నికల్లో తన ఉనికిని చాటుకుంది. మూడు విడతల్లో వరుసగా 920, 835, 927 పంచాయతీలలో ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలుపొందారు. మొత్తంగా కాంగ్రెస్ 2682 సర్పంచ్‌లను గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. ఇక మూడు విడతల్లో కలిపి టిడిపి 82, బిజెపి 163, సిపిఐ 50, సిపిఎం 76, స్వతంత్రులు 1808 పంచాయతీల్లో సర్పంచ్‌లుగా విజయం సాధించారు.









కుళ్లిన మాంసంతో బిర్యానీ

హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



మన తెలంగాణ/శామీర్‌పేట : కుళ్లిపోయిన మాంసంతో బిర్యానీ వండు తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న తందూర్ హోటల్‌ను మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు బుధవారం సీజ్ చేశారు. అధికారులు మాట్లాడుతూ శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దొంగల మైసమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన తందూర్ హోటల్‌లో కుళ్లిన మాంసంతో బిర్యానీ తయారు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని, గతంలో హెచ్చరికలు సైతం జారీ చేశామన్నారు. మరో మా రు షోకాజ్ నోటీసులు ఇచ్చామని యాజమన్యంలో ఎలాంటి మార్పు రాకపోవడంతో తనిఖీలు చేపట్టామని, వారి పంత మార్చుకోక పోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం హోటల్‌లో తనిఖీలు చేయాగా డీప్ ఫ్రీజ్‌లో నిల్వ ఉంచిన మాంసం లభించిందన్నారు. హోటల్‌ల్లో పరిశుభ్రత సైతం పూర్తిగా లోపించిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు లక్ష్మా రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్

రూ.5వేల లంచం డిమాండ్



మన తెలంగాణ/ సంగారెడ్డి ప్రతినిధి : లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కిన అధికారి ఉదంతం ఇది. సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న జిల్లా ఆర్‌టిఒ కా ర్యాలయంపై బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎంవిఐ అనీల్‌కుమార్ చౌహాన్ పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డిలోని బాలాజీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ వారు ట్రాక్టర్ ట్రాలీలను తయారు చేస్తుంటారు. వాటికి తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ అవసరమవుతుంది. ఈ నెంబర్ కోసం ఆర్‌టిఒ అనుమతి కావాలి. ఇంతకు ముందు తీసుకున్న అనుమతి గడువు ముగియడంతో ఆ సంస్థ యజమాని ఆర్‌టిఒ అధికారులను సంప్రదించగా వారు రూ.5వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సదరు యజమాని సందీప్ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించడంతో వారు వలపన్ని బుధవారం నాడు లంచంగా రూ.5వేలను ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా సాయికుమార్ అనే ఏజెంట్‌కు ఇస్తుండగా పట్టుకున్నారు. అయితే అంతకు ముందు ఎంవిఐ హోంగార్డు సాయిరాంను కలుసుకోవాలని సూచించారు. హోంగార్డును కలవగా అతను ఏజెంట్‌ను కలుసుకోవాలని పేర్కొన్నారు. దీంతో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ సీఎస్పీ వి.రవికుమార్ తెలిపారు.

ఎస్‌సి వసతిగృహం నుంచి బాలికల అదృశ్యం

ముంబాయిలో ప్రత్యక్షం





మన తెలంగాణ/ మిర్యాలగూడ క్రైమ్ : నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని విద్యానగర్‌లో గల ఎస్సీ బాలికల వసతి గృహం నుండి ఇద్దరు అమ్మాయిలు అదృశ్యమై ముంబాయిలో దొరికిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వార్డెన్ పార్వతి తెలిపిన వివరాల ప్రకారం తమ వసతి గృహంలో ఉండే మహబూబ్‌నగర్ జిల్లా కటకేరి నింగమ్మతో పాటు కరీంనగర్ జిల్లా చిప్పలపల్లికి చెందిన ఆలెపు పూజ అనే ఇద్దరు అమ్మాయిలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారన్నారు. వీరిద్దరూ మంగళవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా తమ బ్యాగులతోబయటకు వెళ్లారని , తిరిగి సాయంత్రం వసతి గృహానికి రాలేదన్నారు. కాలేజీకి అని వెళ్లిన ఇద్దరమ్మాయిలు చెవిటి, మూగవారు కావడంతో ఆందోళనకు గురైన వార్డెన్‌తో పాటు ఇతర విద్యార్థులు వెంటనే అమ్మాయిల ఆచూకీ కోసం చుట్టుప్రక్కల వెతికినప్పటికీ కనబడక పోయేసరికి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు వార్డెన్ పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా వారి ఆచూకీ ముంబాయిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు భారత్ బంద్‌కి మావోయిస్టుల పిలుపు

ఏజెన్సీ గ్రామాల్లో పోలీసుల నిఘా

మన తెలంగాణ/వెంకటాపురం(నూగురు) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు గ్రామాలలో మావోయిస్టుల బంద్ పురస్కరించుకొని యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. మావోయిస్టులు నిత్యం ఏదో ఒక చోట విధ్వంసం జరుపుతుండటంతో గిరిజన గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే చత్తీస్ ఘడ్ తెలంగాణ సరిహద్దుల్లో పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు. ఈ మధ్యకాలంలో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు వెంకటాపురం మండలం సూరవీడు వద్ద చెరువు పనులు చేస్తున్న జెసిబిని తగలబెట్టారు. అనంతరం రోడ్లపై కరపత్రాలు బ్యానర్లను వదిలివెళ్లారు. ఈ నెల 25 నుండి 30 వరకు బందు నేపథ్యంలో అలాగే 31 న రాష్ట్ర బంద్ నిర్వహించాలని పిలుపునివ్వడంతో ఏజెన్సీ గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామాల్లోని ప్రజలు బిక్కు బిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్నారు. పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఏదో ఒక చోట విధ్వంసం సృష్టిస్తున్నారు. మావోయిస్టుల కదలికలను తెలుసుకునేందుకు కూంబింగ్ ముమ్మరం చేశారు. జిల్లాల్లో కరపత్రాలు దర్శనమివ్వడంతో పోలీసు శఆఖ అప్రమత్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటుఏచసిందని చెప్పవచ్చు. వెంకటాపురం మండలం మావోయిస్టులు తమ పట్టును కోల్పోకుండా ఏదో ఒక అలజడి సృష్టిస్తున్నారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీస్ శాఖ ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వెంకటాపురం మండలంలో పోలీసులు ముమ్మరంగా వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మావోయిస్టుల బంద్ నేపథ్యంలో రాత్రివేళల్లో వెంకటాపురం, వాజేడు మండలాలకు బస్సు సర్వీసులను నిలిపి వేసింది.

ప్రాజెక్టులపై ఇతర రాష్ట్రాలకు

ప్రజెంటేషన్



- మిషన్ కాకతీయ, భగీరథ ప్రగతిపై కూడా
- పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ట్రైనీ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్‌లు

మన తెలంగాణ/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలపై వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు తెలంగాణ ఇంజనీర్లు ప్రజెంటేషన్లు ఇచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన కార్యక్రమంలో భారత అంతర్గత శిక్షణా సంస్థ ద్వారా ఎంపిక చేసిన అధికారులకు 'ఇంప్లిమెంటేషన్, మానిటరింగ్ ఆఫ్ సస్టెయినబుల్ గ్యారంటీ స్కీమ్స్' అంశంపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తెలంగాణ పథకాలు, ప్రాజెక్టులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. మొదట సిఎం ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే ఆహ్వానం పలికి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఇఎన్‌సి కాళేశ్వరం హరిరాం ప్రాజెక్టు లక్ష్యాలు, సాంకేతిక వివరాలు మ్యాప్ ద్వారా వివరించారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా హైదరాబాద్ నుంచి ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న విధానాన్ని తెలియజేశారు. డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ, ప్రాజెక్టు పనుల వీడియో రికార్డింగులు వారికి చూపించారు. రెండేళ్లలోనే ప్రాజెక్టు లింక్ 1, లింక్ 2 పనుల్లో 95 శాతం ప్రగతి సాధించామని వివరించారు. జూన్ 2019 నాటికి గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేయడానికి పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నామన్నారు. ఏప్రిల్ 30 నాటికి పూర్తిచేసి మే నెలలో అన్ని పరీక్షలు నిర్వహించుకొని జూన్ నాటికి నీటిని ఎత్తిపోసేలా కార్యచరణతో ముందుకు పోతున్నామని వివరించారు. అనంతరం మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్ మిషన్ కాకతీయ లక్ష్యాలు, నాలుగేళ్లలో సాధించిన విజయాలపై సవివరంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. రూ.8741.80 కోట్ల అంచనా వ్యయంతో 21.39 లక్షల ఎకరాల స్థిరీకరణే లక్ష్యంగా 27,653 చెరువుల పనులు చేపట్టామని, 20,192 చెరువుల పనులు పూర్తయ్యాయని వివరించారు. వీటి ద్వారా దాదాపుగా 13.80 లక్షల ఎకరాలు స్థిరీకరించామని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మిషన్ భగీరథ కన్సల్టెంట్, రిటైర్డ్ సిఇ జగన్మోహన్ 'మిషన్ భగీరథ'పై ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపుగా రాష్ట్రంలోని 25 వేల గ్రామాల్లో ప్రతి ఇంటికీ నల్ల ద్వారా నీళ్లు ఇచ్చే బృహత్తర కార్యక్రమం మిషన్ భగీరథ చివరి దశకు చేరిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమాలతో ప్రజలకు మేలు జరుగుతుందని, రాజస్థాన్‌లో ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడానికి తాము కృషి చేస్తామని, వీటి అధ్యయనానికి అధికారులను పంపిస్తామని ఆ రాష్ట్ర అధికారి రాజేష్ శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల పట్ల ట్రైనీ అధికారులు సంతృప్తిని వ్యక్తం చేసారు. మంచి ప్రజెంటేషన్లు ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కాళేశ్వరం ఎస్‌ఇ సుధాకర్ రెడ్డి, రాజస్థాన్ నుంచి రాజేష్ శర్మ, పశు సంవర్థక శాఖ కమిషనర్ కాంతిలాల్ ఉమావ్, కేంద్ర హోంశాఖ తరపున మురళీధర్, కేంద్ర ఆర్థిక శాఖ తరపున కుసుమ్ పద్మనాభన్, సుధా రాజగోపాలన్, తెలంగాణ అదనపు సిసిఎఫ్ శివానీ డోగ్రా, రాష్ట్ర అటవీ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ మాధవరావు పాల్గొన్నారు.



అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు అరికట్టొచ్చు

- అగ్నిమాపక శాఖ డిజి గోపికృష్ణ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో అగ్ని ప్రమాదాలలో చెలరేగే మంటలను సకాలంలో అదుపులోకి తీసుకొచ్చేందుకు అగ్నిమాపక శాఖలో అధునాతన వాహనాలను సమకూర్చినట్లు అగ్నిమాపక శాఖ డిజి గోపికృష్ణ తెలిపారు. రాష్ట్రంలో 118 ఫైర్ స్టేషన్లు, 15 ఔట్ పోస్టులలో 2122 మంది వివిధ హోదాలలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు 584 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అగ్నిమాపక శాఖలోకి అదనంగా మరో 1900 మంది సిబ్బందిని సర్కారు కేటాయించిందని, ప్రస్తుతానికి కొంతమంది శిక్షణలో ఉన్నారని, వారి చేరికతో త్వరలోనే అగ్నిమాపక శాఖ మరింత బలోపేతమవుతుందన్నారు. అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు, ప్రమాద ఘటనలో మంటలను నియంత్రించేందుకు, అదుపులోకి తెచ్చేందుకు వివిధ రకాలైన 573 ఫైర్ ఇంజన్లు ఉన్నాయన్నారు. వీటిలో అత్యంత ఆధునాతమైన హజ్మత్ వాహనం సైతం ఉందన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో అగ్నిమాపక శాఖ ఔట్ పోస్టులను సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైతే మరిన్ని ఔట్ పోస్టులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వేసవికి ముందస్తు జాగ్రత్తలు

రానున్న వేసవి కాలంలో అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ముందస్తుగా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. భారీ అగ్నిప్రమాదాలు జరిగే ప్రాంతాలలో సేఫ్టీ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలలో ఫైర్ ఇంజన్లు అన్ని వైపుల నుంచి మంటలను అరికట్టేందుకు వీలుగా ఇండస్ట్రియల్ కంపెనీల వారికి సూచనలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా షార్ట్‌సర్క్యూట్ మూలంగా వేసవిలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు. అగ్నిమాపక శాఖ అధికారుల తనిఖీలో లోపాలుంటే వారిపై అక్కడే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సంస్థల నిర్లక్ష్యం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటే ఉపేక్షించేది లేదన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

రాష్ట్రంలోని పెద్దపెద్ద హోటల్స్, అపార్ట్‌మెంట్స్, హాస్పిటల్స్, స్కూల్స్, షాపింగ్ మాల్స్, ఉత్పత్తి, వ్యాపార సంస్థలు తదితర నిర్మాణాలు చేపట్టక మునుపే ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ పొందాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారికి నోటీసులు పంపుతున్నామన్నారు. నోటీసులకు స్పందించేందుకు నెల గడువు ఉంటుందని, ఆ సమయంలో స్పందించని వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

అటవీ భూముల ఆక్రమణ

మనతెలంగాణ/అడవిదేవులపల్లి : నల్గొండలోని అడవిదేవులపల్లి మండలంలో కొందరు రాత్రికి రాత్రే అటవీ భూములు ఆక్రమించారని కేవీపీఎస్ జిల్లా సభ్యులు దేవతల సైదులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రం శివారులోని కృష్ణానది ఒడ్డున ఉన్న బౌద్ధమ దేవాలయాల వద్ద పచ్చని తోరణాల్లా ఉండే అటవీ భూములు కనుమరుగైపోతున్నాయన్నారు. అటవీ భూములకు రక్షణ కరువైందన్నారు. అటవీ భూములు ఆక్రమించి చెట్లను తొలగించి చదును చేసి సేద్యం చేయాలనుకుంటున్నారని, వాటిని ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకొని ఫారెస్టు భూములకు కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి సైదులు, మండలి సైదులు, లింగయ్య, రామాంజనేయులు కోటేశ్, ఆంజనేయులు, మణెమ్మ, శ్రీరాములు ఉన్నారు.

ఓరుగంటి రెడ్డి వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- వచ్చే నెల ఒకటవ తేదీన కార్పొరేషన్ సాధన యాత్ర
- శ్రీమద్రాసు ఆంధ్ర ఓరుగంటి రెడ్డి సంఘం స్పష్టీకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : ఓరుగంటి రెడ్డి సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించి అన్యాయం చేయాలని శ్రీ మద్రాసు ఆంధ్ర ఓరుగంటి రెడ్డి సంఘం కన్వీనర్ అట్ల వెంకటకృష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రాష్ట్ర జనాభా సంఖ్యలో కేవలం 60 శాతం కలిగిన సామాజకవర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వాలు జనాభాలో 80 శాతం మేరకు కలిగిన ఓరుగంటి రెడ్డి కులస్తులను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ, 12వ శతాబ్ధంలో ఓరుగల్లు రాజధానిగా కాకతీయ సామ్రాజ్య పాలన సాగిస్తున్న కాలంలో వారి వద్ద సైనికాధికారులుగా ఓరుగంటి రెడ్లు గుర్తింపు పొందారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాంటి రెడ్డి కులస్తులు ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశంలో వలస వచ్చిన రాష్ట్ర కూటులు తదనంతరకాలంలో రట్టకుడి,రట్టడి, రాథోడ్,రధ్రికం, రెడ్డియార్‌గా రూపాంతరం చెందిన విషయాన్ని గుర్తు చేశారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఓరుగంటి రెడ్డి కులస్తుల ఉనికి కోసం 1941వ సంవత్సరం నుంచి పోరాడుతూనే ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం తమ సామాజకవర్గం ఏపీలోని ఐదు పార్లమెంట్, 21 అసెంబ్లీ నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపోటములలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాజకీయా పార్టీల,పాలకుల ఆదరణ కొరవడంతో విపత్కర పరిస్థితులను ఓరుగంటి రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయంలో కేవలం ఒకేఒక్క పర్యాయం కాంగ్రెస్ తరపున చీరాల గోవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా తమ కులస్తులు ఆర్థిక, సామాజక, రాజకీయ వెనుకబాటును అధగమించి తగిన గుర్తింపు పొందే క్రమంలో కార్పొరేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ సాధించుకునేందుకు ఆయా ప్రాంతాలలో పర్యటించి వారి ఆర్థిక స్థితిగతులపై ఆధ్యాయనం చేయనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కర్లపాలెం ఐలాండ్ సెంటర్ నుంచి ఓరుగంటి రెడ్డి కార్పొరేషన్ సాధన యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు జరిగే ఈ యాత్ర మచిలీపట్నం నుండి మద్రాసు వరకు కొనసాగుతుందన్నారు. ఆ అధ్యాయన నివేదికలను అన్ని రాజకీయ పార్టీలకు, ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. తమ గోడు అన్ని రాజకీయ పార్టీలకు వినిపించి ఓరుగంటి రెడ్డి కులస్తులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేంత వరకు రాజీలేని పోటారాన్ని కొనసాగిస్తామని కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎస్.ప్రసన్న కుమార్‌రెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి, పి. భూపాల్‌రెడ్డి, ఎ.బాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

మన తెలంగాణ/పర్వతగిరి : పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జరిగింది, ఎస్‌ఐ కరుణాకర్ కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన మడ్డి వెంకటేశ్వర్లు, రాణి కూతురు మడ్డి ప్రసన్న(15) ఆదర్శ పాఠశాలలో చదువుతూ పాఠశాల వసతి గృహంలో ఉంటుంది, బుధవారం సాయంత్రం విరామ సమయంలో వసతి గృహ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది, ఈ సంఘటన చూసిన విద్యార్థిని ఉపాధ్యాయులు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందిందని కారణాలు తెలియరాలేదు అని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- మరో 10 మందికి తీవ్ర గాయాలు
- గాయపడిన ముగ్గురి పరిస్థితి విషమం
- కిష్టంపేట వద్ద టాటా ఎసిని ఢీకొన్న ఇసుక టిప్పర్





మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి, ఆదిలాబాద్ : మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందగా పలువురు గాయాలపాలయ్యారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలో జోడువాగు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసరంగా హైదరాబాద్‌కు తరలించారు. మహారాష్ట్రలోని చిరొంచకు చెందిన మర్రి రాజు(35), చెన్నూర్‌లోని దుబ్బగూడెం కాలనీకి చెందిన కడవండి రాజపోషం(45)లు అక్కడికక్కడే మృతి చెందగా ఈ ప్రమాదంలో ఆకుల సంధ్య,ముత్రకోల ప్రభు, నాయిని లచ్చయ్య, నిట్టూరి రాజబాబు,ననగోశ పోషన్న, మున్ని స్వప్న, రాజగౌడ్, తన్మయి,ముద్దవేని వెంకటేష్, ముద్దవేని రాజమౌళిలు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నూర్ కొత్త బస్టాండ్ నుండి మంచిర్యాలకు వెళ్లేందుకు పలువురు టాటా ఏసి వాహనాన్ని ఎక్కారు. చెన్నూర్ నుండి బయలుదేరిన 15 నిమిషాలకే కిష్టంపేట సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద మంచిర్యాల నుండి చెన్నూర్‌కు వస్తున్న ఇసుక టిప్పర్ టాటాఏసి వాహనాన్ని ఒక్కసారిగా ఢీకొట్టడంతో టాటా ఏసి ముందు భాగంగా నుజ్జునుజ్జు అయింది. దీంతో టాటా ఏసి వాహనంలో ప్రయాణం చేస్తున్న పలువురు గాయపడ్డారు.

సిరోంచాలోని ఒకే కుటుంబానికి చెందిన మర్రి రాజు,భార్య స్వప్న, బావమరిది ప్రభు అందరు కలసి గాజులు, ఇతర సామాగ్రి కొనుగోలు చేసేందుకు మంచిర్యాల వెళ్తున్నారు. వీరందరు పూసవేర్ల కుల వృత్తి కావడంతో మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో గాజులు బొట్టు బిల్లలు, ఇతర సామాగ్రి అమ్ముకునే వారని తెలిపారు. ఇందులో మర్రిరాజు, అక్కడికక్కడే మృతి చెందగా రాజన్న భార్య స్వప్నతో పాటు బావమరిది ప్రభును మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన కొద్ది సేపటికే జైపూర్ ఏసిపి వెంకట్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయపడిన వారిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చెన్నూర్ ఎస్‌ఐ విక్టర్ లారీ డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం జందాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల మండలానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బేలకు చెందిన జల్‌పెల్లివార్ సంతోష్, మంగళ కుమారుడైన జల్‌పెల్లివార్ శుభమ్, మండలంలోని మణియార్‌పూర్‌కు చెందిన మునేశ్వర్‌వార్ మహాదేవ్, కౌలస్యభాయిల కుమారుడు మునేశ్వర్ దినేష్‌లు మిషన్ భగీరథ పథకంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరికి మంగళవారం ఆదిలాబాద్‌లో మీటింగ్ ఉండగా అది పూర్తి చేసుకుని సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై బేలకు వెళ్తుండగా జందాపూర్ క్రాస్ రోడ్డువద్ద ఎత్తుగా ఉన్న జాతీయ రహదారిపై నుంచి బ్రిడ్జిని ఢీకొట్టి పడిపోయారు. రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి కంగారు పడ్డ తల్లిదండ్రులు వారికి ఫోన్ చేయగా ఎలాంటి స్పందనా లేదు. వారి స్నేహితులు, ఇతరులును ఆరా తీసినా ఆచూకి లభించలేదు. బేలనుంచి ఆదిలాబాద్‌వరకు రోడ్డువెంట గాలించగా బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతం లో వారి ఆచూకి లభించింది.

విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతులిద్దరూ కూడాను తల్లిదండ్రులకు ఏకైక కుమారులు కావడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతులిద్దరి తల్లులు అంగన్వాడీ కార్యకర్తలు కావడంతో విషయం తెలిసిన అంగన్‌వాడీ టీచర్లు రిమ్స్‌కు చేరుకుని వారిని పరామర్శించారు. ఇదిలాఉంటే ఆ సమ యంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే జోగురామన్న, ఇతర టీఆర్ఎస్ నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, మృతుల వివరాలను తెలుసుకున్న ఆయన యువకుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'మణికర్ణిక' చిత్రంలో కంగనారనౌత్ నా పాత్రను తగ్గించిన విధానం చూసి చాలా బాధపడ్డాను. దర్శకుడు క్రిష్ టాలెంట్ ఉన్న వ్యక్తి. ఆయనతో కలిసి పనిచేసే అవకాశం 'మణికర్ణిక' ద్వారా వచ్చినందుకు ఎంతో సంతోషపడ్డాను. విడుదలయ్యాక ఈ సినిమా చూసిన తర్వాత చాలా బాధపడ్డాను. కంగన నా పాత్రను క్యారికేచర్‌లా మార్చేశారు.
– నటి మిష్టి చక్రవర్తి

సినిమా



ముచ్చటగా మూడవసారి

సీనియర్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలకు హీరోయిన్ల సమస్య ఏర్పడుతోంది. ఈ సీనియర్ స్టార్ హీరోల సినిమాలు మొదలైన సమయంలో హీరోయిన్ల విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. యంగ్ హీరోయిన్లు ఈ సీనియర్ స్టార్లతో కలిసి నటిస్తే బాగుండదని కొందరు సీనియర్ హీరోయిన్లను మాత్రమే వీరి సినిమాల్లో తీసుకుంటున్నారు. సీనియర్ హీరోయిన్లలో శ్రియాను బాలకృష్ణ రిపీట్ చేసి మరీ ఆమెతో నటించారు. ఇప్పుడు వెంకటేష్ కూడా శ్రియాతో సినిమాకు సిద్ధం అవుతున్నట్లుగా తెలిసింది. ఇటీవలే 'ఎఫ్ 2' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన వెంకటేష్ తన తదుపరి చిత్రం 'వెంకీ మామ'ను నాగచైతన్యతో కలిసి చేయబోతున్నారు. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంలో వెంకటేష్‌కు జోడీగా హ్యూమా ఖురేషి నటించబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఆమెను దాదాపుగా ఓకే చేశారని అనుకున్నారు. కానీ తాజా సమాచారం ప్రకారం వెంకీకి జోడీగా శ్రియాను ఎంపిక చేసినట్లుగా తెలిసింది. సినిమా కథానుసారంగా పాపులర్ హీరోయిన్ అయితేనే బాగుంటుందని ఫిల్మ్‌మేకర్స్ భావించారు. గతంలో వెంకటేష్, శ్రియా కలిసి నటించారు కనుక ఈ సీనియర్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్లుగా తెలిసింది. వీరిద్దరు కలిసి ఇప్పటికే సుభాష్‌చంద్రబోస్, గోపాల గోపాల చిత్రాల్లో నటించారు. మూడవసారి వీరి కాంబినేషన్ ప్రేక్షకులను ఏమేరకు అలరించనుందో చూడాలి. ఇక నాగచైతన్యకు జోడీగా రకుల్‌ప్రీత్ సింగ్‌ను ఎంపిక చేయబోతున్నట్లుగా టాక్ వినిపిస్తోంది.

టాలీవుడ్‌లోకి ది గ్రేట్ ఖలీ

ఇండియన్ రెజ్లింగ్ స్టార్ 'ది గ్రేట్ ఖలీ' టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. జయంత సి.పరాన్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నరేంద్ర' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించబోతున్నారు ఈ ఏడడుగుల రెజ్లర్. ఇప్పటికే పలు హాలీవుడ్ సినిమాల్లో, అమెరికన్ టివి షోలలో నటించిన ఖలీ 'బిగ్‌బాస్ సీజన్ 4'లో కూడా కనిపించి అభిమానులను అలరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న 'నరేంద్ర' చిత్రంలో నీలేష్ ఎటి, ఇజబెల్లా జంటగా నటిస్తున్నారు. ఇండియా, పాకిస్థాన్ నేపథ్యంతో సినిమా రూపొందనుండడంతో ఇస్లామిక్ దేశంలో చిత్రీకరణ జరిపేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాతో బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ రామ్ సంపత్ తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఇషాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వీరేన్ తంబిదొరై, ఎడిటర్ మార్తాండ్ కె.వెంకటేష్, డైలాగ్స్ః హరీష్ కోయలగుండ్ల, ఫైట్స్ః వెంకట్.





'4 లెటర్స్' బిగ్ సీడీని విడుదల చేస్తున్న ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి. చిత్రంలో ఈశ్వర్, అంకిత, టువ, ఆర్.రఘురాజ్, దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ తదితరులు

ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కు 4 లెటర్స్ అంకితం

ఈశ్వర్‌ను కథానాయకుడిగా పరిచయం చేస్తూ శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన సినిమా '4 లెటర్స్'. కుర్రాళ్లకు అర్థమవుతుందిలే... అనేది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ఆర్.రఘురాజ్ దర్శకత్వం వహించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందించారు. ఈ సినిమా ఆడియో ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాత జెమిని కిరణ్ ఓం శ్రీచక్ర క్రియేషన్స్ సంస్థ లోగోను విడుదల చేశారు. దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమా కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాత అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి ఆడియో బిగ్ సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ''ఈశ్వర్ కమర్షియల్ హీరోగా ఎదగాలని అనుకుంటున్నాడు. అతని తండ్రి, తల్లి, కుటుంబం అండగా నిలబడి అతని కలను నిజం చేశారు. ఇక ప్రేక్షకులకు చక్కటి సినిమా అందివ్వాలని వారు ప్రయత్నించారు''అని అన్నారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ ''ఈ సినిమాను 75 రోజుల్లో పూర్తిచేశాం. మంచి సందేశంతో తీసిన సినిమా ఇది. ఒకరోజు ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తుంటే... 'సైన్స్ ఈజ్ అబౌట్ థింకింగ్. ఇంజనీరింగ్ అబౌట్ డూయింగ్. బట్ ఆల్ ఇంజనీర్స్ ఆర్ డయింగ్' అని ఒక బోర్డ్ చూశాను. మా డ్రైవర్‌ను అడిగితే... ఇది రాసింది ఓ బిటెక్ స్టూడెంట్ అని తెలిసింది. అప్పుడు వచ్చిన ఆలోచనతో ఈ సినిమా తీశాను. ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కు ఈ సినిమాను అంకితమిస్తున్నాం. సినిమా సెకండాఫ్‌లో డిఫరెంట్ పాయింట్‌ను టచ్ చేశాం. 'లవ్ ఎట్ సెవన్ లుక్' కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాను''అని తెలిపారు. నిర్మాత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ''మా అబ్బాయి ఈశ్వర్‌ను డాక్టర్ చేయాలనుకున్నాం. తను యాక్టర్ అవుతానని చెప్పడంతో సత్యానంద్ దగ్గరికి పంపాను. సినిమాలపై ఉన్న ప్రేమతో '4 లెటర్స్' తీశాం. ఇంజనీరింగ్ నేపథ్యంలో తీసిన ఈ సినిమాను ఫిబ్రవరి 8న విడుదల చేయాలనుకుంటున్నాం. ట్రైలర్స్, సాంగ్స్ చూసి అందరూ మా అబ్బాయి బాగా చేశాడని అంటుంటే సంతోషంగా ఉంది''అని చెప్పారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ ''అమెరికాలో చదువుకుంటున్న నాకు సినిమాలు అంటే ఎప్పటినుంచో ఇష్టం. ఇక ఈ సినిమా కోసం మా దర్శకుడు రఘురాజ్ నాకు బాడీ లాంగ్వేజ్, వర్క్ డిసిప్లేన్ అన్నీ నేర్పించారు. సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, చంద్రబోస్, భీమ్స్, సీనియర్ నటుడు సురేష్, కొరియోగ్రాఫర్ గణేష్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం అలరించే సస్పెన్స్ థ్రిల్లర్



'అక్కడొకడుంటాడు' ఆడియో ఆవిష్కరణ వేడుకలో సి.కల్యాణ్, వల్లభనేని జనార్ధన్, శివ కంఠంనేని, అలేఖ్య, అల్లరి రవిబాబు, శ్రీపాద విశ్వక్ తదితరులు

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రూపొందిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. ఇతర ప్రధాన పాత్రల్లో అల్లరి రవిబాబు, వినోద్ కుమార్, ఇంద్రజ నటించగా.... హీరోహీరోయిన్లుగా రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించారు. లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకర రావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు వల్లభనేని జనార్ధన్ ఆడియో సీడీలను ఆవిష్కరించి తొలి సీడీని నిర్మాత సి.కల్యాణ్‌కు అందించారు. ఈ సందర్భంగా సి.కల్యాణ్ మాట్లాడుతూ ''ప్రతి వారం పది చిన్న సినిమాలు, ఒక పెద్ద సినిమా విడుదలవుతుంటాయి. అయితే పది చిన్న సినిమాలలో ఒకటిగా కాకుండా ఓ ప్రత్యేక సినిమాగా ఈ చిత్రం ప్రేక్షకులను అలరింపచేస్తుందన్న నమ్మకం ఉంది. మందుబాబులు అర్ధరాత్రి సమయంలో కార్లు నడుపుతూ చేసే ఆగడాల వల్ల జరిగే అనర్థాలను ఇందులో చూపించారు. వినోదంతో పాటు సందేశాన్ని అందించే చిత్రమిది''అని అన్నారు. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ అక్కడొకడుంటాడు... ఎక్కడుంటాడు... ఎందుకుంటాడు? అన్న విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందేనని తెలిపారు. చిత్ర నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పైరసీ జోలికి వెళ్లకుండా ప్రేక్షకులు కేవలం థియేటర్లలో చూస్తేనే ఈ చిత్రం సాంకేతికంగా ఎంత గొప్పగా ఉంటుందో అర్థమవుతుందని చెప్పారు. చిత్ర దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ ''కాన్సెప్ట్ ప్రధాన చిత్రమిది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆద్యంతం అలరిస్తుంది'' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లరి రవిబాబుతో పాటు చిత్ర బృందం పాల్గొంది.

టీజర్‌కు సన్నాహాలు

లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. రామ్ కార్తిక్, పూజిత పొన్నాడ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన 'పాపా నీకేదంటే ఇష్టం' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మాస్ హంగులు జోడించి ఈ పాటను చిత్రీకరించారు. త్వరలో టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు నిర్మాతలు. ఈ చిత్రంలో నటిస్తున్న హాస్య నటులు ప్రవీణ్, మధునందన్‌ల కామెడీ హైలైట్‌గా నిలవనుంది. ఏబిటి క్రియేషన్స్ బ్యానర్ పతాకంపై గురునాథ్ రెడ్డి సమర్పిస్తున్న ఈ సినిమాను ఎం.శ్రీధర్ రెడ్డి, హెచ్.ఆనంద్ రెడ్డి, ఆర్.కె.రెడ్డిలు నిర్మిస్తున్నారు. బ్రహ్మాజీ, పంకజ్ కేసరి, అన్నపూర్ణమ్మ, జబర్దస్త్ మహేష్, జెమినీ సురేష్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వెంకట్ ఆర్.శాఖమూరి, మ్యూజిక్ః హరి గౌర, కథ, కథనం, మాటలుః తాటవర్తి కిరణ్, ఎడిటర్ః ఎస్.ఆర్.శేఖర్, ఆర్ట్ః బ్రహ్మకడలి, ఫైట్స్ః రామ్ సుంకర, డ్యాన్స్ః శేఖర్.



ఆ నటితో ఏడు సంవత్సరాలు మాట్లాడలేదు!



బాలీవుడ్‌లో ఒకప్పుడు అమీర్‌ఖాన్, జూహీచావ్లా జంట హిట్ కాంబినేషన్‌గా పేరుగాంచింది. ఖయామత్ సే ఖయామత్ తక్ చిత్రంతో పాటు పలు హిట్ సినిమాల్లో వీరిద్దరు కలిసి నటించి మంచి సక్సెస్‌లను దక్కించుకున్నారు. అయితే పెళ్లయిన తర్వాత జూహీచావ్లా హీరోయిన్‌గా సినిమాలు చేయడం మానేసింది. అమీర్‌ఖాన్ మాత్రం ఇంకా బాలీవుడ్ స్టార్ హీరోగా కొనసాగుతూనే ఉన్నారు. జూహీ ఇండస్ట్రీలో లేకున్నా కూడా అమీర్ ఇంకా ఆమెతో మంచి స్నేహాన్ని కొనసాగిస్తున్నారట. ఇద్దరం మంచి స్నేహితులమని చెప్పిన ఈ స్టార్ హీరో గతంలో తామిద్దరం ఒక చిన్న గొడవ కారణంగా ఏడు సంవత్సరాలు మాట్లాడుకోలేదని చెప్పారు. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న అమీర్‌ఖాన్ పలు ఆసక్తికర విషయాలను తెలియజేశారు. జూహీచావ్లాతో 'ఇష్క్' సినిమా సమయంలో చిన్న విషయమై గొడవ జరిగిందని... ఆతర్వాత ఆ గొడవ పెద్దదయ్యిందని అమీర్‌ఖాన్ చెప్పారు. ఆతర్వాత చాలా కాలం తామిద్దరం మాట్లాడుకోలేదని ఆయన తెలిపారు. అయితే ఏడు సంవత్సరాల తర్వాత తన భార్య నుండి విడాకులు తీసుకుంటున్న సమయంలో జూహీ నాకు ఫోన్ చేసి విడాకులు తీసుకోవద్దంటూ సూచించిందని చెప్పారు. తాను ఆమెతో మాట్లాడకున్నా కూడా నా జీవితం గురించి ఆలోచించి విడాకులు వద్దంటూ చెప్పిన జూహీ మంచి మనసును అర్థం చేసుకోలేకపోయానని అమీర్‌ఖాన్ అన్నారు. అప్పటి నుండి మళ్లీ ఆమెతో స్నేహంగా ఉన్నానని ఈ స్టార్ హీరో పేర్కొన్నారు.

బిగ్ మల్టీస్టారర్‌లో అలియాభట్?



టాలీవుడ్ బిగ్గెస్ట్ మల్టీస్టారర్ 'ఆర్ఆర్ఆర్' రెండో షెడ్యూల్ ఇటీవలే మొదలైన సంగతి తెలిసిందే. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటిస్తున్నారు. బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ 'బాహుబలి' తర్వాత రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. అయితే ఈ చిత్రంలో నటించే కథానాయికల ఎంపికలో దర్శకుడు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం రాజమౌళి ఇటీవల బాలీవుడ్ యంగ్ బ్యూటీ అలియాభట్‌ను కలిసారని తెలిసింది. గత ఏడాది 'రాజీ'లో భారతదేశ గూఢచారిగా అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న అలియా అయితేనే ఈ భారీ మల్టీస్టారర్‌కు ప్లస్ అవుతుందని జక్కన్న భావిస్తున్నారట. అయితే అలియాభట్ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది చూడాలి. ప్రస్తుతం హిందీలో ఈ యంగ్ బ్యూటీ రెండు మల్టీస్టారర్స్‌లో నటిస్తోంది. కలంక్, బ్రహ్మాస్త్ర చిత్రాల్లో ఆమె హీరోయిన్‌గా చేస్తోంది. ఇవేగాకుండా తన తండ్రి మహేష్‌భట్ తీయబోయే 'సడక్' సీక్వెల్‌లో కూడా నటించేందుకు అలియాభట్ ఒప్పుకుందట. ఈ నేపథ్యంలో ఈ బ్యూటీ నిర్ణయానికి కొంత సమయం పట్టవచ్చు. పనిలో పనిగా రెండో ఛాయిస్‌గా రాజమౌళి మరో బాలీవుడ్ బ్యూటీ పరిణితి చోప్రాతో కూడా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

అదృష్టం కలిసివస్తోంది



హిట్ మూవీ 'ఆర్ఎక్స్ 100'తో కుర్రకారును మైమరపించిన హాట్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్‌కు ఇప్పుడు వరుసగా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇదివరకే రవితేజ సరసన 'డిస్కోరాజా'లో హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. తేజ దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ పోషిస్తున్న 'సీత' చిత్రంలో స్పెషల్ సాంగ్ చేస్తోంది. తెలుగులోనే కాదు ఇతర భాషల నుండి కూడా వస్తున్న అవకాశాలను పాయల్ అందిపుచ్చుకుంటోంది. తమిళంలో ఆమె ఓ సినిమాకు సైన్ చేసింది. ఇక కొత్తగా వస్తున్న అవకాశాలకు డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోతోందట. అందంతో పాటు అభినయంలోనూ టాప్ అని తొలి సినిమాతోనే నిరూపించుకుంది ఈ భామ. ఇక ఆమెకు అదృష్టం కూడా కలిసి వస్తుండడంతో వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ఇక రవితేజకు జోడీగా నటిస్తున్న 'డిస్కో రాజా' హిట్ అయితే పాయల్‌కు తిరుగుండదు.


పాయల్ రాజ్‌పుత్



తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా, శివగణేష్, అనిల్, శ్రీకాంత్ తదితరులు

యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్

బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహా ఫిలిమ్స్, దీపాల ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సకల కళావల్లభుడు'. తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి శివగణేష్ దర్శకుడు. ఈ చిత్రం ఫిబ్రవరి 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాతలు అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ ''యాక్షన్, కామెడీలతో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతోంది ఈ చిత్రం. ఈ చిత్రానికి హీరో పర్‌ఫార్మెన్స్, కథ, కథనాలు హైలైట్‌గా నిలవనున్నాయి. హీరో తనిష్క్ రెడ్డి భవిష్యత్తులో బిగ్ స్టార్ అవుతాడు''అని అన్నారు. చిత్ర దర్శకుడు శివ గణేష్ మాట్లాడుతూ ''సినిమా చాలా బాగొచ్చింది. నిర్మాతల సపోర్ట్ లేకపోతే ఇంత బాగా వచ్చేది కాదు. హీరో తనిష్క్ రెడ్డి అద్భుతంగా నటించాడు''అని అన్నారు. హీరో తనిష్క్ రెడ్డి మాట్లాడుతూ ''దర్శకుడు శివ సినిమాను చక్కగా తెరకెక్కించారు. ఫిబ్రవరి 1న 100 థియేటర్లలో సినిమా విడుదల కానుంది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజేంద్ర కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ పట్నాయక్, నటి అలెక్సా పాల్గొన్నారు.




34 వేలు దాటిన బంగారం ధర

ముంబై: బంగారం ధర పరుగులు పెడుతోంది. బుధవారం పది గ్రాముల పసిడి ధర రూ.34 వేలను దాటింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలతో కొద్ది రోజులుగా పసిడి ధర పెరుగుతూ వస్తోంది. బుధవారం ఒక్కరోజే రూ. 320 పెరగడంతో బంగారం ధర రూ. 34,070కు చేరింది. మరోవైపు వెండి ధర కూడా బంగారం బాటలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు డిమాండ్ ఊపందుకోవడంతో కిలో వెండి ధర రూ. 330 పెరిగి రూ. 41,330కి చేరింది. గత రెండు రోజుల్లో బంగారం ధర రూ. 450, మొత్తం వారంలో ధర రూ. 770 పెరిగింది. అంతర్జాతీయంగా కూడా ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 1,314.76 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.96 డాలర్లకు చేరింది. అమెరికా–చైనా మధ్య జరిగే వాణిజ్య చర్చలపై అనిశ్చితి ఏర్పడింది. ఈ పరిణామాలపై దృష్టిపెట్టిన మదుపర్లు బంగారంలో పెట్టుబడులు పెట్టడమే శ్రేయస్కరమని భావించారని, తద్వారా పసిడి ధర పెరిగినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35,591.25	-1.25	(-0.00%)
నిఫ్టీ	10,651.80	-0.40	(-0.00%)



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.34
యూరో	81.60
బ్రిటిష్ పౌండ్	93.42
ఆస్ట్రేలియన్ డాలర్	51.32
కెనెడియన్ డాలర్	53.79
సింగపూర్ డాలర్	52.80
స్విస్ ఫ్రాంక్	71.68
చైనీస్ యువాన్	10.63
మలేషియన్ రింగిట్	17.37
న్యూజిలాండ్ డాలర్	48.82
హాంకాంగ్ డాలర్	9.10
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	235.32
సౌతాఫ్రికన్ రాండ్	5.25

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31680	33882.35	1.08%
ముంబై	32140	34374.33	1.32%
ఢిల్లీ	32350	34598.93	1.09%
కోల్‌కతా	32650	34919.79	0.86%
కేరళ	30750	32887.70	0.82%
బెంగళూరు	31150	33315.51	1.14%
హైదరాబాద్	31680	33882.35	1.08%
గల్ఫ్	139.78	149.50	0.84%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42241.00
ముంబై	₹ 42241.00
ఢిల్లీ	₹ 42241.00
కోల్‌కతా	₹ 42241.00
హైదరాబాద్	₹ 42241.00



కొచ్చర్ నిబంధనలను ఉల్లంఘించారు



- ఐసిఐసిఐ బ్యాంక్‌కు సమర్పించిన నివేదికలో శ్రీకృష్ణ ప్యానెల్ వెల్లడి

ముంబై : ఐసిఐసిఐ బ్యాంక్ – వీడియోకాన్ రుణం మంజూరు కేసుపై దర్యాప్తు చేపట్టిన శ్రీకృష్ణ కమిటీ బ్యాంక్‌కు నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్ బ్యాంక్ నిబంధనలను ఉల్లంఘించారని స్పష్టం చేసింది. వివాదం పరిష్కారానికి కొచ్చర్ ప్రయత్నించలేదని పేర్కొంది. అయితే ఈ మేరకు ఆమెను దోషిగా నిర్ధారిస్తూ బ్యాంకు ఒక ప్రకటన జారీ చేసింది. ఈ ఆరోపణల కారణంగా బ్యాంకు నుంచి ఆమెను తొలగించినట్టు బోర్డు ప్రకటించడం విశేషం. ఆమెకు సంబంధించిన చెల్లింపులను నిలిపివేస్తున్నామని, కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. అంతేకాదు 2009 ఏప్రిల్ నుంచి 2018 మార్చివరకు ఆమెకు చెల్లించిన బోనస్, ఇంక్రిమెంట్లు, మెడికల్ ఇన్సూరెన్స్ సహా ఇతర చెల్లింపులను బ్యాంకునకు వెనక్కి చెల్లించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బిఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ.. వీడియోకాన్ రుణ కేసులో క్విడ్‌ప్రోకో ఆరోపణలపై విచారణ జరిపింది. వీడియోకాన్ సంస్థకు రుణాల కేటాయింపు సందర్భంగా చందాకొచర్ బ్యాంకు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు పేర్కొంది. రూ.3250కోట్ల కుంభకోణంలో చందా కొచర్‌తోపాటు, ఆమె భర్త దీపక్ కొచర్, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్‌లపై సిబిఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైన సంగతి తెలిసిందే. బుధవారం నాడు శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ ఐసిఐసిఐ బ్యాంకుకు నివేదికను సమర్పించింది. వాస్తవానికి శ్రీకృష్ణ కమిటీ నవంబర్‌లోనే నివేదికను సమర్పించాల్సి ఉంది. అయితే కేసులోని సంక్లిష్టతల దృష్ట్యా నివేదిక ఆలస్యమైంది. ఐసిఐసిఐ బ్యాంక్, కొచ్చర్‌లు నిబంధనలను ఉల్లంఘించడంపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కూడా తాజా నివేదికను పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది.

2.7 శాతం తగ్గిన లాభం

క్యూ3లో ఐసిఐసిఐ బ్యాంక్ నికర లాభం రూ.1604 కోట్లు



దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంక్ మూడో త్రైమాసిక ఫలితాల్లో నికర లాభం 2.7 శాతం క్షీణించింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్) నికర లాభం రూ.1604కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో బ్యాంక్ నికర లాభం రూ.1,650 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.16,832 కోట్ల నుంచి రూ. 20,163 కోట్లకు పెరిగింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 21 శాతం పెరిగి రూ. 6,875 కోట్లుగా నిలిచింది. వడ్డీయేతర ఆదాయం సైతం రూ.3,404 కోట్లుగా నిలిచింది. గత ఏడాది ఇదే సమయంలో రూ.3,101 కోట్లుగా ఉంది. కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు 15 శాతం పెరిగి రూ.2.99 లక్షల కోట్లుగా నమోదైనాయి. కాగా బ్యాంక్ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. అలాగే స్థూల, నికర ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) నిష్పత్తి కూడా తగ్గుముఖం పట్టింది. నికర ఎన్‌పిఎ నిష్పత్తి 2.58 శాతానికి తగ్గుముఖం పట్టింది. అలాగే ఈ ఏడాది క్యూ2లో నికర ఎన్‌పిఎ నిష్పత్తి 3.65 శాతంగా నిలిచింది. గత 12 త్రైమాసికాల్లో ఇదే అత్యల్పం, గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికర ఎన్‌పిఎ నిష్పత్తి 4.2 శాతంగా ఉంది. స్థూల ఎపిఎ నిష్పత్తి సైతం 7.75 శాతానికి పతనమవగా, గత డిసెంబర్‌లో 7.82 శాతంగా ఉంది. స్థూల ఎన్‌పిఎ మొత్తం రూ.2091 కోట్లకు తగ్గింది. ఫలితాల నేపథ్యంలో షేరు విలువ 6 శాతం లాభపడిన రూ.368 వద్ద ముగిసింది.

పిఎన్‌బి శాఖల్లో ఉచిత హెల్త్ చెకప్

- హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన సర్కిల్ హెడ్ రాధికా భాటావాడేకర్



మన తెలంగాణ/ హైదరాబాద్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) 125వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బ్యాంకింగ్ యేతర ప్రాంతాల్లోనూ మెరుగైన సమాజం కోసం కార్యక్రమాలను నిర్వహించతలపెట్టింది. దీనిలో భాగంగా అపోలో హాస్పిటల్స్ సహకారంతో ఎంపిక చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌లలో ఉచిత హెల్త్ చెకప్‌లు చేపట్టింది. సైఫాబాద్ వద్ద తొలి ఉచిత హెల్త్ చెకప్‌ను నిర్వహించింది. సర్కిల్ హెడ్ రాధికా భాటావాడేకర్ ఈ హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజం అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బ్యాంకు యోచిస్తోందని తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో సైఫాబాద్ బ్రాంచ్ డిప్యూటీ సర్కిల్ హెడ్ డి.ఎన్.అంబేడ్కర్, చీఫ్ మేనేజర్ టి.శిరీష, ఇతర బ్యాంకు సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు. సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా బ్యాంక్ వరంగల్ జిల్లాలోని 'మేడిపల్లి' గ్రామాన్ని దత్తత తీసుకుని, పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.

బజాజ్ ఆటో లాభం 16% జంప్




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) మూడో త్రైమాసికంలో దేశీయ వాహనాల తయారీ దిగ్గజం బజాజ్ ఆటో మంచి లాభాలను నమోదు చేసింది. సంస్థ నికర లాభం అంచనాలను అధిగమించినా స్టాక్ మార్కెట్లో మాత్రం షేరు డీలా పడింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో నికర లాభం 16 శాతం పెరిగి రూ. 1,102 కోట్లను నమోదు చేసింది. సేల్స్ వాల్యూమ్ 26 శాతం పెరిగింది. దీంతో మొత్తం ఆదాయం కూడా 16 శాతం పెరిగి రూ. 7409 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 1246 కోట్లకు చేరగా, ఇతర ఆదాయం రూ.209 కోట్ల నుంచి రూ.470 కోట్లకు ఎగసింది. మార్జిన్లు 19.5 శాతం నుంచి 15.6 శాతానికి బలహీనపడ్డాయి. మార్జిన్లు క్షీణించడంతో ఈ కౌంటర్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు ఎన్ఎస్ఇలో 2.95 శాతం నష్టపోయి రూ.2,492 వద్ద ముగిసింది.

ఎక్కడి సూచీలు అక్కడే..

తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య స్వల్ప నష్టాలు

ముంబై : తీవ్ర ఒడిదుడుకులకు లోనయిన స్టాక్ మార్కెట్లు ఆఖరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1 పాయింటు నష్టపోయి 35,591వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 0.4 పాయింట్లు నష్టపోయి 10,651 వద్ద స్థిరపడింది. ఐసిఐసిఐ బ్యాంక్ షేరు 5.3శాతం , టాటా స్టీల్ షేర్ 5.14శాతం లాభపడ్డాయి. బజాజ్ ఆటో, కొటక్ మహీంద్రా షేర్లు 2.5 శాతానికి పైగా నష్టపోయాయి. డిహెచ్ఎఫ్ఎల్ షేర్లు భారీగా 10 శాతం నష్టపోయాయి. అమెరికా–చైనా మధ్య జరుగుతున్న చర్చలపై నెలకొన్న ఆందోళనలు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి.

ఐఫోన్ ధరలు తగ్గించనున్న యాపిల్



న్యూయార్క్: ఐఫోన్ సేల్స్ పడిపోవడంతో యాపిల్ కంపెనీ కొన్ని దేశాల్లో ధరలను తగ్గించనున్నట్టు కంపెనీ సిఇఒ టిమ్ కుక్ సంకేతాలిచ్చారు. మొదటి త్రైమాసికంలో ఐఫోన్ సేల్స్ 15 శాతం పడిపోయాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఐఫోన్ విక్రయాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే భారత్ పేరును నేరుగా ప్రస్తావించకకుండా టిమ్ కుక్ కొన్ని విషయాలను వెల్లడించారు. డాలర్ విలువ, బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ వంటి కారణాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ విక్రయాలు పెరగట్లేదని కుక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ ఆదాయం 15 శాతం తగ్గింది. దీనికి అనేక కారణాలున్నాయి. అందులో ఒకటి అమెరికా డాలర్ విలువ బలపడుతుండటం, అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ విలువ పెరగడంతో మా ఉత్పత్తుల ధర పెరుగుతోంది. దీనివల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కస్టమర్లు ఐఫోన్లు కొనేందుకు ఆసక్తి చూపించట్లేదని కుక్ అన్నారు. ఇక తమ కంపెనీ అందిస్తున్న బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా విక్రయాలు తగ్గడానికి ఒక కారణమని ఆయన అంటున్నారు. లక్షల మంది కస్టమర్లకు బ్యాటరీలను ఉచితంగా రీప్లేస్ చేస్తున్నామని, దీంతో కస్టమర్లు పాత ఐఫోన్లను ఎక్కువ కాలం వాడుతున్నారని కుక్ వివరించారు. తగ్గుతున్న విక్రయాలపై చర్యలు చేపట్టామని, చైనాలో ఐఫోన్ ధరలు తగ్గించామని, భారత్‌లోనూ ఇదే నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నామని అన్నారు.


ఆర్‌బిఐ తర్వాత సెబీ అధికారాలకు కత్తెర!



న్యూఢిల్లీ : ఇప్పటికే ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) అధికారాలకు కళ్లెం వేసిన ప్రభుత్వం కన్ను మరో స్వతంత్ర సంస్థపై పడింది. ఇకపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) ఏమైనా నిర్ణయాలు తీసుకుంటే ముందుగా స్వతంత్ర కమిటీకి నివేదించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సెబీకి సూచించినట్టు సమాచారం. ఈమేరకు ఓ వార్త సంస్థ కథనాన్ని వెల్లడించింది. సెబీ అధికారాలకు ప్రభుత్వం కత్తెర వేసేందుకు వ్యూహాన్ని సిద్ధం చేస్తోందని ఆ కథనం సారాంశంగా ఉంది. ఇప్పటికే ప్రభుత్వం ఆర్‌బిఐ అధికారాలను తగ్గించింది. తాజాగా సెబీ ఏవైనా నిర్ణయాలు తీసుకొనే ముందు ఆ ప్రతిపాదనలను ఒక స్వతంత్ర కమిటీకి నివేదించాలని ప్రభుత్వం సూచించిందని తెలుస్తోంది. ఈ కమిటీలో సభ్యులుగా బోర్డు డైరెక్టర్లు ఉంటారా? బయట వ్యక్తులు ఉంటారా? అనే విషయంపై ఇంకా స్పష్టతరాలేదు. ఒక వేళ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ఈ కమిటీ సభ్యులను నియమిస్తే ప్రభుత్వానికి సెబీపై మరింత పట్టు లభిస్తుంది. సెబీ నిబంధనలను ఆమోదించే ముందు ఆ ప్రతిపాదనలను ఒక కమిటీ ఎదుట ఉంచాలని ఆర్థిక వ్యవహారాల విభాగం సూచించినట్లు తెలుస్తోంది. దీనికి భవిష్యత్తులో సెబీ చట్టానికి సవరణ కూడా చేయాల్సి రావచ్చు. దాదాపు 25 ఏళ్ల నుంచి సెబీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే ఈ కొత్త మార్పు వల్ల సెబీ నిర్ణయాలకు జవాబుదారీ బాధ్యతలు కూడా పెరుగుతాయి. సెబీ కొన్నేళ్లుగా అమల్లోకి తెచ్చిన నియమ నిబంధనల్లో ఒక్కదానిని కూడా పార్లమెంట్ మార్చలేదు.

పూర్తిస్థాయి బడ్జెట్ కావాలి

- 66 శాతం మంది పౌరుల ఆకాంక్ష
- 77 శాతం మంది పన్నుల్లో మార్పులను కోరారు
- సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: బడ్జెట్‌పై వెల్లువెత్తుతున్న ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ఓ స్పష్టతనిచ్చారు. ఇది మధ్యంత బడ్జెటేనని స్పష్టం చేశారు. ఇంతకుముందు మోడీ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని, లేదు మధ్యంతర బడ్జెటేనని ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే కొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా వంటి ప్రముఖులు విమర్శలు చేశారు. అయితే ప్రజలు ఏమనుకుంటున్నారు. బడ్జెట్ 2019పై వారి అభిప్రాయం ఎలా ఉందనే విషయమై చేపట్టిన సర్వేలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బడ్జెట్ విషయంలో భారతీయుల్లో అత్యధిక మంది అభిప్రాయం పూర్తి స్థాయి బడ్జెట్ కావాలనే ఉంది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. మధ్యంతర బడ్జెట్ బదులు వ్యవసాయం, పర్యావరణం, మధ్య తరగతి వర్గాలకు మేలు చేసే వాటిపై దృష్టి సారించేలా పూర్తి స్థాయి బడ్జెట్ ఉంటేనే ఎంతో మేలని 66 శాతం మంది పౌరులు అభిప్రాయపడుతున్నారు. వివాదాస్పదమైన 'ఏంజెల్ ట్యాక్స్'ను రద్దు చేయాలని 77 శాతం మంది కోరుతున్నారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో పన్నులకు సంబంధించిన నిర్ణయాలు ఉండాలని 64 శాతం మంది, వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని 43 శాతం, మౌలిక సదుపాయాలకు 23 శాతం పౌరులు కోరుతున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపైనే ఈమధ్యంతర బడ్జెట్–2019లో ఎక్కువగా దృష్టి పెట్టాలని 43 శాతం ప్రజలు కోరుతున్నారు. రైల్వేలో శుభ్రత, భద్రత, ఉత్తమ సేవలు, సమయ పాలన వంటివి ఉండాలని చాలా వరకు పౌరులు భావిస్తున్నారు. వేగవంతమైన వృద్ధి కోసం ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని 35 శాతం ప్రజ లు కోరుకుంచున్నారు. అలాగే అంకుర సంస్థలను గుర్తించి, వాటికి పన్నుల విషయంలో ప్రోత్సాహకాలు అందివ్వాలని 73 శాతం పౌరులు కోరుకుంటున్నారు. ఇంకా ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభు త్వం అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, ప్రభుత్వ–ప్రైవేటు ఆసుపత్రులు మెరుగైన పర్యవేక్షణ, బాధ్యతను కల్గివుండేలా పెట్టుబడులను పెంచాలని 43 శాతం పౌరులు కోరుకుంటున్నారు. తొలిసారి గృహ కొనుగోలుదారులకు వడ్డీ రేటులో తగ్గింపునివ్వాలని 31 శాతం ప్రజలు భావిస్తున్నారు. దాదాపు 200 జిల్లాల నుంచి లక్షమంది తమ అభిప్రాయాన్ని ఈ సర్వేలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రుణమాఫీ చేయొద్దని 71శాతం చెప్పారు. ఇది ఓట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



చివరి రోజు స్పైడర్‌మ్యాన్ డ్రెస్‌లో...

సావో పాలో: ఉద్యోగం మానేసే చివరి రోజు ఓ ఉద్యోగి తోటి ఉద్యోగులతో జాలీగా గడిపాడు. బ్రెజిల్‌లోని సావోపాలోలో ఓ బ్యాంక్ ఉద్యోగి చివరి రోజు వినూత్నంగా స్పైడర్ మ్యాన్ డ్రెస్ వేసుకొని బ్యాంక్‌కు వచ్చాడు. దీనికి సంబంధించిన విడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. అదే డ్రెస్‌లో పని చేస్తూ, సహచర ఉద్యోగులతో మాట్లాడుతూ, డెస్క్‌పై పడుకుంటూ ఇలా చిత్ర విచిత్ర విన్యాసాలన్నీ చేశాడు. తనతోపాటు బ్యాంక్‌లో ఉన్న ఉద్యోగులందరినీ అతడు ఉత్సాహ్రిపచాడు. అతడు స్పైడర్ మ్యాన్ డ్రెస్‌లో బ్యాంక్‌లో సందడి చేస్తున్న వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇప్పటికే ఈ వీడియోను లక్షల మంది చూశారు.

ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ ప్రధాని భారత్ రాక

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫిబ్రవరి 11న భారత్‌లో పర్యటించనున్నారు. తన ఒక్క రోజు పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీతో చర్చలు జరపనున్నారు. ఒకే ఏడాదిలో ఆయన రెండోసారి న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. నెతన్యాహు పర్యటనకు ప్రధాని మోడీ ఆమోదించారని, ఇతర అంశాలకు సంబంధించి కార్యాచరణను రూపొందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో ఇరు దేశాల భద్రతా సలహాదారులు ఫోన్‌లో సంభాషించారు. ఇజ్రాయెల్‌లో ఏప్రిల్ 9న జరగనున్న నెస్సెట్ (పార్లమెంట్) ఎన్నికలకు ముందు ఆయన భారత్‌లో పర్యటించబోతున్నారు. గ్లోబల్ కమ్యూనిటీలో తమను వేరు చేయలేదని, ఎన్నో దేశాలు తమతో కలిసి పని చేస్తున్నాయని అక్కడి ప్రజలు విశ్వసించేందుకు ఆయ యత్నిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

పెయింటిగ్‌లకు డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలి: మమతా

బీర్భం (పశ్చిమబెంగాల్): ప్రధాని నరేంద్ర మోడీకి దమ్ముంటే తాను పెయింటింగులు విక్రయించి డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సవాల్ చేశారు. చిట్ ఫండ్ యజమానులు తన పెయింటింగ్‌లను కోట్లాది రూపాయలకు కొనుగోలు చేసినట్లు బిజెపి అధ్యక్షుడు అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించడంపై ఆమె ఘాటుగా స్పందించారు. బుధవారం బీర్భంలో జరిగిన సమావేశంలో మమతా మాట్లాడుతూ బిజెపి నేతలకు మర్యాద లేదని, నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై తమ పార్టీ పరువు నష్టం కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. తాను పెయింటింగ్‌లు విక్రయించి తాను ఒక్క పైసా తీసుకున్నట్లు నిరూపించగలరా అంటూ ఆమె మోడీకి సవాల్ విసిరారు. ఎటువంటి మర్యాద లేకుండా ఆటవికుని మాదిరిగా ఆయన ప్రవర్తించారని మమతా విమర్శించారు.

అసోం సర్కార్‌కు స్వెటర్ సెగ

- సిఎం సభకు నల్ల స్వెటర్ ధరించి వచ్చిన బాలుడు
- బలవంతంగా విడిపించిన పోలీసులు
- వీడియో నెట్‌లో వైరల్



దిస్పూర్ : అసోం ముఖ్యమంత్రి శర్బానంద సొనోవాల్ సభ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదమవుతోంది. మంగళవారం నాడు సిఎం నిర్వహించిన ఓ బహిరంగ సభకు నల్ల చొక్కాలు వేసుకురావద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. కానీ ఓ తల్లి తన మూడేళ్ల చిన్నారికి నల్లరంగు స్వెటర్ వేసి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు ఆ స్వెటర్ విప్పేయాలని తల్లిని ఆదేశించారు. దీంతో ఆమె తన కుమారుడి స్వెటర్‌ను తప్పనిపరిస్థితిలో నడిరోడ్డుపై విప్పేసింది. ఇందుకు సంబంధించిన విడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ ఘటన బిశ్వనాథ్ జిల్లాలో చోటు చేసుకుంది. స్థానిక టీవీ ఛానళ్లలోనూ ఈ విడియో ప్రసారమైంది. ముఖ్యమంత్రి ముందు నిరసన తెలుపుతాడని ఇలా చిన్న పిల్లాడి స్వెటర్‌ను బలవంతంగా విప్పేస్తారా? అంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. తన స్వెటర్ విప్పేయడంతో ఆ చిన్నారి భయపడిపోయి బిగ్గరగా ఏడ్చేశాడు. స్వెటర్ తీసేయకపోతే నాతో పాటు నా చిన్నారిని కూడా సభకు రానివ్వబోమని పోలీసులు చెప్పారని, దాంతో ఇంతదూరం వచ్చి సభకు హాజరుకాకపోతే ఎలా అని స్వెటర్ తీసేశానని ఆ బాలుడి తల్లి మీడియాతో పేర్కొంది. తన కుమారుడికి చలి వేయకుండా ఉండేందుకే స్వెటర్ వేశారని, మరో ఉద్దేశం తమకు లేదని పేర్కొంది. ఇదిలావుండగా చిన్నారి స్వెటర్ విప్పేసిన ఘటన మీడియాతో పాటు సోషల్ మీడియా పెద్ద ఎత్తున వైరల్ కావడంతో సిఎం సోనోవాల్ స్పందించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించారు. ఈశాన్య రాష్ట్రాల్లో పౌర బిల్లుపై నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నల్లజెండాల ప్రదర్శనపై అసోం ప్రభుత్వం ఒకింత కఠినంగా వ్యవహరిస్తోంది.

కేంద్రంలో హంగ్ తప్పదు

ఎపిలో జగన్ హవా • యు పీలో ఎస్‌పి, బిఎస్‌పి ప్రభంజనం
ఈశాన్యంలో బిజెపి ప్రాబల్యం • టైమ్స్ నౌ – విఎంఆర్ సర్వే



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలలో హంగ్ తప్పదని ది టైమ్స్ నౌ – విఎంఆర్ ఒపినీయన్ సర్వేలో వెల్లడైంది 545 సభ్యుల లోక్‌సభలో. బిజెపి నాయకత్వపు ఎన్‌డిఎకు 252, కాంగ్రెస్ నాయకత్వపు యుపిఎకు 147 స్థానాలు వస్తాయని, ఇతరులకు 144 స్థానాలు రావచ్చునని అధ్యయనంలో వెల్లడైంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే పరిస్థితి ఏమిటనేదానిపై జనం నాడి గురించి జనవరిలోనే సర్వే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 25 స్థానాలలో వైఎస్ జగన్ పార్టీకి 23 స్థానాలు వచ్చి, కేంద్రంలో ప్రభుత్వ స్థాపనలలో కీలకమైన కింగ్ మేకర్ అవుతారని సర్వేలో వెల్లడైంది. ఇక విడిగా చూస్తే బిజెపికి ఇంతకు ముందు 282 స్థానాలు ఉండగా, ఇప్పుడు 215 స్థానాలు వస్తాయి.
కాంగ్రెస్‌కు ఇంతకు ముందు విడిగా 44 ఉండగా ఇప్పుడు ఇది 96 స్థానాలకు చేరుతుందని వెల్లడైంది. అన్నింటికీ మించి ఈసారి కేంద్రంలో రాబోయే ప్రభుత్వాన్ని ఖరారు చేసే విధంగా ఉత్తరప్రదేశ్‌లో ఫలితాలు ఉంటాయని వెల్లడైంది. ఇక్కడ ఎస్‌పి– బిఎస్‌పి కూటమి మొత్తం 80 స్థానాలలో 51 స్థానాలను అంతకు మించి గెల్చుకుంటుందని, ఈ కూటమి మద్దతు కూడా కీలకం అవుతుందని వెల్లడైంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో బిజెపి బలం పెద్దగా తగ్గదని సర్వేలో వెల్లడైంది. తమిళనాడు, కేరళలో బిజెపి ఖాతా తెరచుకోదని సర్వేలో స్పష్టం అయింది. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సీట్లు పెరుగుతాయి. వామపక్ష కూటమికి ఒక్క సీటూ రాదని తేల్చారు. టైమ్స్ నౌ– విఎంఆర్ జనం నాడిని అధ్యయనం చేసి, బుధవారం తమ ఒపినీయన్ పోల్ ఫలితాలను వెలువరించింది. రాజకీయ కూటముల విజయావకాశాలపై విశ్లేషణలను తెలిపింది. ప్రధాని పదవికి ఎవరు అర్హులు? అనే అంశంపై కూడా సర్వే జరిపారు. వివిధ రాష్ట్రాలలో పార్టీల విజయావకాశాలను తెలిపారు.

ఉత్తరప్రదేశ్ : 80 స్థానాలు

అత్యధిక స్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌డిఎకు భారీ స్థాయిలో ఎదురుదెబ్బ తప్పదని సర్వేలో వెల్లడైంది. మొత్తం 80 స్థానాలలో ఎన్‌డిఎ ఈసారి కేవలం 27 స్థానాలకే పరిమితం అవుతుందని వెల్లడించారు. ఇప్పటి వరకూ ఎన్‌డిఎకు ఇక్కడ 73 ఎంపి సీట్లు వచ్చాయి. ఇక ఈసారి బిజెపి ఓట్ల శాతం 4.4 శాతానికి పడిపోతుంది. ఇక ఎస్‌పి– బిఎస్‌పి తాజా కూటమి ఈ లోక్‌సభ ఎన్నికలలో అత్యధిక స్థానాలను దక్కించుకుంటుంది. ఈ కూటమికి 51 స్థానాల వరకూ రావచ్చు. కాంగ్రెస్‌కు కేవలం రెండు సీట్లే వస్తాయని విశ్లేషణలో వెల్లడైంది.

తమిళనాడు : 39 స్థానాలు

కాంగ్రెస్ నాయకత్వపు యుపిఎకు అత్యధిక స్థానాలు వస్తాయి. మొత్తం 39 స్థానాలలో ఈ కూటమి 35 సీట్లను గెల్చుకోవచ్చు. అధికార అన్నాడిఎంకె నాలుగు సీట్లలో విజయం సాధిస్తుంది. బిజెపి నాయకత్వపు ఎన్‌డిఎ ఇక్కడ ఒక్క స్థానం దక్కించుకోదు.

మధ్యప్రదేశ్ : 29

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి మునుపటితో పోలిస్తే నాలుగు స్థానాలు తగ్గుతాయి. జనం ప్రస్తుత నాడి ప్రకారం బిజెపికి 23, కాంగ్రెస్‌కు 6 స్థానాలు వస్తాయి. అసెంబ్లీ ఎన్నికలలో విజయం ప్రభావాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోలేకపోతుందని వెల్లడించారు. గత ఎన్నికలలో బిజెపికి 27, కాంగ్రెస్‌కు 2 సీట్లు వచ్చాయి.

రాజస్థాన్ 25

ఎన్‌డిఎకు లోక్‌సభ ఎన్నికలలో ఈ రాష్ట్రంలో షాక్ తప్పదని వెల్లడైంది. గత లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి మొత్తం పాతిక సీట్లు వచ్చాయి. అయితే ఈసారి బిజెపి ఎనిమిది స్థానాలను పోగొట్టుకుంటుందని, ఈ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఈ సర్వేలో వెల్లడైంది.

గుయిడో... దేశం వదలొద్దు

వెనెజువెలా న్యాయస్థానం ఆంక్షలు • జడ్జిలకు అమెరికా హెచ్చరికలు
మదురోపై ట్రంప్ నిప్పులు

కరకస్ : వెనెజువెలాలో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. స్వయం ప్రకటిత దేశాధ్యక్షులు జువాన్ గుయిడోకు వ్యతిరేకంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ట్రిబ్యునల్ ఆఫ్ జస్టిస్ ఆంక్షలు విధించింది. ఆయన దేశం విడిచి పెట్టి వెళ్లరాదని పేర్కొంది. అంతేకాకుండా ఆయన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. అమెరికా మద్ధతుతో గుయిడో అధికారం చలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన చర్యలను అడ్డుకోవాలని ఇప్పటివరకూ దేశాధ్యక్షుడిగా ఉన్న నికోలాస్ మదురో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనితో 35 ఏండ్ల గుయిడోపై ప్రాథమిక దర్యాప్తు పూర్తి అయ్యేవరకూ దేశం విడిచి పెట్టి వెళ్లరాదని ఆదేశాలు వెలువరించారు. ఈ రిపబ్లిక్ దేశంలో శాంతిని దెబ్బతీసినందుకు ఆయన కదలికలపై ఆంక్షలు విధిస్తున్నట్లు, బ్యాంకు ఖాతాలను స్తంభింపచేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది. ఈ కీలక విచారణ దశలో న్యాయస్థానం మదురో మద్దతుదార్లతో నిండిపోయింది. గుయిడో ఇప్పుడు నేషనల్ అసెంబ్లీ లెజిస్లేచర్‌గా ఉన్నారు. తనను తాను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. వెనెజువెలాలోని అమెరికా బ్యాంకు ఖాతాలను గుయిడో తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. దీనికి సంబంధించి అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో గత వారం ఆదేశాలు వెలువరించారు. గుయిడోకు మద్దతుగా ఆయన ప్రభుత్వాన్ని స్థిరీకరించేందుకు అమెరికా అన్ని చర్యలూ తీసుకొంటోంది. ఇటీవలే అమెరికా వెనెజువెలాపై మరింత తీవ్రస్థాయిలో కొరడా ఝుళిపించారు. దేశ అధికారిక చమురు సంస్థపై ఆంక్షలు విధించారు. చమురు ఆధారిత ఆదాయంతో సాగే దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ ఆంక్షలు పిడుగుపాటుగా మారాయి. వెనెజువెలాలో గుయిడో నాయకత్వంలోని ప్రభుత్వాన్ని తాము అధికారికంగా గుర్తిస్తున్నట్లు, ఈ చట్టబద్ధ ప్రభుత్వానికే నిధులు చెందేలా చర్యలు తీసుకోనున్నట్లు అమెరికా అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ దశలో న్యాయస్థానం ఆదేశాలు వెలువడ్డాయి. వీటిపై గుయిడా పార్లమెంట్ ఆవరణలో స్పందించారు. సవాళ్లను తాను తోసిపుచ్చడం లేదని, తాము అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొంటామని , విధుల నిర్వహణలో కొనసాగుతున్నామని విలేకరులకు తెలిపారు. గుయిడోను వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు ప్రెసిడెంట్ ట్రంప్ దేశ అత్యున్నత న్యాయస్థానానికి సమాచారం పంపించారు. ఇంతకు ముందటి హయాం అంతిమదశలో ఉందని, దీనిని గుర్తుంచుకోవాలని, అరాచకవాదులు, వారి గ్యాంగ్ కోసం బలి కావద్దని ట్రంప్ ఈ వర్తమానంలో ఏకంగా జడ్జిలకే హెచ్చరికలు వెలువరించారు. ప్రతిపక్ష నేత ఇప్పుడు దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్న గుయిడోకు ఎటువంటి హానీ జరిగినా తీవ్ర పరిణామాలు తప్పవని వాషింగ్టన్‌లో జాతీయ భద్రతా సలహాదారు స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య విఘాతానికి యత్నించినా, గుయిడోకు ఇబ్బంది కల్గించినా పరిస్థితి విషమిస్తుందని అమెరికా ఘాటుగా స్పందించింది. ప్రతిపక్ష ఆధిక్యత ఉన్న లెజిస్లేచర్ ఈ లోగా అమెరికా వంటి పన్నెండు దేశాలకు దౌత్య స్థాయి గుర్తింపును ప్రకటించింది. ఇంతకు ముందటి వరకూ అనామకుడిగా ఉంటూ వచ్చిన గుయిడో ఇంజనీర్. జనవరి 3వ తేదీన ప్రతిపక్ష ఆధిక్యత ఉన్న లెజిస్లేచర్‌కు తానే నాయకుడిని అని ప్రకటించుకున్నారు.

ప్రతిపక్షంతో చర్చలు, ఎన్నికలు : మదురో

దేశ ప్రతిపక్షంతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెనెజువెలా నేత మదురో తెలిపారు. అమెరికా మద్దతు ఉన్న వారితో చర్చలు జరుపుతామని, దేశంలో సత్వర పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. దేశానికి మంచి జరగాల్సి ఉందని, ఇందుకు అంతా సహకరించాలని కోరారు. ప్రెసిడెంట్ ఎన్నికలు జరిగిపొయ్యాయని, సామ్రాజ్యవాదులు వీటి కోసం మరో నాలుగేళ్లు వేచి ఉండాల్సిందే అన్నారు.

రక్షణమంత్రికి తెలీకుండానే రాఫెల్‌లో మార్పులు

చౌకీదార్ మా కళ్లలోకి చూడలేరు • మోడీపై మరోసారి రాహుల్ రాఫెల్ తూటాలు






న్యూఢిల్లీ: రాఫెల్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోడీపై మరోసారి నిప్పులు చెరిగారు. పార్టీ నిర్వహించిన యువ క్రాంతి యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన ఇంక్విలాబ్ ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. తను మంగళవారం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌ను కలిశానని, రాఫెల్ ఒప్పందంలో మార్పులు చేసేటప్పుడు ప్రధానమంత్రి రక్షణమంత్రిని సంప్రదించలేదని ఆయన చెప్పారని రాహుల్ తెలిపారు. 'రాఫెల్ గురించి ప్రధాని మోడీని, రక్షణమంత్రిని మూడు నాలుగు ప్రశ్నలు అడిగాం. ఆయన జవాబివ్వలేకపోయారు. అటూ ఇటూ చూశారే తప్ప మా కళ్లలోకి చూడలేకపోయారు. అయితే రాఫెల్ ఫైటర్ జెట్ ఒప్పందంలో నిజం ఏనాటికైనా బయటపడుతుంది. ప్రభుత్వం నుంచే నిజం తెలుస్తుంది. మోడీ ప్రశాంతంగా నిద్రపోలేరు. నిద్రపోవాలనుకుంటే పీడకలలొస్తాయి. అనిల్ అంబానీ, రాఫెల్ ఫైటర్ జెట్, అమర వీరులు కనబడతారు' అని రాహుల్ విమర్శించారు. 'రాఫెల్ విమానం ధరను రూ.526 కోట్ల మేరకు తగ్గించేందుకు చర్చలు జరిపిన వారిని, రక్షణమంత్రిత్వశాఖను, జనరల్స్‌ను పక్కన పెట్టి మోడీ...ఖర్చు ఎక్కువయ్యే కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అలాచేసి అనిల్ అంబానీకి లాభం తెచ్చిపెట్టగలిగారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. రాఫెల్ ఫైల్‌లో ఏముందో తనకు తెలుసని, గోవా ముఖ్యమంత్రి పదవి నుంచి తనను ఎవరూ తప్పించలేరని మాజీ రక్షణమంత్రి పారికర్ ఒక కేబినెట్ సమావేశంలో ప్రస్తావించిన విషయాన్ని రాహుల్ గుర్తుచేశారు. 'పారికర్‌ను సంతోషపరచాలని ప్రధానమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఈ కేసును దర్యాప్తు చేయాలని సిబిఐ ప్రయత్నించినప్పుడు ... ఆ ప్రయత్నం జరగకుండా చూడమని అమిత్‌షాకు మోడీ చెప్పారు. రాత్రికి రాత్రే సిబిఐ చీఫ్‌ను మార్చేశారు' అని రాహుల్ ఘాటుగా విమర్శించారు.

పరామర్శకు వచ్చి రాజకీయమా?

రాహుల్ తీరుపై పారికర్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అనారోగ్యంతో ఉన్న ముఖ్యమంత్రిని పరామర్శించడాన్ని కూడా చౌకబారు రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం విచారకరమని గోవా సిఎం మనోహర్ పారికర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. అధికారిక లెటర్ హెడ్‌పై పారికర్ రాహుల్‌కు రెండు పేజీల ఉత్తరం రాశారు. ' కొన్ని సందర్భాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించే ఆరోగ్యకరమైన రాజకీయ సంప్రదాయం మన దేశంలో ఉంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేను మీ రాకను ఆ విధంగానే భావించాను. నన్ను చూడ్డానికి వచ్చిన మీ ఔదార్యాన్ని నేను అభినందిస్తున్నాను' అని పారికర్ తన లేఖలో రాశారు. అయితే లేఖలో ఆ తర్వాత పేరాలో పారికర్...రాహుల్ రాకపై మీడియాలో వచ్చిన వార్తల్ని ప్రస్తావిస్తూ అవి తనను బాధించాయన్నారు. రాఫెల్ జెట్‌కోసం చేసుకున్న నన్ను విస్మరించారని రాహుల్ చెప్పారని వార్తలు వచ్చాయి. నన్ను చూడ్డానికి రావడం కూడా రాజకీయం చేయడం బాధ కలిగించింది. మా మధ్య రాఫెల్ ప్రస్తావన రానేలేదు' అని ఆవేదన చెందారు.

'మహాగట్‌బంధన్' వస్తే రోజుకో ప్రధాని



కాన్పూర్ : ప్రతిపక్షాలతో ఏర్పడే 'మహాగట్ బంధన్' కూటమి తమ ప్రధాని అభ్యర్థిని ప్రకటించడం లేదని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్ షా బుధవారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకో ప్రధాని మారతారని ఎద్దేవా చేశారు. 'తమ ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో ప్రతిపక్షం ప్రకటించాలి' అని అమిత్ షా డిమాండ్ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆయన తమ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 'మహాగత్ బంధన్‌కు ఒక రూపం ఏర్పడితే సోమవారం మాయావతి, మంగళవారం అఖిలేష్ యాదవ్, బుధవారం మమతాబెనర్జీ, గురువారం శరద్‌పవార్, శుక్రవారం దేవెగౌడ, శనివారం స్టాలిన్ ప్రధానమంత్రులుగా ఉంటారు. ఆదివారం వారికి సెలవు రోజు' అని ఎగతాళి చేశారు. నాయకుడు లేకుండా వారు మార్పు తీసుకురావాలనుకుంటున్నారు. మేము అధికారంలోకి వస్తే బలమైన ప్రభుత్వం ఏర్పడుతుంది. వాళ్లు వస్తే బలహీనమైన ప్రభుత్వం వస్తుంది' అని అమిత్ షా విమర్శించారు.











మహాత్మాగాంధీ 71వ వర్ధంతి... జాతి నివాళి

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీ 71వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి రాజ్‌ఘాట్ వద్ద బుధవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఘనంగా పుష్పాంజలి ఘటించారు. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి హర్దీప్ సింగ్ మహాత్ముడికి అంజలి ఘటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్ వద్ద సర్వమత ప్రార్థనలు జరిగాయి. గాంధీకి ఎంతో ఇష్టమైన 'రఘుపతి రాఘవ రాజారాం' గీతాన్ని ఆలపించారు. బాపు పుణ్య తిథి సందర్భంగా మహాత్ముని గుర్తు చేసుకుంటూ మోడీ ట్వీట్ చేశా రు. ఆయన అడుగు జాడల్లో నడుస్తామని, ఆయన నెలకొల్పిన విలువలకు నిబద్ధతతో తామంతా కట్టుబడి ఉంటామని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రయోగాలకు వేళాయే..

జోరుమీదున్న టీమిండియా, రిజర్వ్ బెంచ్‌కు ఛాన్స్, పరువు కోసం కివీస్, నేడు నాలుగో వన్డే

హామిల్టన్: ఇప్పటికే సిరీస్ గెలిచిన టీమిండియా మిగిలిన రెండు వన్డేల్లో రిజర్వ్‌బెంచ్‌ను పరీక్షించాలని భావిస్తోంది. గురువారం భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య నాలుగో వన్డే జరుగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. కాగా, రెగ్యూలర్ కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతి కల్పించడంతో మిగిలిన రెండు వన్డేలకు రోహిత్ శర్మ సారథ్యం వహిస్తున్నాడు. రోహిత్ కెరీర్‌లో ఇది 200వ వన్డే కానుంది. ఇందులో గెలిచి అరుదైన జ్ఞాపకంగా మిగిల్చుకోవాలని రోహిత్ భావిస్తున్నాడు. జట్టు సభ్యులు కూడా మ్యాచ్‌లో విజయం సాధించి రోహిత్‌కు కానుకగా ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారు. మరోవైపు సొంత గడ్డపై పేలవమైన ఆటతో సిరీస్‌ను చేజార్చుకున్న ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు కనీసం మిగిలిన రెండు మ్యాచుల్లోనైనా గెలిచి కాస్తయినా పరువును కాపాడు కోవాలని భావిస్తోంది. ఇక, ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ చోటు కల్పించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గాయంతో కిందటి మ్యాచ్‌కు దూరమైన సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని కూడా ఈ మ్యాచ్‌లో ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఫాస్ట్ బౌలర్లలో షమీ, భువనేశ్వర్‌లలో ఒకరికి విశ్రాంతి ఇచ్చినా ఆశ్చర్యం లేదు. ఇదే జరిగితే ఖలీల్, సిరాజ్‌లలో ఎవరో ఒకరికి అవకాశం దక్కడం తథ్యం. ఇక, కుల్దీప్, చాహల్‌లలో ఇద్దరిని ఆడిస్తారా లేక ఒకరికే ఛాన్స్ ఇస్తారా అనేది తేలలేదు. మరోవైపు ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే కివీస్ గడ్డపై అతి పెద్ద విజయం భారత్‌కు దక్కుతోంది. ఇప్పటి వరకు టీమిండియా ఇక్కడ ఎప్పుడూ కూడా మూడు వన్డేలకు మించి విజయం సాధించలేదు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ ఖాతాలో అరుదైన రికార్డు చేరుతుంది.



శుభారంభం దక్కాలి..

సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లో తప్ప మిగిలిన రెండు వన్డేల్లోనూ శుభారంభం అందించిన ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లపైనే ఈసారి కూడా భారీ ఆశలు ఉన్నాయి. కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఓపెనర్ల పాత్ర మరింత కీలకంగా మారింది. కిందటి మ్యాచ్‌లో రోహిత్ అద్భుతంగా ఆడాడు. భారీ స్కోరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మూడో వన్డేలో ధావన్ విఫలమయ్యాడు. కానీ, ఈ మ్యాచ్‌లో మెరుపులు మెరిపించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్ విజృంభిస్తే కివీస్ బౌలర్లకు కష్టాలు ఖాయం.

అందరి కళ్లు రోహిత్‌పైనే..

ఇక, కెరీర్‌లో 200వ వన్డే మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మపై అందరి దృష్టి నిలిచింది. సిరీస్‌లో నిలకడైన ఆటతో ఆకట్టుకున్న రోహిత్ అరుదైన మ్యాచ్‌లో కూడా రాణించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించడం ద్వారా మరుపురాని జ్ఞాపకంగా ఉంచుకోవాలని భావిస్తున్నాడు. తన సుదీర్ఘ వన్డే కెరీర్‌లో ఎన్నో అరుదైన రికార్డులు బద్దలు కొట్టిన రోహిత్ ఈసారి కూడా చారిత్రక ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ చెలరేగితే భారత్‌కు విజయం నల్లేరుపై నడకే.

గిల్‌కు ఛాన్స్..

మరోవైపు యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు ఈ మ్యాచ్‌లో ఆడించడం ఖాయంగా కనిపిస్తోంది. న్యూజిలాండ్ గడ్డపై జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో ప్రకంపనలు సృష్టించిన గిల్ ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ వన్డే కెరీర్‌కు శ్రీకారం చుట్టడం ఖాయంగా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ కూడా గిల్‌కు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నాడు. విరాట్ కోహ్లి స్థానంలో గిల్‌ను ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కివీస్ పిచ్‌లపై మంచి అవగాహన ఉన్న గిల్ దాదాపు బరిలోకి దిగడం ఖాయమైనట్టే తెలుస్తోంది. ఇక, సీనియర్లు అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్‌లలో ఒకరికి విశ్రాంతి కల్పించే అవకాశాలున్నాయి. సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్‌కు ఈ మ్యాచ్‌లో కూడా విశ్రాంతి ఇస్తే కార్తీక్‌కు తుది జట్టులో చోటు లభిస్తోంది. కిందటి మ్యాచ్‌లో రాయుడు, కేదార్, కార్తీక్‌లు అద్భుతంగా ఆడిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ నిలకడైన ఆటతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో ఎవరికి జట్టులో చోటు కల్పించినా తమ పాత్రకు న్యాయం చేస్తున్నారు.

సీనియర్లకు విశ్రాంతి..!

మరోవైపు బౌలింగ్ విభాగంలో కూడా కొన్ని మార్పులు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. సీనియర్లు భువనేశ్వర్, షమీలుకు విశ్రాంతి ఇచ్చే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే ఖలీల్, సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నారు. హార్దిక్ పాండ్య మూడో సీమర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తాడు. స్పిన్ విభాగంలో కూడా చాహల్, కుల్దీప్‌లలో ఒకరిని పక్కన బెట్టడం ఖాయమనే చెప్పాలి. అదే జరిగితే రవీంద్ర జడేజా బరిలోకి దిగుతాడు. కానీ, దూకుడు మీదున్న వీరిని పక్కన బెట్టేందుకు జట్టు యాజమాన్యం ఇష్టపడుతుందా లేదా అనేది ఇంకా తేలలేదు.







ఈసారైనా..

ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు మిగిలిన రెండు వన్డేల్లో గెలిచి కాస్తయిన పరువను కాపాడు కోవాలని భావిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో కివీస్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కీలక ఆటగాళ్లలో ఒక్క రాస్ టైలర్ మాత్రమే మెరుగ్గా రాణిస్తున్నాడు. కెప్టెన్ విలియమ్సన్ కూడా బాగానే ఆడుతున్నాడు. అయితే స్టార్ ఆటగాళ్లు మన్రో, గుప్టిల్, లాథమ్, గ్రాండోమ్, నికోలస్ తదితరులు విఫలం కావడం కివీస్‌ను ఇబ్బందులకు గురి చేస్తోంది. చివరి రెండు వన్డేల కోసం కివీస్ కీలక మార్పులు చేసింది. నిషమ్, టాడ్ అస్ట్‌లేలను జట్టులోకి తీసుకుంది. కీలక బౌలర్ టిమ్ సౌథిని కూడా జట్టుకు ఎంపిక చేసింది. కాగా, నిలకడలేమి జట్టుకు ప్రధాన సమస్యగా మారింది. చివరి ఓవర్లలో కివీస్ వరుసగా వికెట్లను కోల్పోతోంది. ఇది జట్టుపై తీవ్ర ప్రభావనే చూపుతోంది. బౌలింగ్‌లో కూడా ఇలాంటి సమస్యే నెలకొంది. బౌలర్లు ధారళంగా పరుగులు ఇచ్చుకుంటున్నారు. మిగిలిన రెండు మ్యాచుల్లోనైనా బ్యాటింగ్, విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిస్తేనే కివీస్‌కు ఓదార్పు దక్కుతుందని చెప్పాలి.

మా టార్గెట్ వారిద్దరే

మిఛెల్ సాంట్నర్




హామిల్టన్: నాలుగో వన్డేలో భారత్‌ను ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ మిఛెల్ శాంట్నర్ అన్నాడు. విరాట్ కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో భారత్ కాస్త బలహీనంగా మారిందనడంలో సందేహం లేదన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో తమ దృష్టంతా కీలక ఆటగాళ్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలపైనే కేంద్రీకరిస్తున్నట్టు తెలిపాడు. వీరిద్దరిని టార్గెట్‌గా చేసుకుని బరిలోకి దిగుతున్నట్టు శాంట్నర్ స్పష్టం చేశాడు. సొంత గడ్డపై భారత్ చేతిలో ఓటమి ఎదురు అవుతుందని తాము ఊహించలేదన్నాడు. పోటీ నువ్వానేనా అన్నట్టు సాగుతుందని భావించామన్నాడు. అయితే టీమిండియా మాత్రం అసాధారణ ఆటతో తమ ఆశలపై నీళ్లు చల్లిందన్నాడు. హ్యాట్రిక్ విజయాలతో కోహ్లి సేన సిరీస్ సొంతం చేసుకుందన్నాడు. అయితే మిగిలిన రెండు వన్డేల్లో మెరుగైన ఆటతో భారత్‌ను ఓడించడమే తమ ముందున్న అతి పెద్ద లక్ష్యమన్నాడు. ఇందులో సఫలమవుతామనే నమ్మకం తనకుందని శాంట్నర్ అన్నాడు. నాలుగో వన్డేను పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాంట్నర్ మాట్లాడాడు.

శుభ్‌మన్‌కు ఛాన్స్ ఇవ్వాలి

గవాస్కర్





హామిల్టన్: చివరి రెండు వన్డేల్లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను ఆడించాలని భారత మాజీ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సూచించాడు. ఇప్పటికే సిరీస్ గెలిచిన నేపథ్యంలో రిజర్వ్‌బెంచ్ ఆటగాళ్లను పరీక్షించే సువర్ణ అవకాశం భారత్‌కు లభించిందన్నాడు. కివీస్ పిచ్‌లపై మంచి రికార్డు కలిగిన గిల్‌ను మిగతా రెండు మ్యాచుల్లో ఆడించడమే ఉత్తమమన్నాడు. ఈ విషయంపై జట్టు యాజమాన్యం దృష్టి సారించాలన్నాడు. బౌన్స్‌కు అనుకూలించే కివీస్‌లో భారత్ అద్భుతంగా ఆడిందని, మిగిలిన రెండు వన్డేల్లోనూ అదే జోరును కొనసాగించాలని గవాస్కర్ ఆకాంక్షించాడు. కాగా, కెప్టెన్ కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో మూడో నంబర్‌లో గిల్‌ను బరిలోకి దించడమే సబబుగా ఉంటుందని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. గిల్‌లో అపార ప్రతిభ దాగివుందన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకుంటాడనే నమ్మకం తనకుందన్నాడు. ఈ మ్యాచ్‌లో రిజర్వ్ ఆటగాళ్లతో బరిలోకి దిగినా భారత్ గెలుపు సాధించడం ఖాయమని గవాస్కర్ జోస్యం చెప్పాడు.

కోలుకుంటున్న జాకబ్ మార్టిన్





ముంబయి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చావు బ్రతుకుల కొట్టు మిట్టాడుతున్న టీమిండియా మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్ ప్రస్తుతం కోలుకుంటున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కిందటి నెల 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో జాకబ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం మరి తీవ్రంగా ఉండడంతో అత్యవసర చికిత్సను అందించారు. అయితే అతని పరిస్థితి రోజురోజుకు విషమంగా మారడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. తన భర్తను ఆదుకునేందుకు ముందుకు రావాలని మార్టిన్ భార్య బిసిసిఐను వేడుకుంది. దీనికి స్పందించిన భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేశాడు. భారత యువ క్రికెటర్ కృనాల్ పాండ్యతో సహా చాలా మంది మార్టిన్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. అంతేగాక బిసిసిఐ, ఇతర రాష్ట్రాల క్రికెట్ బోర్డులు కూడా తగిన ఆర్థిక సహాయం అందజేశాయి. దీంతో మార్టిన్‌కు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడింది. దీని ఫలితమే ప్రస్తుతం మార్టిన్ క్రమంగా కోలుకుంటున్నాడు. ఈ విషయాన్ని బరోడా క్రికెటర్ రాకేశ్ పారిఖ్ బుధవారం మీడియాకు వెల్లడించాడు.



పోలీసుల టార్చర్ భరించలేకే..

మాజీ క్రికెట్ శ్రీశాంత్





న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసుల టార్చర్ భరించలేకే స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నానని..తాను మాత్రం ఏ తప్పు చేయలేదని భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సుప్రీం కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు తనను ఎన్నో వేధింపులకు గురి చేశారని, వారి బాధలు తట్టుకోలేకు తాను చేయని నేరాన్ని ఒప్పుకోవాల్సి వచ్చిందని శ్రీశాంత్ స్పష్టం చేశారు. 2013 ఐపిఎల్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు తేలడంతో శ్రీశాంత్‌పై భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) జీవితకాల నిషేధం విధించింది. దీనిపై శ్రీశాంత్ న్యాయపోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బుధవారం జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ కె.ఎమ్.జోసెఫ్‌లతో కూడిన ద్విసభ్య బెంచ్ ఈ కేసును విచారించింది. విచారణకు హాజరైన శ్రీశాంత్ తన వాదనను ఈ విధంగా వినిపించారు.

ఇప్పటికే మూల్యం చెల్లించుకున్నా..



కరాచీ: దక్షిణాఫ్రికా క్రికెటర్ ఫెలుక్‌వాయోపై అనుచిత వ్యాఖ్యలు చేసి నాలుగు మ్యాచ్‌ల నిషేధానికి గురైన పాకిస్థాన్ క్రికెట్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ విమర్శల వర్షం కురుస్తూనే ఉంది. తాజాగా పాక్ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్ ఈ అంశంపై స్పందించాడు. సర్ఫరాజ్ వ్యాఖ్యలను ఓ పాకిస్థానీగా తాను జీర్ణించుకోలేక పోతున్నానని, ఇలాంటి చర్యలతో దేశ పరువుకు మచ్చా తెచ్చాడని విమర్శించాడు. దీనికి సర్ఫరాజ్ దీటుగా జవాబిచ్చాడు. ఏదో ఆవేశంలో తాను నోరు జారానని, దీనికి ఇప్పటికే తాను తగిన మూల్యం చెల్లించుకున్నానని సర్ఫరాజ్ స్పష్టం చేశాడు. అయినా కొందరు మాజీ క్రికెటర్లు ఇప్పటికీ తనపై విమర్శలు చేస్తుండడం ఆవేదనకు గురిచేస్తుందన్నాడు.

మన తెలంగాణ
హైదరాబాద్
గురువారం 31, జనవరి 2019
www.manatelangana.news

అయోధ్యలో రామమందిరం నిర్మాణం శంకుస్థాపన ముహూర్తాన్ని ద్వారకా పీఠాధిపతితో స్వామి స్వరూపానంద సరస్వతి ప్రకటించారు. బుధవారం కుంభమేళాలో ధర్మ సంసద్‌లో ఆయన ప్రసంగిస్తూ ఫిబ్రవరి 21న అయోధ్యలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు 500 మంది స్వామీజీలు, సాధువులతో తాను అయోధ్యకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

విశాల



చికాగోలో రైలు పట్టాలపై పేరుకుపోయిన మంచు గడ్డలను కరగదీసేందుకు గ్యాస్ ఆధారిత మంటలు పెట్టిన దృశ్యం

మంచులో అమెరికా

మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రతలు.. చలికి వణుకుతున్న 9కోట్ల మంది

మిన్నెసోటా : అమెరికాను చలి వణికిస్తోంది. మునుపెన్నడూ లేనిరీతిలో పలు ప్రాంతాల్లో భారీగా మైనస్ డిగ్రీల్లోకి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. హిమపాతం కారణంగా మిన్నెసోటాలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలి కారణంగా చాలా చోట్ల ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే కిందకు పడిపోయాయి. రహదారులు మంచుతో కూరుకుపోయాయి. విస్కాన్సిన్ ప్రాంతంలో చలి తీవ్రత మరింత తీవ్రంగా ఉంది. ఇటీవల కాలంలో ఇదే అత్యంత తీవ్రమైన హిమపాతం. దాదాపు తొమ్మిది కోట్ల మంది ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో దాదాపు 2.5 కోట్ల మంది ప్రజలు 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలో జీవిస్తున్నారని అమెరికా జాతీయ వాతారణ సేవల సంస్థ వెల్లడించింది. ఇక ఉత్తర మిన్నెసోటా, డకోటాల్లో 50 డిగ్రీలు, ఇల్లినాయిస్, గ్రేట్ లేక్స్, మిన్నెపోలీస్, డెట్రాయిట్, షికాగో తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి కారణంగా దాదాపు 1,000 విమానాలను రద్దు చేశారు. పోస్టల్ సర్వీసులు నిలిచిపోయాయి. పాఠశాలలను మూసివేశారు. యునివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, యునివర్సిటీ ఆఫ్ మిన్నెసోటాలు తరగతులను రద్దు చేశాయి.

ఎన్‌ఎస్‌సికి ఇద్దరు సభ్యుల రాజీనామా

న్యూఢిల్లీ: కొన్ని అంశాలలో ప్రభుత్వంతో అభిప్రాయభేదాలు ఏర్పడిన కారణంగా నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్(ఎన్ఎస్‌సి)కు చెందిన స్వతంత్ర సభ్యులు పిసి మోహనన్, జెవి మీనాక్షి తమ పదవులకు రాజీనామా చేశారు. మోహనన్ యాక్టింగ్‌చైర్‌పర్సన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు సభ్యులు రాజీనామా చేయడంతో ప్రస్తుతం చీఫ్ స్టాటిస్టిషిన్ ప్రవీణ్ శ్రీవాస్తవ, నీతి ఆయోగ్ సిఇఓ అమితాబ్ కాంత్ మాత్రమే ఎన్ఎస్‌సిలో ఉన్నారు. తాను తన పదవికి రాజీనామా చేసినట్లు మోహనన్ వెల్లడించారు. ఇటీవలి కాలంలో కమిషన్ సమర్థవంతంగా పనిచేయడం లేదని, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నామని ఆయన తెలిపారు. మోహనన్, మీనాక్షిల పదవీకాలం 2020 జూన్ వరకు ఉంది. 2017లో వారిద్దరూ ఎన్ఎస్‌సిలో సభ్యులుగా చేరారు. ఈ నెల 28న వారిద్దరూ తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఒక అధికారి తెలిపారు.

రాహుల్ రావణుడు.. ప్రియాంక శూర్పణఖట!

యుపి బిజెపి ఎంఎల్ఎ వివాదాస్పద వ్యాఖ్యలు

బలియా: బీహార్‌లోని కాంగ్రెస్ శ్రేణులు తమ అధినేత రాహుల్ గాంధీని రాముడితో పోలుస్తూ పోస్టర్లు అంటించగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బిజెపి ఎమ్మెల్యే ఒకరు రాహుల్‌ను లంకాధీశుడు రావణాసురుడితో, ప్రియాంక గాంధీని శూర్పణఖతో పోల్చడంతోపాటు ప్రధాని నరేంద్ర మోడీని రాముడిగా అభివర్ణించారు. బలియా జిల్లాలోని బైరియా అసెంబ్లీ నియోజకవర్గానికి బిజెపి తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సురేంద్ర సింగ్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జరగబోయేది రామ రావణ యుద్ధమేనని, లంకను గెలిచేది తామేనని తేల్చేశారు. రామాయణ గాథను నేటి రాజకీయాలతో ఆయన ముడిపెడుతూ, యుద్ధ రంగంలోకి తన సోదరి ప్రియాంక గాంధీని దింపిన రాహుల్ గాంధీ రావణుడే తప్ప రాముడు కాదని అన్నారు. నరేంద్ర మోడీపై యుద్ధం చేయడానికి ప్రియాంక గాంధీని రాహుల్ దింపారని ఆయన వ్యాఖ్యానించారు. మోడీని రాముడిగా అభివర్ణిస్తూ లంకను గెలుచుకోవడం ఇక చాలా సులభమని ఆయన చెప్పారు.

లోక్‌పాల్ కోసం అన్నా ఆమరణదీక్ష



రాలేగావ్ సిద్ధి(మహారాష్ట్ర): కేంద్రంలో లోక్‌పాల్ నియామకంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ అవినీతి వ్యతిరేక సామాజిక కార్యకర్త అన్నా హజారే బుధవారం తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. కేంద్రంలో లోక్‌పాల్‌ను, రాష్ట్రాలలో లోకాయుక్తలను నియమించకుండా మోడీ ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. లోక్‌పాల్ బిల్లును 2013లో పార్లమెంట్ ఆమోదించినప్పటికీ ఇప్పటి వరకూ లోక్‌పాల్ నియామకం జరగలేదని, ఏ పార్టీ కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నా హజారే అన్నారు. సాక్ష్యాలుంటే ప్రధాన మంత్రిని సైతం లోక్‌పాల్ ద్వారా బోనెక్కించవచ్చని, అదే విధంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరినీ లోకాయుక్త ద్వారా విచారణ పరిధిలోకి తీసుకురావచ్చని ఆయన వివరించారు. ఈ కారణంగానే లోక్‌పాల్ కాని, లోకాయుక్తలను వారెవ్వరూ కోరుకోవడం లేదని హజారే వ్యాఖ్యానించారు. తనను తాను గాంధేయవాదినని చెప్పుకునే అన్నా హజారే మహాత్మా గాంధీ వర్ధంతి నాడు తన ఆమరణ దీక్ష ప్రారంభించారు. తనతో పాటు వేదికను ఏ రాజకీయ పార్టీ నాయకుడు పంచుకోవడానికి వీల్లేదని ఆయన షరతు కూడా విధించారు.

మహాత్ముడి వర్ధంతికి తమిళనాడులో మద్య నిషేధం

చెన్నై: జాతిపిత మహాత్మగాంధీ 71వ వర్ధంతిని పురస్కరించుకుని తమిళనాడు ప్రభుత్వం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలను నిషేధించింది. అమరవీరుల దినం నాడు మద్యం అమ్మకాలపై నిషేధం విధించడం ఏ రాష్ట్రంలోను ఇప్పటివరకు జరగలేదు. తమిళనాడు మొట్ట మొదటిసారిగా మహాత్మాగాంధీ వర్ధంతినాడు మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేసింది. మద్రాసు హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ మంగళవారం జారీచేసినఆదేశాలను పురస్కరించుకుని సిఎం ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2019 సంవత్సరాన్ని మహాత్మాగాంధీ 150వ జయంతి సంవత్సరంగా పాటిస్తున్నందున ఈ ఏడాది మహాత్ముని వర్ధంతిని కూడా చిరస్మరణీయంగా స్మరించుకోవలసి ఉంటుందని, అందువల్ల మహాతమాగాంధీకి గౌరవ సూచకంగా తమిళనాడు ప్రభుత్వం జనవరి 30న రాష్ట్రంలోని మద్యం షాపులను మూసివేసి మద్య నిషేధం ప్రకటించాలని మదురై బెంచ్ ఆదేశించారు.

ఎస్‌సి,ఎస్‌టి చట్ట సవరణలపై స్టే కుదరదు

న్యూఢిల్లీ : ఎస్‌సి/ఎస్‌టి చట్టానికి సవరణలపై స్టే మంజూరీని సుప్రీం కోర్టు మరోసారి తోసిపుచ్చింది. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సి ఉందని, ఈలోగా స్టే మంజూరీ కుదరదని , కేంద్రం రివ్యూ పిటిషన్‌పై ఫిబ్రవరి 19వ తేదీన విచారణ ఉంటుందని బుధవారం ధర్మాసనం తెలిపింది. ఎస్‌సి/ ఎస్‌టి చట్టం పరిధిలో కేసులలో నిందితులకు ముందస్తు బెయిల్ ఉండరాదనే నిబంధన పునరుద్ధరణకు కేంద్రం సవరణలు చేపట్టింది. దీనిని సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ఇతరులు సవాలు చేశారు. సవరణలపై తక్షణ స్టే ఇవ్వాలనే అభ్యర్థన విషయంలో తాము ఏమీ చేయలేమని, ఇంతకు ముందే స్టే నిరాకరించామని జస్టిస్ యుయు లలిత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్, సవరణలపై దాఖలు అయిన పిటిషన్లను కలిపి ఒకేసారి విచారించడం జరుగుతుందని ధర్మాసనం మరోసారి తెలిపింది.

ఓటాన్ అకౌంట్ బడ్జెటే

స్పష్టతనిచ్చిన కేంద్ర ప్రభుత్వం • 1వ తేదీన పార్లమెంట్‌కు సమర్పించనున్న పీయూష్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వపు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో బడ్జెట్‌ను సమర్పిస్తుంది. ఇది మధ్యంతర బడ్జెట్‌గానే ఉంటుంది. దీనినే ఆర్థిక వ్యవహారాల పరిభాషలో ఓటాన్ అకౌంట్‌గా వ్యవహరిస్తారు. సార్వత్రిక ఎన్నికల సంవత్సరం కావడంతో సంవిధానానికి అనుగుణంగా పూర్తి స్థాయి బడ్జెట్‌గా కాకుండా, మధ్యంతర బడ్జెట్‌గా దీనిని రూపొందిస్తున్నారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతున్నారు. దీనితో మధ్యంతరబడ్జెట్‌ను రైల్వేమంత్రి పీయూష్ గోయల్ సభ ముందుంచే అవకాశాలు ఉన్నాయి. ఎన్‌డిఎ ప్రభుత్వానికి ప్రస్తుత అధికార హయాంలో ఇదే చివరి బడ్జెట్ అవుతుంది. ఈ బడ్జెట్‌లో రైతాంగానికి, మధ్య తరగతి ప్రజలకు కొన్ని రాయితీలు కల్పిస్తారని వెల్లడైంది. ఆర్థిక మంత్రి అందుబాటులో లేకపోవడంతో రైల్వేమంత్రి పీయూష్ గోయల్ తాత్కాలిక ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఈ మేరకు అధికారిక ప్రక్రియ సాగుతోంది. ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్‌గా ఉంటుందా? లేక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌గా ప్రవేశపెడుతారా? అనే అంశంపై పలు రకాలుగా ఊహాగానాలు చెలరేగాయి. దీనికి తోడు వాణిజ్య మంత్రిత్వశాఖ బుధవారం మీడియాకు పంపించిన వాట్సాప్ సందేశం మరింత అయోమయం సృష్టించింది. 2019–20 బడ్జెట్‌ను మధ్యంతర బడ్జెట్‌గా పేర్కొనరాదు. అధికారికంగా ఇది 2019–20 సార్వత్రిక బడ్జెట్‌గానే ఉంటుంది' అని ఈ సందేశంలో తెలిపారు. ఎన్నికల సమయంలో కేంద్రం ఈ విధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను తీసుకురావడం తగదని ప్రతిపక్షాలు విమర్శలు కురిపించాయి. ఓట్లను రాబట్టుకోవడానికి కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకురానుందని, ఇది పద్ధతి కాదని రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా పూర్తి స్థాయి బడ్జెట్ ఉంటుందనే అంశం తీవ్రస్థాయిలో కంగారు పుట్టించింది. ఎన్నికల చట్టబద్ధమైన సంవిధానానికి విరుద్ధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అనుచితం అని కాంగ్రెస్ విమర్శించింది. నిర్ధేశిత సంవిధానాలు,పార్లమెంటరీ సంప్ర దాయాలకు ఇది విరుద్ధంగా ఉందని స్పందించింది. పూర్తి స్థాయి బడ్జెట్‌పై తాము పార్లమెంట్‌లోనూ వెలుపల కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని హెచ్చరించింది. ఈ దశలోనే వెంటనే ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి వివరణ వెలువడింది. ఇప్పటి బడ్జెట్ మధ్యంతర బడ్జెట్‌గా సమర్పిస్తారని స్పష్టం చేసింది.

టీవీలు, ఫ్రిజ్‌ల ధరలకు బడ్జెట్ రెక్కలు?

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ఎసి, రిఫ్రిజరేటర్లు, టీవీలు, వాషింగ్ మిషన్లు వంటి వాటి ధరలు పెంచే అవకాశం ఉందని వెల్లడైంది. ఎలక్ట్రిక్ ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పెంచేలా బడ్జెట్‌లోయ ప్రతిపాదనలు ఉంటాయని భావిస్తున్నారు. ది కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయన్సెస్ మాన్యూఫ్యాక్చరర్ అసోసియేషన్ (సియామా) వారు ఇటీవలే కేంద్ర ప్రభుత్వానికి ఓ లేఖ పంపించారు. ఉత్పత్తి వ్యయం పెరగడంతో , ప్రామాణికతలను మరింతగా జోడించడంతో ఇంతకు ముందు ధరలను సవరించాల్సి ఉందని తెలిపాయి. పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలను పెంచేలా విదాన నిర్ణయలు తీసుకోవాలని సియామా సూచించింది. దీనిని కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని వెల్లడైంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువులలో వినియోగించే కంప్రెసర్లు, ఓపెన్ సెల్, డిస్ప్లే, ప్యానల్స్‌పై ఇప్పటి వరకూ ఐదు శాతం కస్టమ్స్ సుంకం ఉంది. దీనిని 10 శాతానికి పెంచే వీలుందని వెల్లడైంది.ఎన్నికల ముందటి బడ్జెట్ కావడంతో ఈసారి ఆర్థిక మంత్రి తరపున పీయూష్ గోయల్ సమర్పించే బడ్జెట్‌పై స్థలాల వ్యాపారులు ఆశలు వదులుకున్నారు. ఇప్పటి బడ్జెట్‌లో తమకు వెసులుబాటు ఏదీ ఉండదని రియాల్టర్లు భావిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కేంద్రం యత్నిస్తుందని, రియల్ ఎస్టేట్ రంగానికి మేలు జరగదని అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ ఛైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. ఎన్నికలకు వెళ్లే ఏ ప్రభుత్వం అయినా సహజంగానే ఓట్ల కోణంలోనే వెళ్లుతుందని, సంక్షేమ పథకాలు, రాయితీలు ఉంటాయని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి కార్యక్రమాలకు తద్వారా గ్రామీణ ప్రజానీకం అభ్యున్నతికి పథకాలను ప్రవేశపెడుతారని భావిస్తున్నారు.

ఎన్నికల్లోపే భారత్‌లో మత ఘర్షణలు

అమెరికా నిఘా సంస్థ హెచ్చరిక

వాషింగ్టన్: ఈ ఏడాది మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అధికార బిజెపి తన హిందూ జాతీయవాద సిద్ధాంతాలపై మరింత దూకుడు పెంచిన పక్షంలో భారత దేశంలో మత కల్లోలాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని అమెరికా నిఘాసంస్థ అధిపతి డాన్స్‌కోట్ ఆ దేశ ప్రజా ప్రతినిధులకు మంగళవారం తెలిపారు. 2019లో ప్రపంచ వ్యాప్తంగా ఎదురయ్యే ముప్పులకు సంబంధించి అమెరికా నిఘా సంస్థ అధ్యయనం జరిపింది. ఇందులో భాగంగా భారత్‌లో మరి కొద్ది నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలను కూడా పరిగణనలోకి తీసుకుంది. తమ అధ్యయనానికి సంబంధించిన లిఖితపూర్వక పత్రాన్ని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ డ్యాన్‌కోట్స్ మంగళవారం నిఘా వ్యవహారాలకు సంబంధించిన సెనేట్ సెలెక్ట్ కమిటీకి సమర్పించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి చెందిన భారతీయ జనతా పార్టీ తన హిందూ జాతీయవాద సిద్ధాంతాలపై ఒత్తిడి తీసుకువచ్చిన పక్షంలో పార్లమెంటరీ ఎన్నికలకు ముందు మత హింసాకాండ చెలరేగే ప్రమాదం ఉం దని సెనేట్ సెలెక్ట్ కమిటీ సభ్యులకు కోట్స్ తెలిపారు. ఈ సమావేశంలో ఇటీవలే ఇండియాలో పర్యటించిన సిఐఎ డైరెక్టర్ గీనా హాస్పెల్, ఎఫ్‌బిఐ డైరెక్టర్ క్రిస్టఫర్ రే, రక్షణ నిఘాసంస్థ డైరెక్టర్ రాబర్ట్‌యాష్లీ కూడా పాల్గొన్నారు.

భార్యకు 15 కత్తిపోట్లు

అనుమానంతో భార్యను చంపిన భర్త

ముంబయి: తన భార్యను ఆమె ఆఫీస్‌లోమంగళవారం ఉదయం కత్తితో పొడిచి హత్య చేశాడన్న ఆరోపణపై 42 ఏళ్ల కుమార్ భోయిర్ అనే వ్యక్తిని భాయేందర్ ఏరియా పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య చేసిన తర్వాత కుమార్ పోలీసులకు లొంగిపోయాడు. 35 ఏళ్లున్న తన భార్య వీణకు ఎవరితోనో అక్రమ సంబంధం ఉందని కుమార్ అనుమానించాడు. ఈ విషయంలో కుమార్..వీణ తరచు గొడవలు పడేవారు. ఆ గొడవలతో విసిగిపోయిన వీణ జనవరి 2న భర్త కుమార్‌కు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత కుమార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడని భాయేందర్ ఏరియా సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కె జాధవ్ చెప్పారు.మంగళవారం కుమార్ ఒక అపార్ట్‌మెంట్‌లో ఉన్న వీణ ఆఫీస్‌కు వెళ్లాడు. ఆమెతో మాట్లాడాలన్నాడు. ఇద్దరూ ఆఫీస్‌లో లాబీలోకి వెళ్లారు. ఇద్దరూ గొడవపడ్డారు. కోపం పట్టలేని కుమార్ కత్తి తీసుకొని ఆమెను 15 సార్లు పొడిచి పారిపోయాడని జాధవ్ చెప్పారు. ఆమెను ఆస్పత్రికి తీసుకెడుతుండగానే మరణించింది. ఆ తర్వాత కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడని, కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.





కుర్చీలో కూర్చుని.. ముక్కుకు ట్యూబ్‌తో...

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన పారికర్

పానాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. గత కొంత కాలంగా ప్యాంక్రియాస్ వ్యాధితో బాధపడుతున్న ఆయన సెక్రెటరియేట్‌కు హాజరు కాని విషయం తెలిసిందే. కుర్చీలోనే కూర్చోని ఇద్దరు అసిస్టెంట్ల సహాయంతో పారికర్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ముక్కులో ట్యూబ్‌తోనే అసెంబ్లీకి వచ్చిన ఆయన తనలో జోష్ ఉందని, ఆ జోష్‌తోనే చురుగ్గా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న పారికర్, గతంలో మూడు నెలల పాటు అమెరికాలో చికిత్స తీసుకున్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం ఆయన రఫేల్ వ్యవహారంపై రాహుల్ వ్యాఖ్యలకు లేఖ ద్వారా స్పందించారు.

చట్టంతో ఆడుకోవద్దు

- అంతా గమనిస్తున్నాం..
- ఇప్పటి వరకు మీరు కోర్టుకు సహకరించిందిలేదు
- రూ.10కోట్లు డిపాజిట్ చేసి విదేశాలకు వెళ్లి రండి
- కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టు చురకలు



న్యూఢిల్లీ: దర్యాప్తు సంస్థలకు ఏమాత్రం సహకరించకపోవడంపై మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసు సంబంధించి అణువంత సహకారం లేకపోయినా సహించేది లేదని కార్తీని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. చట్టంతో ఆడుకోవద్దని కార్తీని హెచ్చరించిన ధర్మాసనం ఇప్పటివరకు ఎటువంటి సహకారం లభించలేదని, ఇదే వైఖరి కొనసాగితే ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేసింది. "చాలా విషయాల గురించి చెప్పాలని ఉంది..కాని సంయమనంతో వ్యవహరిస్తున్నాము. మీరు ఏమాత్రం సహకరించలేదని మాత్రం చెప్పదలచుకున్నాము. ఎక్కడికైనా పర్యటించండి..కాని మీ సహాయనిరాకరణను మాత్రం సహించేది లేదు" అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం కార్తీ విదేశాలకు వెళ్లడానికి అనుమతించిన ధర్మాసనం మార్చి 5,6,7, 12 తేదీలలో మాత్రం ఇడి ఎదుట హాజరుకావలసి ఉంటుందని మాత్రం కార్తీని హెచ్చరించింది. ఈ ఆదేశాలను పాటించకపోతే మాత్రం పరిస్థితి తీవ్రంగా ఉంటుందని కూడా హెచ్చరించింది. దీంతోపాటు రూ.10కోట్లను కోర్టు సెక్రటరీ జనరల్ వద్ద జమ చేయాలంటూ కార్తీని ఆదేశించింది.

హంగ్ అనారోగ్యకరం

- స్పష్టమైన మెజారిటీ ఇవ్వండి
- ఓటర్లకు ప్రధాని మోడీ విన్నపం
- ఆ ప్రభుత్వాలకు స్థిరత్వం ఉండదు
- 30 ఏళ్లుగా అభివృద్ధి కుంటుపడింది
- సంకీర్ణ ప్రభుత్వం సరిగా పాలించలేదు
- ప్రతిపక్ష కూటమిపై మోడీ విసుర్లు



మహాత్ముడి 71వ వర్ధంతిని పురస్కరించుకుని సూరత్ సమీపంలోని దండి వద్ద ఉప్పు సత్యాగ్రహం మెమోరియల్‌ను ప్రారంభించి, ఆనాడు గాంధీజీ సేకరించిన ఉప్పును పరిశీలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ/సూరత్ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వాలని, కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరముందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. 'గత 30 ఏళ్లుగా హంగ్ పార్లమెంట్‌ల వల్ల దేశంలో అస్థిరత నెలకొంది. ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు.అందువల్ల అభివృద్ధి కుంటుపడింది. హంగ్ పార్లమెంట్ అనారోగ్యకరం. మెజారిటీ ఉన్న ప్రభుత్వం బలమైన, కఠినమైన నిర్ణయాలు తీసుకోగలుగుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం చెప్పారు. కూటమిగా ఏర్పడి పోటీ చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్య చేశారు. సంకీర్ణ ప్రభుత్వం కన్నా మెజారిటీ ఉన్న ప్రభుత్వం బాగా పాలించగలదని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ప్రభుత్వం నిరూపించిందని ఆయన అన్నారు. 'స్పష్టమైన మెజారిటీ లేకపోతే ప్రభుత్వంపై ఒత్తిడులు ఉంటాయని చెప్పగలను. గత ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు ప్రజలకోసం పనిచేసేందుకు తోడ్పడింది. అయితే ఇప్పుడు కేవలం మోడీపై ద్వేషంతోనే వాళ్లు ఒకటయ్యారని చెబుతూ ప్రధాని..'ప్రతిపక్ష కూటమి సంపన్నులు, మామాఅల్లుళ్లకోసం. ప్రతికూలత, అస్థిరత, అసమానత్వం ఉన్న ఆ కూటమి అవినీతిని, కుంభకోణాలను ప్రోత్సహించడంకోసం ఏర్పడింది' అని ఆరోపించారు. జనవరిలో కోల్‌కతాలో జరిగిన యునైటెడ్ ఇండియా ర్యాలీకి సారథ్యం వహించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని లక్ష్యంగా చేసుకొని మోడీ ఈ వ్యాఖ్య చేశారు.

సొంత ఇంటి కలలు సాకారం

గుజరాత్‌లోని సూరత్ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనానికి ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన .... రియల్ ఎస్టేట్ రంగంలో చెలామణి అవుతున్న నల్లధనాన్ని తుడిచిపెట్టేందుకు, మధ్యతరగతి, దిగువ తరగతి ఆదాయ వర్గాలవారు తమ సొంత ఇంటి కల్ని సాకారం చేసుకునేందుకు నోట్ల రద్దు ఎంతగానో దోహదం చేసిందన్నారు. 'ఒక కొత్త భారతదేశాన్ని నిర్మించడానికి మేము ప్రయత్నిస్తున్నాం. కానీ ఏళ్ల తరబడి ఈ దేశాన్ని నాశనం చేసిన వారు మా ప్రయత్నాన్ని ఎగతాళి చేస్తున్నారు. దేశంలో జరిగిన అభివృద్ధిని మధ్యతరగతివారు, పేదలు మరచిపోలేదు. ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కాంగ్రెస్‌కు 25 ఏళ్లు పడితే ఎన్‌డిఎ ప్రభుత్వం నాలుగేళ్లలో సాధించింది' అని మోడీ తమ ప్రభుత్వ విజయాన్ని వివరించారు.

నోట్ల రద్దుతో దిగొచ్చిన ధరలు

తమ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం గురించి చెబుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'నోట్ల రద్దు వల్ల కలిగిన ప్రయోజనం ఏమిటని నన్ను అడిగారు. ఆ ప్రశ్న యువతను అడగమన్నాను. ఆ ప్రశ్నను యువతను అడగాలి. అంతకు ముందు నల్లధనాన్ని రియల్ ఎస్టేట్‌కు తరలించారు. ఈ నిర్ణయం తర్వాత పరిస్థితి మారింది. నోట్ల రద్దు, రెరా వంటి నిర్ణయాలతో నల్లధనాన్ని నియంత్రించగలిగాం. ఇళ్ల ధరలు తాము కొనగలిగే స్థాయికి తగ్గడంతో యువత తాము కలలు కన్న ఇళ్లను కొనుక్కోగలిగింది' అన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666